ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-9-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 239 పేజీలు: 12 వెల: 6.50

నటి సంజనకు సుప్రీంకోర్టు నోటీసులు
ఆధార్ అప్‌డేట్‌కు ఇక రుసుముల బాదుడు 9లో





## గరుడసేవకు పోటెత్తిన భక్తులు

### తిరుమల మొత్తం జనసంద్రం

**3 లక్షల మంది పైగా రాక**

**సౌకర్యాలు భేష్.. అయినా తప్పని తిప్పలు**

**తిరుమల, సెప్టెంబరు 28ప్రభాతవార్తప్రతినిధి:** 108 వైష్ణవదివ్యదేశాలలో గరుడవాహనసేవకు అత్యంత విశిష్టత ఉంది. గరుడునిపై ఏడు కొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే ముక్తికలుగుతుందని పురాణాల ఐతిహ్యం. అంతటి మహిమాన్వితమైన గరుడసేవ ఆదివారం రాత్రి తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో జరిగింది. ఈ సందర్భంగా శనివారం ఉదయంనుండే కలియుగవైకుంఠం తిరుమలభక్తజనసంద్రంగా మారింది. >>2

# జయహో భారత్

## ఆసియా కప్ మనదే

**ఫైనల్లో పాక్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపు**

**146 పరుగులకు పాక్ ఆలౌట్**

**చివరి నిముషందాకా నరాలు తెగే ఉత్కంఠ**

**సంబరాల్లో మునిగితేలిన క్రికెట్ అభిమానులు**

**9వ సారి ఆసియాకప్ గెలిచిన టీమిండియా**

పాక్ : 146 ఆలౌట్ - భారత్ : 150/5



**దుబాయ్, సెప్టెంబర్ 28:** ఆసియా కప్‌ను మరోసారి టీమిండియా ముద్దాడింది. ఫైనల్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 4 వికెట్లు పడగొట్టి పాకిస్తాన్‌ను తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో సఫలీకృతుడయ్యాడు. అనంతరం టీమిండియా 5 వికెట్లు కోల్పోయి ఇంకా రెండు బంతులు మిగిలి ఉండగానే, 147 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ గెలవడంతోపాటు ఆసియా కప్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. తొమ్మిదోసారి చాంపియన్‌గా నిలిచి భారత జట్టు చరిత్ర సృష్టించింది.

ఇక మ్యాచ్ విషయానికొస్తే, టాస్‌గెలిచిన టీమిండియా బౌలింగ్ ఎంచుకోగా, పాక్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు సహిబ్జాద పర్హాన్(57), ఫఖర్ జమాన్ (46) రాణించగా, మిగతా బ్యాటర్లు >>2



## ప్రకాశం బ్యారేజి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకాశం బ్యారేజి వరద ఉధృతి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇక్కడ ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 6.05 లక్షల క్యూసెక్కులుగా ఉంది. దీంతో 69 గేట్లు ఎత్తినీటిని విడుదల చేస్తున్నారు. లంక గ్రామాల ప్రజలను జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణానదికి భారీగా వరద వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కృష్ణానదికి వరదల దృష్ట్యా మండలాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. కొల్లూరు మండల కంట్రోల్ రూం నంబర్ 7794894544,భట్టిప్రోలు మండలం కంట్రోల్ రూం నెంబరు 8179886399గా గమనించి పరిస్థితులు వివరించి రక్షణ పొందవచ్చునని అధికారులు వివరించారు.దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.ప్రకాశం బ్యారేజీ దిగువ సెల్ఫీ దిగడం.ఘాట్ దాటి రావడం సరికాదని, ప్రాణాంతకమని అధికారులు హెచ్చరిస్తున్నారు.కృష్ణా నదిలో బోట్లు విహారాన్ని నిషేదించారు.

## అరకు కాఫీకి అంతర్జాతీయ అవార్డు

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** అరకు కాఫీకి 'ఛేంజ్‌మేకర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది.ఇది అంతర్జాతీయ స్థాయిలో ఇచ్చే అవార్డు, అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు పట్ల సిఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. అరకు వ్యాలీ కాఫీ మరో ఘనత సాధించిందని పేర్కొన్నారు. 'ఛేంజ్‌మేకర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించడం శుభపరిణామం అని చెప్పారు. ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో ఇది దక్కిందని పేర్కొన్నారు. గిరిజన రైతుల కృషితో బలమైన సామాజిక స్థానం సాధ్యమైందన్నారు.అరకు కాఫీ తోటల సాగులో గిరిజన రైతులు అవిశ్రాంతంగా, అంకితభావంతో కృషి చేశారని ప్రశంసించారు. అరకు కాఫీ తోటల సాగులో గిరిజన రైతులు స్థిరమైన ఆదాయాలను పొందుతున్నారని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయీ గుర్తింపును సాధించారని కొనియాడారు.



## అక్టోబర్ 2న ఖాదీయే ధరించండి

### మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** నిస్వార్థ సేవా స్ఫూర్తి, క్రమశిక్షణలే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) నిజమైన బలాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రతీపనిలోనూ 'నేషన్ ఫస్ట్‌కే' ప్రాధాన్యత ఇస్తారని కొనియాడారు. 100వ వ్యవస్థాపక దినోత్సవాలను ఆర్‌ఎస్‌ఎస్ ఘనంగా నిర్వహించుకుంటున్న వేళఆదివారంరోజు 126వ 'మన్ కీ బాత్'లో మోడీ ఈ వ్యాఖ్యలుచేశారు. విజయదశమి రోజునే ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావం ఇంకొన్ని రోజుల్లో మనం విజయ దశమిని జరుపుకో బోతున్నాం. ఓ >>2


## విద్యుత్ కొనుగోళ్లపై వెయ్యి కోట్లు ఆదా

**గత ప్రభుత్వ అసమర్థ విధానాల వల్లే ప్రజలపై భారం**

**జిఎస్టీ సంస్కరణపై ప్రచారం జరపండి**

**రోగులు వాడే మందులపై జిఎస్టీ తొలగింపు శుభసూచికం**

**వైఎస్సార్సీ ఎమ్మెల్యేలు సభకు రారు, ఎమ్మెల్సీలు వస్తారు.. ఇదో చోద్యం : సిఎం చంద్రబాబు**



**విజయవాడ,సెప్టెంబరు28,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి పార్టీలు జిఎస్టీ సంస్కరణల ఉత్సవ్‌పై ప్రచారం చేపట్టాలని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆదివారం టిడిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ .. వైఎస్సార్సీ హయాంలో అవలంభించిన అసమర్థ విధానాలతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడిందని విమర్శించారు. తక్కువ ధరకు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టామని, దీంతో రూ.వెయ్యి కోట్లు ఆదా అయినట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలపై రూ.వెయ్యి కోట్ల భారాన్ని తగ్గిస్తున్నామన్నారు. జిఎస్టీ సంస్కరణలను ప్రజలకు కార్యకర్తలు వివరించాలన్నారు. కూటమి పార్టీలు జిఎస్టీ సంస్కరణల ఉత్సవ్ ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 60 వేల సమావేశాలు పెట్టి ప్రజలకు వివరించాలని కోరారు. 11 మంది వైఎస్సార్సీ ఎమ్మెల్యేలు శాసనసభకు రావడం లేదనీ, ఆ పార్టీ ఎమ్మెల్సీలు మాత్రం సభకు వస్తున్నారని .. ఇదేం ద్వంద్వ వైఖరి? అని చంద్రబాబు ప్రశ్నించారు. జిఎస్టీ సంస్కరణలతో ఎన్డీఎ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ మార్పులను ప్రజలకు వివరించి చెప్పాలనిసూచించారు. జిఎస్టీ ఉత్సవ్‌లో భాగంగా జిఎస్టీ సంస్కరణలను వివరిద్దామని మార్గనిర్దేశం చేశారు. పారిశ్రామిక, ఆటో మొబైల్, ఫార్మా, వంటి కంపెనీలకు జిఎస్టీ సంస్కరణలో మేలు జరుగుతోందని చెప్పుకొచ్చారు. టూ వీలర్, ఏసీలు, కార్లు, వంటింటి వస్తువుల ధరలు తగ్గుతాయని వివరించారు. ప్రజలు నిత్యం ఉపయోగించే వస్తువులకు కూడా జిఎస్టీతగ్గిందని... రోగులు వాడే మందులపై జిఎస్టీ లేదని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ.. ఎపి అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామని గుర్తుచేశారు. జిఎస్టీ సంస్కరణలతో ప్రజలకు రూ. 8 వేల కోట్లమేర లబ్ధి జరగుతోందని వెల్లడించారు. గత జగన్ ప్రభుత్వం విద్యుత్ శాఖను సంక్షోభంలోకి నెట్టేసిందని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీ ప్రభుత్వం అసమర్థ విధానాలతో ప్రజలపై విద్యుత్ ఛార్జీలరూపంలో భారంపడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి >>2

## చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ముగ్గురు మావోయిస్టులు మృతి

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** చత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో ఆదివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులను ఏరివేయడమే లక్ష్యంగా కాంకేర్‌గారియాబంద్ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రతాదళాల రాకను గుర్తించిన నక్సలైట్లు వారిపై ఎదురుకాల్పులకు దిగడంతో అప్రమత్తమైన భద్రతా దళాలువెంటనే కాల్పులు ప్రారంభించారు.ఇద్దరి మధ్య గంటలపాటు ఎదురు కాల్పులు కొనసాగగా.. ముగ్గురు మావోయిస్టుల మృతిచెందారు. మృతి చెందిన వారిలో ముగ్గురిపై రూ.14 లక్షల రివార్డు ఉన్నట్టు భద్రతా దళాలు గుర్తించారు.మృతుల్లో మహిళ ఉంది. ఘటనా స్థలంలో వారినుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మృతిచెందినవారు సర్వాన్ మడ్కంసా రూ.8లక్షల రివార్డు, రాజేష్ అలియాస్ రాకేష్ హేమ్లాపై రూ.5లక్షల రివార్డు, బసంతి కుంజమ్‌పై రూ.1లక్ష >>2

## కొత్తగా మున్సిపాలిటీలు నగర పంచాయతీలు

### పట్టణీకరణకు సర్కార్ ప్రాధాన్యం

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో పట్టణ ప్రాంతాన్ని విస్తృతంగా పెంచే దిశలో ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.ఆదాయం వృద్ధిపాటు,ఆధునీకరణ తదితరంశాలను ఈ క్రమంలో చేపట్టాలని చూస్తోంది.దీంతో ఎపిలో మరిన్ని నగర పంచాయతీలు,వివిధ గ్రేడుల మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు పెరిగే అవకాశం ఉంది. జిఎస్డిపి మెరుగుపరచుకునేందుకు పట్టణీకరణకే ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ కూడా సిద్ధం చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభిస్తోంది. దీని కోసం పరిశ్రమల స్థాపన, పంచాయితీల విలీనం, పంచాయితీల స్థాయి పెంపు వంటి అంశాలను పరిశీలిస్తోంది. దీనికోసం అవసరమైన కసరత్తు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు కూడా సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో 36 శాతం పట్టణ ప్రాంతం ఉంది. 2047 నాటికి దీనిని 60శాతానికి పెంచేందుకు లక్ష్యంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ప్రణాళికశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకు అనేక కోణాల్లో కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. ప్రధానంగా పంచాయితీలను నగర పంచాయితీలుగా మార్చడం, >>2

## 238 ఆసుపత్రుల్లో 'గోల్డెన్ అవర్' చికిత్స

**మరో 3,402 మందికి రూ. 7 కోట్ల విలువైన చికిత్స**

**పేద గుండెల ఉచిత చికిత్స వ్యయం రూ. 100 కోట్లు: మంత్రి సత్యకుమార్ యాదవ్**



**విజయవాడ, సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆరోగ్య సంరక్షణ గురించి వైద్య సేవలను కూటమి మందికి గుండె సంబంధిన ముందస్తు రోగ నిర్ధారణ పరీక్షలద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తూందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యమార్ యాదవ్ తెలిపారు.మరోపక్క ఆసుపత్రుల్లో వైద్య సేవలు, మౌలిక వసతులు మెరుగుపరుస్తోందన్నారు. పపంచ హృద్రోగ దినోత్సవం సందర్భంగా మంత్రి సత్యకుమార్ ఆదివారం ఓ ప్రకటన జారీచేశారు.

ఈ ప్రకటనలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి సెప్టెంబరు 26వ తేదీ వరకు 1.41 లక్షల మందికి రూ.996 కోట్ల విలువైన వైద్యాన్ని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా ఉచితంగా అందినట్లు తెలిపారు గుండెపోటుకు గురైన వారికి మండలాల స్థాయిలో తొలిగంట (గోల్డెన్ అవర్)లో అందించిన రూ.7 కోట్ల విలువైన వైద్యంతో 3,402 మందికి ప్రాణాయ పరిస్థితులు తప్పినట్లు చెప్పారు. ఈ నెల 29 (సోమవారం) గుండె చికిత్సకు అయిన వ్యయమే అత్యధికం అన్నారు.ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా గత యేడాది జూన్‌నుంచి ఇప్పటివరకు చికిత్స పొందినవారు 19,61,257 మంది ఉండగా వీరికి అందించిన చికిత్సల వ్యయం >>2

## నిర్లక్ష్యమా! కుట్రకోణమా?



**కరూర్ ర్యాలీ తొక్కిసలాటలో 40కి పెరిగిన మృతులు**

**హైకోర్టును ఆశ్రయించిన విజయ్ టివికె పార్టీ**

**ఘటనా స్థలాన్ని సందర్శించిన ఏకసభ్య కమిషన్**

**మృతుల కుటుంబాలకు విజయ్ రూ. 20 లక్షల సాయం**

**చెన్నై, సెప్టెంబరు 28:** నటుడు టివికె విజయ్ కరూర్ ర్యాలీకి సంబంధించి ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని చట్టప్రకారం వెళతామని డిఎంకె ప్రభుత్వం ప్రకటిస్తే ఈ ర్యాలీలో కుట్రకోణం ఉందని, రాళ్లు రువ్వడంవల్లనే జరిగిందని విజయ్‌పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. మరోపక్క కేంద్ర హోంశాఖ కూడా ఈ దుర్ఘటనను తీవ్రంగా పరిగణిస్తోంది. సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్రాన్ని ఆదేశించింది. ర్యాలీలో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి మృతుల సంఖ్య 40కి పెరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరొకరు ప్రాణాలు వదిలారని అధికారులు ప్రకటించారు.

ఇప్పటివరకూ 30 మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్షతగాత్రుల్లో 26 మంది డిశ్చార్జి అయ్యారు. మరో 67 మంది వేరువేరు ఆసుపత్రుల్లో చికిత్సపొందుతుండగా ఇద్దరిపరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్యమంత్రి సెంథిల్‌కుమార్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టివికె విజయ్ నిర్వహించిన ర్యాలీసంఘటన ఇపుడు రాజకీయ పార్టీలను రగిలిస్తోంది. విజయ్ ర్యాలీకి ఏడుగంటలు ఆలస్యంగా రావడంవల్లనే తొక్కిసలాట జరిగిందని తమిళనాడు డిజిపి స్వయంగా ప్రకటించడం మరింత రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. ఈ విషాదానికి కారణంగా నటుడు విజయ్ చేసిన సోషల్‌మీడియా ట్వీటేనని డిజిపి శంకర్ జివాల్ వెల్లడించడంతో మరింత అసహనం పెరిగిందని వెల్లడించారు. ఎక్కువసేపు ప్రజలు వేచి ఉండటంవల్లనే జనంమరింతపెరిగి తొక్కిసలాటకు కారణం అయిందన్నారు. ఇదిలా >>2

బీహార్‌లో నితీశ్‌కు ఎదురుగాలి! 5లో
ఈ సారి మహాఘట బంధన్‌కు అవకాశం!




ఆదివారం బల్‌రామ్‌పూర్ జిల్లాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి ఓ స్టాల్‌ను పరిశీలిస్తున్న యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్

# శాసనసభ రికార్డుల నుంచి కామినేని, బాలకృష్ణల వ్యాఖ్యల తొలగింపు

**విజయవాడ,సెప్టెంబరు28,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనసభలో ఈ నెల 25న శాంతిభద్రతల అంశంపై చర్చ సందర్భంగా కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ దానికి ప్రతిస్పందనగా హిందూపురం ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలిగించారు.అసెంబ్లీ కార్యాలయ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి.ఈ వ్యాఖ్యలు తొలగించాలని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. తన వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగించాలని కామినేని శాసనసభలో స్పీకర్ స్థానంలో కూర్చున్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజును కోరారు. 'గురువారం సభలో తాను ప్రస్తావించిన కొన్ని విషయాలు అపార్థాలకు దారితీశాయనే అభిప్రాయం కల్గింది. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నా' అని ఆయన విజ్ఞప్తి చేశారు. కామినేని అభ్యర్థనను స్పీకర్‌కు విన్నవించి, తదుపరి చర్యలుతీసుకుంటామని, ఆయన అభిప్రాయాన్ని గౌరవిస్తామని రఘురామ కృష్ణరాజు పేర్కొన్నారు. కామినేని అభ్యర్థన మేరకు ఆయన వ్యాఖ్యలతో పాటు,వాటికి అనుబంధంగా బాలకృష్ణ చేసిన వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్ నిర్ణయించినట్లు శాసనసభ వర్గాలు తెలిపాయి. 'కామినేని వ్యాఖ్యలు తొలగించినప్పుడు,దానికి ప్రతిస్పందనగా బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలూ నిరర్థకమవుతాయి. కాబట్టి మొత్తం ఆవ్యాఖ్యలన్నీ రికార్డులనుంచి తొలగించాలని నిర్ణయించారు' అని వెల్లడించాయి.



ఆదివారం హైదరాబాద్‌లో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శిస్తున్న సిఎం చంద్రబాబు

# డి.సిఎం పవన్‌కు సిఎం చంద్రబాబు పరామర్శ

**విజయవాడ,సెప్టెంబరు 28, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను సిఎం చంద్రబాబు నేడు పరామర్శించారు. హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి చంద్రబాబు చేరుకున్నారు. ఆయనతో మాట్లాడి.. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. పవన్‌కు చంద్రబాబు ధైర్యం చెప్పారు. ఐదు రోజులుగా పవన్ కల్యాణ్ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నట్లు సమాచారం.రాజకీయ పరిణామాలపై వీరిమధ్య చర్చ జరుగుతున్నట్లు సమాచారం. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ జ్వరంతోనే ఇటీవల అసెంబ్లీకి, తన శాఖలపై సమీక్షలు చేశారు. అనంతరం వైద్యులు పవన్ కల్యాణ్‌కు వైద్యం అందించారు. వైద్యులకు చూపించిన జ్వరం తగ్గక పోవడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో పవన్ కల్యాణ్ చూపించుకున్నట్లు సమాచారం. ఇంకా జ్వరంతోనే ఆయన బాధపడుతున్నారు. ఈ క్రమంలో పవన్‌ని పరామర్శించడానికి సిఎం చంద్రబాబు ఆయన నివాసానికి చేరుకున్నారు. ప్రస్తుతం జ్వరం తీవ్రత లేదని, దగ్గు ఎడతెరిపి లేకుండా వస్తోందని పవన్‌తెలిపారు. పరీక్షలు చేసి క్రానిక్ బ్రాంకైటిస్ మూలంగా దగ్గు ఎక్కువగా వస్తోందని, ఫలితంగానే గొంతు దగ్గర నొప్పి కూడా ఉందని వైద్యులు చెప్పినట్లు వివరించారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి ఒకేసారి 15,941 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడాన్ని ప్రస్తావించారు. అక్టోబర్ 4వ తేదీన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంపై చర్చించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని విజయవంతంగా అమలు చేయగలిగామని, తద్వారా మహిళలకు ఆర్థికపరమైన వెసులుబాటు కలుగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు.

# వెయ్యి కోట్లు ఆదా

>> వచ్చిన 15 నెలల్లో విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టామని నొక్కి చెప్పారు. నేడు తక్కువ ధరకు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టామని తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో విద్యుత్ కొనుగోళ్లల్లో సుమారు రూ.1000 కోట్లు ఆదా చేశామని వివరించారు. ఆ మేరకు రానున్న కాలంలో ప్రజలపై రూ.1000 కోట్ల భారాన్ని తగ్గిస్తున్నామని వెల్లడించారు. సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీలను నెరవేర్చామని ఉద్ఘాటించారు. తమ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను కార్య కర్తలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జిఎస్టీ సంస్కరణలతో మేడిన్ ఇండియా మరింత బలోపేతం అవుతోందని సిఎం బలమైన, సమతుల్యమైన సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. జిఎస్టీ సంస్కరణలతో ఏపీ ప్రజ లకు రూ.8వేల కోట్ల లాభం కలుగుతుందని తెలిపారు. దేశీయఉత్పత్తులుకొనాలని.. దేశాభి వృద్ధిలో భాగస్వాములుకావాలని దిశానిర్దేశం చేశారు. దసరా నుంచి దీపావళి వరకు జిఎస్టీ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. జిఎస్టీపై ఓ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తాం. సూపర్ జిఎస్టీ, సూపర్ సేవింగ్స్ అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పారు. జిఎస్టీ ఫలితాలు పేదలు, అన్నివర్గాల స్టేక్ హోల్డర్‌లకు చేర్చాలి. దీనికి 30 రోజులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. దీని అమలుకు ఒక కమిటీ వేశాం. హెచ్‌ఆర్డీ మంత్రి లోకేష్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హోంమంత్రి వంగలపూడి అనిత, టూరిజం మంత్రి కందుల దుర్గేష్‌లతో ఈ కమిటీ వేశాం. భారతీయ ఉత్పత్తులను కొంటే అది కేవలం ఒక లావాదేవి మాత్రమే కాదు.. అది మన సమాజ అభివృద్ధికి హామీ అని సిఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.

ఇంటింటికీ జిఎస్టీ కరపత్రాలు తీసుకెళ్లి అగ్రికల్చర్, ఇతర అంశాల్లో ఎలా లబ్ధి కలుగుతుందో వివరిస్తాం. జిఎస్టీ సవరణలతో డిజిటల్ ఇండియా, డిజిటల్ ఆంధ్రప్రదేశ్ సాధ్యం. చాలా వరకూ 15వేల గ్రామ సచివాలయాల్లో మీటింగ్‌లు పెట్టి అందరినీ ఇన్వాల్వ్ చేస్తాం. 10వేల రైతు సేవా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తాం.

అక్టోబర్ 7, 8 తేదీల్లో విద్యాసంస్థల్లో జిఎస్టీ గురించి వివరిస్తాం. అక్టోబర్ 9న విలేజ్ హెల్త్ సెంటర్‌లు, వెల్ నెస్ సెంటర్లలో కార్యక్రమం నిర్వహిస్తాం. బిల్డింగ్ వర్కర్లతో అక్టోబర్ 11న 850 సెంటర్లలో కార్యక్రమం నిర్వహిస్తాం. విలేజ్ సెక్రటేరియట్, రైతు సేవా కేంద్రాల్లో ఎక్కడికక్కడ ఒక్కొక్కరినీ ఏర్పాటు చేసి ప్రజల్లోకి తీసుకెళ్తాం. మీడియా, హోర్డింగ్స్, ఇంటర్వ్యూలు ఇవ్వడం, పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలు, సెలబ్రెటీలతో మాట్లాడించి అన్ని చేస్తాం. ఎమ్మెల్యేలు ఇచ్చే అంశాలను కూడా మంత్రి వర్గ ఉపసంఘం ఇంక్లూడ్ చేస్తుంది. ఈ సంవత్సరం బ్రహ్మాండంగా ఆనందంగా పండుగలను ప్రజలు చేసుకోవాలి అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# భారీ ఎన్‌కౌంటర్

>> రివార్డు ఉన్నట్టు అధికారులు తెలిపారు. సర్వాన్ మావోయిస్టు కోఆర్డినేషన్ ఏరియా కమిటీ కార్యదర్శి కాగా.. మరొకరు రాజేష్ నగరి ఏరియా కమిటీ గోబ్రా కమాండర్ ఉన్నారు. కాల్పుల ఘటనపై బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ స్పందించారు. మావోయిజం అంతరించిపోయే దశలో ఉందనే వాస్తవాన్ని మావోయిస్టు కార్యకర్తలు అంగీకరించాలని అన్నారు.

# భారత్ ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి వరకు 8 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే

## తెలంగాణ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ సెప్టెంబరు 28,ప్రభాతవార్త :** భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి విజయవాడ (ఎన్‌హెచ్65)జాతీయ రహదారి 8లేన్ విస్తరణకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకొని 2026 ఫిబ్రవరిలో పనులు ప్రారంభం కానున్నాయని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.హైదరాబాద్ నుండి విజయవాడ జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉండడమే కాకుండా యాక్సిడెంట్స్ ఎక్కువ జరుగుతున్న రహదారుల్లో ఒకటని మంత్రి అన్నారు. ఇప్పటికే 17 బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్నామని చెప్పారు.ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసినప్పుడు ఈఅంశాన్ని గుర్తుచేశానని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు యాక్సిడెంట్ ఫ్రీ రహదారిని అందుబాటులోకి తేనున్నామని, అధునాతన టెక్నాలజీతో,పూర్తి నాణ్యతతో హైదరాబాద్ నుండి విజయవాడ కు రోడ్ నిర్మించబోతున్నట్లు మంత్రి ప్రకటించారు.ఈ 8 వరుసల రహదారి పనులు పూర్తి ఐతే హైదరాబాద్ నుండి విజయవాడకు కేవలం 2 గంటల్లో చేరుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుండి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి 230 కి.మీ గ్రీన్ ఫీల్డ్ హైవే పట్ల కేంద్ర మంత్రి గడ్కరీ పూర్తి సానుకూలంగా ఉన్నట్లు మంత్రి వెల్లడించారు.

# 238 ఆసుపత్రుల్లో 'గోల్డెన్ అవర్' చికిత్స

>> రూ. 5,562కోట్లు ఇందులో హృద్రోగ సమస్యలతో చికిత్స పొందిన వారు 1,41,315 మంది ఉన్నారు. వీరికి రూ.996.20 (17.91) కోట్ల విలువైన వైద్యాన్ని కూటమి ప్రభుత్వం అందించింది. వీరిలో స్టంట్లు 45,986 (32.54) మంది, బైపాస్ సర్జరీలు 9,880 (6.99), వాల్వ్ రీప్లేస్ వేయించుకున్న వారు 3,074 (2.18 ) మిగిలిన వారిలో ఇతర సమస్యలు కలిగిన వారు ఉన్నారని తెలిపారు క్యాన్సర్ బాధితులు 69,926 మంది ఉండగా వారికి కూటమి ప్రభుత్వం రూ.965.48 (17.36 ) కోట్ల విలువైన వైద్యాన్ని అందించింది. ఆ తరువాత ఆర్థో కు సంబంధించి 2,04,108 మంది చికిత్స పొందారు. వీరికి అయిన వ్యయం రూ.641.89 (11.54 ) కోట్లు" అని మంత్రి సత్యకుమార్ వివరించారు.

'గుండె సంబంధ వ్యాధుల చికిత్స అందించే ఆసుపత్రుల సంఖ్య గతంలో కంటే కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన అనంతరం పెంచాం. ప్రైవేటు, కార్పొరేటు రంగంలో కలిసి 161 ఆసుపత్రులు, 26 ప్రభుత్వాసుపత్రుల్లో గుండె సంబంధ వ్యాధుల చికిత్స ప్రస్తుతం అందుబాటులోనికి తెచ్చాం. మంగళగిరి ఎయిమ్స్, శ్రీకాకుళంలోని మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రిలోనూ గుండె సంబంధ వ్యాధులకు చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుద్వారా అందుబాటులోనికి తెచ్చాం. 202324లో కంటే 202425 లో ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స పొందిన వారి సంఖ్య 13,921 నుంచి 17,500కు పెరిగింది అని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.రాష్ట్రంలోని 238 ఆసుపత్రుల్లో గోల్డెన్‌అవర్ చికిత్సఅందుబాటులో ఉంది. 'స్టె మీ' విధానంలో గుండెపోట్లకు గురైన వారికి గోల్డెన్ అవర్లోనే ఈ ఆసుపత్రుల్లో ఉచితంగా బాగా ఖరీదైన ఇంజెక్షన్లు ఇవ్వడం ద్వారా 3,402 మంది రోగుల ప్రాణాపాయ పరిస్థితులు తప్పాయి సామాజిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ఈ వైద్యం అందుబాటులోనికి తీసుకువచ్చాం. టెలీ మెడిసిన్ (హబ్ అండ్ స్పోక్) విధానంలో గోల్డెన్ అవర్లో గుండెపోట్లుకు గురైన వారికి త్వరితగతిన చికిత్స అందించేందుకు అమల్లోనికి తెచ్చిన 'స్టెమీ' విధానం 3,402 మందికి టెనెక్ట్ ప్లేస్ (రక్త గడ్డం కరగడానికి) ఇంజక్షన్లు ఇచ్చాం. ఈ ఇంజక్షన్ లను గ్రామీణులకు అందుబాటులో ఉంచుతున్నాం అని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్య సంరక్షణ విషయంలో ఏ మాత్రం రాజీపడడంలేదన్నారు.

అసాంక్రమిక వ్యాధుల గుర్తింపులో భాగంగా రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ (ఓరల్, బ్రెస్టు, సర్వైకల్) లక్షణాలు కలిగిన వారిని సర్వే ద్వారా గుర్తిస్తున్నాం. వీటి ద్వారా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించిన వారికి తదుపరి చికిత్స అందిస్తూనే జీవనశైలి, ఇతర విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం జీవనశైలి, ఆహార అలవాట్లలో మార్పులు చేసుకుంటే ఆరోగ్యాలు బాగుంటాయి. రాష్ట్రం పై రోగాల భారం కూడా తగ్గుతుందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

# చైనాలో మాజీ వ్యవసాయ మంత్రికి మరణశిక్ష

**బీజింగ్, సెప్టెంబరు 28:** అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న చైనా ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం ప్రకటించింది. దేశ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి టాంగ్ రెన్‌జియాన్‌కు మరణశిక్ష విధిస్తూ జిలిన్ ప్రావిన్స్ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. సుమారు రూ.334 కోట్ల విలువైనలంచాలు స్వీకరించినట్లు ఆయనపై ఆరోపణలు రుజువు కావడంతో ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. అయితే, విచారణకు పూర్తిగా సహకరించినందున శిక్ష అమలును రెండేళ్ల పాటు వాయిదా వేస్తున్నట్లు కోర్టు తన తీర్పులో పేర్కొంది. టాంగ్ రెన్‌జియాన్ 2007 నుంచి 2024 మధ్య కాలంలో పలు ప్రభుత్వ ఉన్నత పదవుల్లో పనిచేశారు. ఈ సమయంలో ఆయన తన అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు తేలింది. వ్యాపార సంస్థలకు అనుకూలంగా వ్యవహరించడం, కాంట్రాక్టులు ఇప్పించడం, ఉద్యోగ నియామకాలు జరపడం వంటి పనుల కోసం భారీ మొత్తంలో లంచాలు స్వీకరించినట్లు కోర్టు నిర్ధారించింది. మొత్తం 268 మిలియన్ యువాన్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.334 కోటు విలువైన నగదు, ఆస్తులు, ఇతర విలువైన వస్తువులను ఆయన లంచాల రూపంలో తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. విచారణ సమయంలో టాంగ్ తన నేరాలన్నింటినీ అంగీకరించారు. మరణశిక్షతో పాటు, టాంగ్ రెన్‌జియాన్‌పై మరిన్ని కఠిన చర్యలకు కోర్టు ఆదేశించింది.

# జయహో భారత్




>> ఎవరూ క్రీజులో నిలబడలేకపోయారు. సయీమ్ అయూబ్ 14, కెప్టెన్ సల్మాన్ అఘా 8, మొహమ్మద్ నవాజ్ 6, హరీష్ రవూఫ్ 6 పరుగులు మాత్రమే చేశారు. దీంతో పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 4 వికెట్లు పడగొట్టగా, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా రెండేసి వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం 147 పరుగుల లక్ష్యఛేదనతో బరిలోకి భారత్, ఓపెనర్ అభిషేక్ శర్మ(5) నిరాశపరిచాడు. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (1) మరోసారి నిరుత్సాహపరిచాడు. మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (12) ఎక్కువసేపు క్రీజులో నిలబడలేకపోయాడు. 4 ఓవర్లకే 3 కీలక వికెట్లు జారవిడుచుకుని భారత జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ ఆచితూచి ఆడుతూ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు, సిక్సర్లు బాదుతూ జట్టు స్కోరుబోర్డును పరుగులెత్తించాడు. అభిమానుల్లో సంతోషం నింపాడు. సంజూ శాంసన్‌తో, శివమ్ దూబెతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్ది జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో టీమిండియా 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్ గెలుపులో బౌలింగ్‌లో కుల్‌దీప్ యాదవ్, బ్యాటింగ్‌లో తిలక్ వర్మ, శివమ్ దూబె అద్భుత ప్రదర్శనే కీలక పాత్ర పోషించింది.

**టోర్నీలో మూడుసార్లు పాక్ ఓటమి**

ఆసియా కప్ టోర్నీలో భారత్ చేతిలో పాకిస్తాన్ మూడు సార్లు పరాజయం పాలైంది. లీగ్‌లో ఓ సారి, సూపర్-4లో రెండోసారి, ఫైనల్‌లో మరోసారి చిత్తుగా ఓడింది. మొత్తమ్మీద పాకిస్తాన్‌పై తమదే పైచేయి అని మరోమారు టీమిండియా నిరూపించుకుంది.

## వారం - వర్జ్యం

29-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
సప్తమి సా.4.28
మూల పూర్తి
వర్జ్యం : రా.4.32-6.17
దు.మ.12.23-1.11,
2) మ.2.47-3.35
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** వృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. నూతన పెట్టుబడులలో నిదానం అవసరం.

**వృషభం:** శత్రువర్గం ఎంతగానో ఇబ్బంది పెడతారని మీరు భావిస్తారు. వాహనసౌఖ్యం.

**మిథునం:**ముఖ్యమైన పత్రాలను జత చేయవలసిన వాటిని మరిచిపోయే అవకాశం ఉంది.

**కర్కాటకం:**హితులు, శ్రేయోభిలాషులు, పెద్దలను కలుసుకొని చర్చలు సాగిస్తారు.

**సింహం:**ఉద్యోగయత్నాలు ముమ్మరం చేసి సానుకూల ఫలితాలను సాధిస్తారు.

**కన్య :** పుకారులను నమ్మకండి. సంతాన విద్యా విషయంలో కొంత అశాంతికి లోను అవుతారు.

**తుల :**శ్రమించి అనుకున్న పనులు ఆలస్యంగానైనా పూర్తిచేసి నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు.

**వృశ్చికం:**భాగస్వామ్య పెట్టుబడులలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగిన సూచన.

**ధనుస్సు:** మీ మాట దురుసుతనం వల్ల మిత్రులు సైతం శత్రువులుగా మారే ప్రమాదం ఉంది, జాగ్రత్త.

**మకరం:** బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కుంభం:** పాత బాకీలు వసూలై ఆర్థిక అవసరాలు తీరుతాయి.

**మీనం :** ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఆరోగ్య సమస్యలు కొంత మెరుగుపడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నిర్లక్ష్యమా! కుట్రకోణమా?

>> ఉంటే టివికె విజయ్ ర్యాలీ సంఘటనకు సంబంధించి కేంద్ర హోంశాఖ సమగ్రనివేదికలు కోరింది. సంఘటన ఎలా జరిగింది, పూర్వాపరాలు, రాష్ట్రప్రభుత్వ చర్యలు వంటి వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరింది. అలాగే తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌లు ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్న బాధితులను పరామర్శించారు. అనుకోకకుండా 30 వేలమందికిపైగా ఒక్కసారిగా వచ్చిపడటంతో తొక్కిసలాట జరిగింది. రాష్ట్రప్రభుత్వం మృతుల కుటుంబాలక పదిలక్షలు, బాధితులకు లక్షరూపాయలు చొప్పున పరిహారం ప్రకటిస్తే కేంద్రంనుంచి పిఎం సహాయనిధినుంచి మృతులకు రెండు లక్షలు, గాయపడినవారికి 50 వేల వంతున ఆర్థికసాయం ప్రకటించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలంటూ ఆదేశాలు జారీచేసారు. ఇదిలా ఉంటే టివికె చీఫ్ విజయ్‌పై పోలీసులు కేసునమోదుచేసిన సంగతి తెలిసిందే. పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్, జాయింట్ సెక్రటరీనిర్మల్‌కుమార్‌లపై ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసారు. ఎడిజిపి ఎస్ డేవిడ్‌సన్ ధృవీకరించారు. విజయ్ ఇద్దరు సహాయకులపైనా ఎఫ్ఐఆర్ నమోదుచేసామన్నారు.

**మృతుల కుటుంబాలకు విజయ్ రూ.20 లక్షలు చొప్పనసాయం**

సంఘటన హృదయవిదారకంగా ఉందని, ఈ బాధ ఆ కుటుంబాల్లో ఎన్నటికీ వీడనిదని టివికె చీఫ్ విజయ్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.20లక్షల వంతున ఆర్థికసాయం అందిస్తామని, గాయపడినవారికి రెండు లక్షలచొప్పున సాయం చేస్తామని ప్రకటించారు. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబీకులందరికీ ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**తొక్కిసలాటపై కుట్రకోణం ఉంది: టివికె పార్టీ**

కాగా కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో కుట్రకోణం ఉందని, ర్యాలీలో గుర్తుతెలీని వ్యక్తులు రాళ్ల విసరడం, పోలీసులు లాఠీ ఛార్జిచేయడంవల్లనే తొక్కిసలాటపెరిగి ఈ ఘోరం జరిగిందని టివికె మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. సిబిఐ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసి విచారణ జరిపించాలనికోరింది. టివికె తరపున న్యాయవాది ఎస్ అరివళగన్ ఈ పిటిషన్ దాఖలుచేసారు. హైకోర్టు చీఫ్‌జస్టిస్ దండపాణి నివాసానికి వెళ్లి విచారణ జరిపించాలని విజ్ఞప్తిచేసామని సోమవారం మధ్యాహ్నం 2.15 గంటలకు హైకోర్టులోని మధురైబెంచ్‌కు కేసు విచారణకు వస్తుందని తెలిపారన్నారు. ఇదిలా ఉంటే ఈ సంఘటనతో విజయ్ ఇంటికి భద్రతను పెంచారు. ఆదివారం ఉదయంనుంచే విజయ్ ఇంటివద్ద భారీ సంఖ్యలో పోలీసులను మొహరించారు.

**సంఘటనస్థలానికి ఏకసభ్య కమిషన్ ఛైర్మన్**

ఇదిలా ఉండగా ఆదివారం ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ సంఘటన ప్రాంతాలను సందర్శించారు. అలాగే ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బాధితులను కూడా పరామర్శించారు. రాష్ట్ర డిజిపి ఇతర రెవెన్యూ జిల్లా కలెక్టర్, ఎస్‌పి ఇతర అధికారులనుంచి క్షేత్రస్థాయి నివేదికలు అందించాలని కోరారు. సంఘటన పూర్వాపరాలు, బాధ్యతారాహిత్యం, బందోబస్తు వివరాలు మొత్తం కావాలని ఆమె అధికారులను ఆదేశించారు.

# గరుడసేవకు పోటెత్తిన భక్తులు

>> ఆదివారం ఉదయం మోహినీ అవతారం వాహనసేవ ముగియగానే ఎక్కడి భక్తులు అక్కడే అలాగే గ్యాలరీల్లో, మాఢవీధుల్లో కూర్చున్నారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో 2.80లక్షలమంది భక్తులు వాహనసేవలు వీక్షించే సౌకర్యం కలిగింది. దసరా సెలవులు, పెరటాసిమాసంతోబాటు ఆదివారం రాత్రి జరిగిన బ్రహ్మోత్సవాల్లో గరుడవాహనసేవ వీక్షణకు ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాలనుండేగాక తమిళనాడు,కర్నాటక,మహారాష్ట్రల నుండి భక్తులు అనూహ్యంగా తిరుమలకు రావడంతో ఆదివారం ఉదయంనుండి కొండంతా భక్తజనసందోహంగా మారింది. ఉదయం 5గంటల నుండి ఆలయమాఢవీధుల్లోని గ్యాలరీల్లోకి భక్తులు చేరారు. మధ్యాహ్నం 12గంటలకు మాఢవీధుల్లోని గ్యాలరీల్లో 2.30లక్షల మంది భక్తులు నిండిపోయారు. మిగిలినభక్తులు గ్యాలరీల్లోకి చేరుకోవడానికి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎక్కడ భక్తులను అక్కడే నిలువరించారు. దాదాపు 50వేలమందివరకు భక్తులు తిరుమలలోనే పలు చోట్ల వెలుపల వేచివుండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మధ్యాహ్నం రెండుగంటల తరువాత భక్తులను గ్యాలరీల్లోకి అనుమతించలేదు. ఆదివారం ఉదయం భక్తుల రద్దీ మరింత రెట్టింపయ్యింది. ఉదయం నుండే గ్యాలరీల్లోకి చేరుకునే భక్తులసంఖ్య క్రమంగా పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలకే తిరుమలలో ఆలయ తూర్పుమాఢవీధి, దక్షిణమాఢ,ఉత్తర పడమర వీధుల్లో గ్యాలరీలు పూర్తిగా నిండిపోయాయి. ఉదయం 11గంటల నుండి నిరంతరాయంగా భక్తులకు 14రకాల వంటకాలు తయారుచేసి నిరంతరాయంగా అర్ధరాత్రి 12గంటల వరకు సాంబార న్నం, పెరుగన్నం, బిస్మిల్లాబాత్, చక్కెర పొంగలి, 4లక్షల మజ్జిగ ప్యాకెట్లు, పాలు, కాఫీ, సాయంత్రం సుండలు, అటుకలు తదితర అన్నప్రసాదాలు,తాగునీరు శ్రీవారి సేవకులు, టిటిడి ఉద్యోగులు పంపిణీచేశారు.ఎప్పటికప్పుడు తిరుపతి జిల్లా ఎస్పీ సిసికెమెరాల ద్వారా క్రౌడ్‌మేనేజ్‌మెంట్ పరిశీలిస్తున్నారు. చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీగా 4వేలమంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నారు.

**తిరుమలలో 38 ఎల్ఇడి స్క్రీన్లు:**

సకల సౌకర్యాలు కల్పించినా మధ్యాహ్నం నుండి గ్యాలరీల్లోకి చేరుకోలేని భక్తులకు గరుడవాహనసేవ వీక్షించేందుకు ఆలయ మాఢవీధుల్లో 22 ఎల్ఇడి స్క్రీన్లు ,భక్తుల రద్దీ వున్న ఇతరప్రాంతాల్లో 16కలిపి 38పెద్ద డిజిటల్ స్క్రీన్లపై వీక్షించారు.ఆదివారం ఒక్కరోజు భక్తులకు సంతృప్తికరంగా ఆనందనిలయుడ్ని దర్శనం కల్పించేందుకు,వాహనసేవ వీక్షణకు అన్ని దర్శనాలను రద్దుచేశారు. ఆదివారం మధ్యాహ్నం నుండి తిరుమలలోని అనేక ప్రాంతాలలో, మాఢవీధుల్లోని గ్యాలరీలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, సివిఎస్‌ఒ మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, ఇతర అధికారులు కలసి స్వయంగా ఎక్కడికక్కడే ఎప్పటికప్పుడు భక్తుల సౌకర్యాలపై ఆరాతీస్తూ తనిఖీలు చేశారు. మధ్యాహ్నానికి 4వేల వాహనాలు నిండిపోవడంతో ప్రైవేట్ వాహనాలను, ట్యాక్సీలను, భక్తుల వాహనాలను తిరుమలకు అనుమతించలేదు. అలిపిరిలోనే పార్కింగ్ చేయించారు.

# అక్టోబర్ 2న ఖాదీయే ధరించండి

>> కారణం వల్ల ఈసారి విజయదశమి చాలా స్పెషల్‌గా నిలువనుంది. సరిగ్గా 100 ఏళ్ల క్రితం విజయదశమి పండుగ రోజునే ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించింది. ఈ విజయదశమి రోజునే ఆర్‌ఎస్‌ఎస్ శత వార్షికోత్సవం కూడా జరగనుంది. ఆ సంస్థ వందేళ్ల ప్రస్థానం అపూర్వమైంది మాత్రమే కాదు, స్ఫూర్తిదాయకమైంది కూడా. వందేళ్ల క్రితం ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటైన సమయానికి మన దేశం బానిస సంకెళ్లలో ఉంది. శతాబ్దాల తరబడి బానిస సంకెళ్లలో బందీ అయినందు వల్ల భారతీయుల ఆత్మవిశ్వాసం, ఆత్మ గౌరవాలకు మానిపోని గాయమైంది. దేశ ప్రజల్లో ఆత్మన్యూనతా భావం ఏర్పడింది. అందుకే దేశానికి స్వాతంత్ర్యం ఎంత ముఖ్యమో, సైద్ధాంతిక బానిసత్వం నుంచి స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యంఅని ప్రధాని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దేశ ప్రజలు స్వయం సమృద్ధి బాటలో నడవడం తప్పనిసరని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఇందుకోసం స్వదేశీ తయారీ ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి ధరించాలని కోరారు. స్వాతంత్ర ఉద్యమ సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై మహాత్మా గాంధీ ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారని గుర్తు చేశారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించినప్పటికీ గత 11 ఏళ్లుగా మళ్లీ పెరుగుతోందని అన్నారు. ప్రపంచ ఆర్థిక రంగం అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో మిగతా దేశాల మాదిరిగానే మనం కూడా సొంత ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్దపీట వేయాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి దీనిపై దేశవ్యాప్త విప్లవానికి నడుం బిగించాలని కోరారు. రానున్న రోజుల్లో వరుసగా పండుగలు ఉన్నాయి. ప్రతి పండుగకి మనం వస్తువులను కొనుగోలు చేస్తాం. ఈసారి జీఎస్టీ ఆదా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఒక బలమైన సంకల్పంతో పండుగలను మరింత ప్రత్యేకంగా మార్చొచ్చు.

ఈ దఫా పండుగలను స్వదేశీ ఉత్పత్తులతోనే జరుపుకుంటామని నిర్ణయించుకుంటే, పండుగ తాలుకా సంతోషం మరింత రెట్టింపు అవుతుంది. షాపింగ్ చేసే సమయంలో ఒకల్ ఫర్ లోకల్ మంత్రాన్ని గుర్తుంచుకోవాలి. దేశంలో తయారైన వస్తువులనే కొనండి. చేనేత, హస్తకళాకారులు రూపొందించిన ఉత్పత్తులనే ఇంటికి తీసుకెళ్లండి. భారత పౌరులు కష్టపడి తయారు చేసిన వస్తువులనే వినియోగించండి. వీటిని పాటించడం ద్వారా మనం కేవలం వస్తువులను మాత్రమే ఇంటికి తీసుకెళ్లడం లేదు. ఒక విశ్వాసాన్ని తీసుకెళుతున్నాం. ఆత్మ నిర్భర భారత్ సాకారం కావాలంటే అందుకు స్వదేశీ ఒక్కటే మార్గం అని మోడీ అన్నారు. మన పండుగలే మన సంస్కృతిని కలకాలం సజీవంగా ఉంచుతాయి. ఛట్ పూజ సందర్భంగా మనం అస్తమిస్తున్న సూర్యుడిని పూజలతో గౌరవిస్తాం. యునెస్కో అపూర్వ సాంస్కృతిక వారసత్వ జాబితాలో ఛట్ పూజను చేర్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ చేరిక జరిగితే, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ప్రజలు ఈ పండుగ ప్రాధాన్యం గురించి తెలుసుకోవడం మొదలుపెడతారు. అంతర్జాతీయ పండుగగా ఛట్ పూజ మారుతుంది. కొంతకాలం క్రితం మా ప్రభుత్వం చొరవ వల్లే కోల్‌కతా దుర్గాపూజను యునెస్కో జాబితాలో చేర్చారని మోడీతెలిపారు.

# మున్సిపాలిటీలు నగర పంచాయతీలు

>> కొన్నింటిని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో విలీనం చేయడం వంటి, మరికొన్ని పంచాయితీలను కలిపి ఉడా (అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ)లుగా అభివృద్ధి చేయడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు. వాస్తవానికి గతంలోనే పట్టణీకరణకు కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. పట్టణీకరణ తరువాత ఆయా ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కనీసం 20 నుంచి 40 వేల మంది వరకు ఉండాలని, ప్రతి చదరపు కిలోమీటర్కు 400 మందితో జనసాంద్రత ఉండాలని ఆ మార్గదర్శకాల్లో సూచించిన సంగతి తెలిసిందే. అలాగే ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారిలో 25 శాతం వరకు ప్రజలు వ్యవసాయేతర కార్యక్రమాల్లో ఉపాధి పొందుతుండాలని, అక్కడ పరిశ్రమలను భారీగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కూడా నిర్దేశించారు. పట్టణీకరణ విధానాన్ని విస్తృతం చేసేందుకుగాను భూసేకరణ అవకాశాలను కూడా పెంచాలని పేర్కొన్నారు. ఆదాయం కోసమేనా..? ఆదాయాన్ని పెంచుకోవడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్య తీసుకుంటోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పల్లెలతో పోలిస్తే పట్టణాల్లో వివిధ రకాల పన్నులు, సేవల రుసుములు ఎక్కువన్న సంగతి తెలిసిందే. మౌళికవసతుల ఏర్పాటు సంగతి ఎలా ఉన్నప్పటికీ తక్షణం ఖజనాను నింపుకునే అవకాశం ఉండటంతో ఆ దిశలో ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు భావిస్తున్నారు.

# తిరుమల సమాచారం

## గరుడునిపై వేంకటాద్రివాసుడు అభయం

### గోవిందనామ స్మరణలతో మార్మోగిన తిరుమల



**తిరుమల,సెప్టెంబరు 28ప్రభాతవార్తప్రతినిధి:** 108 వైష్ణవదివ్యదేశాల్లో గరుడసేవ అత్యంత ప్రా ముఖ్యత సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజేశారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవదధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియ జేశాడు. ఏడుకొండలస్వామి సాలకట్ల బ్రహ్మోత్స వాల్లో ఆదివారం రాత్రి విశేషాభరణాల అలంకృ తుడైన మలయప్పస్వామి తనకెంతో ప్రీతిపాత్ర మైన గరుడుని అధిరోహించి ఆలయ మాఢవీధు ల్లో ఊరేగారు. జగన్నాటక సూత్రధారి మలయ ప్పస్వామి భక్తజనానికి దర్శనమిచ్చాడు. చల్లటి వాతావరణంలో వింజామరలు చల్లగా విసురుతుండగా భక్తుల గోవిందనామ్మర ణల మధ్య మెల్లగా మలయప్పస్వామి భక్తకోటిని కరుణిస్తూ భక్తకోటికి స్వామివారు సకలం నేను న్నానంటూ అభయమిచ్చాడు. ఏడుకొండలు ఏడులోకాలకు ప్రతీతి. ఇందులో గరుడాద్రి (వేంకటాద్రి) పర్వతంపై కొలువై వున్న తిరుమల శ్రీవేంకటేశ్వ రుడు మహామహిమాన్వి తమైన దేవుడు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, బోర్డు సభ్యులు శాంతారం, దివాకర్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జంగాకృష్ణమూర్తి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి కమి షనర్ మౌర్య, సివిఎస్ఓ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు,తిరుమల అడిషనల్‌ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విఎస్ఓలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు,వేదపండితులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## 'శృంగారరసాధిదేవతగా జగన్మోహనాకారుడు'

**తిరుమల,సెప్టెంబరు 28ప్రభాతవార్తప్రతినిధి:** కన్నులపండువగా సప్తగిరులపై జరుగుతున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు ఆదివారం ఉదయం మోహినీఅలంకారంలో మలయప్పస్వామి ముగ్ధమనోహరంగా భక్తులను కటాక్షించాడు. ఉదయం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత ఆలయంలోపల నుండి వెలుపలకు వచ్చిన శ్రీనివాసప్రభువు శృంగారరసాధిదేవతగా మోహినీరూపంలో భక్తులకు మోక్షంకలిగించాడు. ఆపదమొక్కుల వాడు శ్రీమలయప్పస్వామి దంతపువల్లకిపై చేతిలో బంగారపుచిలుకను ధరించి మరోరూపంలో పక్కనే శ్రీకృష్ణుడు ఆలయంముందుకు వేంచేశారు. కమనీయమైన శ్రీకాంతునిరూపం జగత్సమ్మోహకంగా కనువిందుచేసింది. "పుంసాం మోహనరూపాయ" అన్నట్లు శ్రీమహావిష్ణువు ఏరూపం ఎత్తినా,పురుషులకు కూడా సమ్మోహకుడవుతాడు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు శాంతారం, దివాకర్‌రెడ్డి,పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జంగాకృష్ణమూర్తి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు, సివిఎస్ఓ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు,వేదపండితులు పాల్గొన్నారు.



### గరుడకు ముందు వరుణుడి పలకరింపు

## వర్షాన్ని ఖాతరుచేయని భక్త జనం

**తిరుమల,సెప్టెంబరు 28 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలపై జరుగుతున్న వెంకన్న బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి జరిగిన అత్యంత ముఖ్యమైన గరుడవాహనసేవకు ముందు మధ్యాహ్నం వరుణదేవుడు పెద్దపెద్ద చినుకులతో పలకరించాడు. ఉదయం నుండి గ్యాలరీలను అంటిపెట్టుకున్న జనం వాహనసేవ వరకు కదల కమెదలక భక్తితో కూర్చున్నారు. ఉన్నఫళంగా వర్షం కురిసింది. వర్షానికి గ్యాలరీల్లో గంటలు తరబడి వేచివున్న భక్తులు ఏమాత్రం చలించలేదు. పదినిమిషాలు వర్షం కురిసింది. సాయం త్రం 4.30గంటలకు మళ్ళీ వరుణ దేవుడు తిరుమలలో వర్షించినా భక్తులు చలించలేదు, సాయంత్రం 6.30గంటలకు ప్రారంభమైన గరుడవాహనసేవ సుమారు అర్ధగంట పాటుపైగా వాహనమండపంలోనే విఐపిలకు ప్రత్యేక దర్శనంకోసం నిలిపివుంచారు. రాత్రి 7.05గంటలకు వాహన మండపం నుండి కదలిన గరుడునిపై మలయప్పను చూసి భక్తులు గోవింద నామాలతో భక్తిని చాటుకున్నారు. కాగా ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు వరుణుడు రావడం సంప్రదాయం.





## అన్నప్రసాదాలు, తాగునీరు అందాయా..

### గ్యాలరీల్లో సౌకర్యాలపై అడుగడుగునా టిటిడి ఛైర్మన్, ఇఒ ఆరా

**తిరుమల,సెప్టెంబరు 28ప్రభాతవార్తప్రతినిధి:** దసరా సెలవులు...ఆపై పెరటాసి మాసం బ్రహ్మోత్సవాల గరుడసేవ ఆదివారం రాత్రి జరగడంతో అనూహ్యంగా భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఉదయం నుండి మాఢవీదుల్లోని గ్యాలరీలకు తరలిరావడంతో గరుడవాహనం రావడానికి ముందే మధ్యాహ్నం నుండి టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు,, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్,ఇతర అధికారులు తమతమ హోదాను మరచి భక్తులను చేరువగా పలకరించారు.

ఆప్యాయంగా మాట్లాడి తాగు నీరు, కాఫీ, మజ్జిగ, అన్నప్రసాదాలు, సౌకర్యాల కల్పనపై, సదుపాయాల గురించి ఆరా తీశారు. గ్యాలరీల్లో శ్రీవారి సేవకులతో, సిబ్బందితో అందుతున్న సేవలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడంతో వారితో కరచాలనం చేసి మరీ ముందుకు కదులుతున్నారు.

# నేడు మూల నక్షత్రం సందర్భంగా పటిష్ట ఏర్పాట్లు

### రోజూ లక్ష దాటుతున్న భక్తుల సంఖ్య

### రద్దీ దృష్ట్యా ప్రత్యేక బలగాలు

### నేడు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సిఎం చంద్రబాబు



ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ సిపి రాజశేఖర్ బాబు

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** దసరా ఉత్సవాల సందర్భంగా శ్రీకనక దుర్గమ్మ జన్మ నక్షత్రమైన మూల నక్షత్రం రోజున శ్రీ సరస్వతి దేవి అలంకారంలో దర్శనం ఇవ్వనున్న అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మూల నక్షత్రం రోజున దర్శన ఏర్పాట్ల పై విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, దుర్గగుడి ఈవో శీనా నాయక్ తో కలసి ఆదివారం మీడియా తో మాట్లాడారు. గడచిన నాలుగు రోజుల నుంచి ప్రతిరోజు లక్ష మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నారని చెప్పారు. ఈరోజు లక్షన్నర వరకు భక్తులు రావచ్చని తెలియజేశారు. ఈరోజు రాత్రి 9 గంటల వరకే భక్తులను క్యూ లైన్ లోకి అనుమతిస్తామని చెప్పారు. రాత్రి 11 గంటల తర్వాత క్యూలైన్లో నిలబడే భక్తులు సరస్వతి దేవి అలంకారంలో అమ్మవారిని రేపు దర్శించుకుం టారని తెలిపారు. కృష్ణా నదికి వరద ఉధృతి పెరిగిందని, రెండవ నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశామని తెలిపారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, స్నానానికి నదిలో దిగడం వంటివి చేయవద్దని చెప్పారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా అమ్మవారి దర్శనానికి భక్తులు విచ్చేస్తున్నారని తెలిపారు. సహజంగా రోజుకు 70 నుంచి 80000 ఉండే భక్తుల సంఖ్య ఇప్పుడు లక్ష దాటిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం, విజయవాడ ఉత్సవ్ కార్యక్రమం దీనికి కారణం కావచ్చు అని అన్నారు. 36 కంపార్ట్మెంట్ లన్నీ భక్తులతో నిండినట్లు చెప్పారు. పెరిగిన భక్తుల రద్దీ నేపథ్యంలో అదనంగా ఏపీ ఎస్పీ ప్లటూన్లను రప్పిస్తున్నామని, రోప్ పార్టీలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. మొత్తం భక్తులలో విఐపి ల సంఖ్య రెండు శాతం మాత్రమేనని చెప్పారు. సోమవారం విఐపి పాసులు జారీ చేయడం లేదని చెప్పారు. భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా రేపు ట్రాఫిక్ ను మళ్లిస్తున్నట్లు చెప్పారు.

దుర్గగుడి ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ సోమవారం రెండు లక్షల మంది అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని చెప్పారు. కుంకుమార్చన, శ్రీ చక్ర నవార్చన వంటి ప్రత్యేక పూజలు చేయించుకునేవారి కోసం భవాని ఘాట్, గాంధీ మ్యూజియం నుంచి వాహనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 7 నుంచి 8 మధ్య ఆ వాహనాలలోనే దేవస్థానానికి రావాలని, ఇతర వాహనాలను అనుమతించమని చెప్పారు.

సోమవారం మధ్యాహ్నం మూడున్నర నుంచి నాలుగున్నర గంటల మధ్య రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. భక్తులకు కోరినన్ని లడ్డూలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# దుర్గమ్మ ఆశీస్సులతో అభివృద్ధి పథంలో రాష్ట్రం: మంత్రి సవిత

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ కనక దుర్గమ్మ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ అభివృద్ధిలో దూసుకుపోతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్రంపైనా, విజయవాడ నగర ప్రజలపైనా కనక దుర్గమ్మ చల్లని ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయన్నారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా ఆదివారం ఏడో రోజు విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలిసిన కనక దుర్గమ్మవారికి రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి మంత్రి సవిత ఆదివారం పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సవితను అర్చకులు వేదాశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. లక్షలాదిగా తరలొస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా దేవస్థానం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారన్నారు. కనక దుర్గమ్మ చల్లని దీవెనలతో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. రాష్ట్రంపైనా, విజయవాడ నగర ప్రజలపైనా కనక దుర్గమ్మ చల్లని ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని మంత్రి ఆకాంక్షించారు.

**ఉచిత దర్శనం:** లక్షలాదిగా తరలొస్తున్న భక్తులకు అమ్మవారి ఉచిత దర్శనం కల్పిస్తున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఆదివారం నుంచి దసరా ఉత్సవాలు ముగిసేవరకు ఉచిత దర్శనాలకు అనుమతిచ్చారన్నారు. అమ్మవారి దర్శనానికి స్త్రీ శక్తి పథకం ఎంతో దోహదం చేస్తోందని, సుదూరం నుంచి మహిళలు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇంద్రకీలాద్రికి చేరుకుంటున్నారని మంత్రి సవిత తెలిపారు. కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం మంత్రి సవిత క్యూ లైన్లో ఉన్న భక్తులతో మాట్లాడారు. ఏర్పాట్లు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లన్నీ భేషుగ్గా ఉన్నాయని భక్తులు సంతృప్తి వ్యక్తంచేశారు. కొండపై ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాలను మంత్రి సవిత పరిశీలించారు. ఏయే మందులు అందుబాటులో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. భక్తుల కోసం అహర్నిశలు కష్టపడుతున్న వైద్య ఆరోగ్య సిబ్బందని మంత్రి సవిత ప్రశంసించారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన మంత్రి సవితకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. ఏడో రోజు ఆదివారం అమ్మవారు శ్రీమహాచండీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.





## ఉప్పొంగి ప్రవహిస్తున్న కృష్ణమ్మ

### ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

### జలాశయం నీటిమట్టం 585.80 అడుగులు

**నాగార్జునసాగర్, ప్రభాతవార్త సెప్టెంబరు 28:** నాగార్జున సాగర్ జలాజయానికి ఉరకలేస్తున్న కృష్ణమ్మ ఎగువప్రాంతాలలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఉధృతంగా కృష్ణమ్మ ప్రవహిస్తున్నది. ఆదివారం సాయంత్రానికి సాగర్ ప్రాజెక్టుకు 5,88,580,క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతుంది,ఈ నేపథ్యంలో ప్రాజెక్ట అధికారులు 26 రేడియల్ క్రస్ట్ గేట్లను విడుదల చేసి 5,45,884,క్యూసెక్కుల నీరు,విడుదల చేస్తున్నారు,ఇందులో 2గేట్లు 20 అడుగులు, 24,గేట్లు15 అడుగుల ఎత్తు విడుదల చేశారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు,కాగా ప్రస్తుత నీటిమట్టం585.80 అడుగులకు చేరుకుంది,ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థం 312.0450టీఎంసీలు కాగా ప్రస్తుతం 299.7430,టీఎంసీల నీరు నిల్వఉంది. కుడికాల్వద్వారా 8,529, క్యూసెక్కులు, విడుదలను నిలిపివేశారు, జలా శయం ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,967, క్యూసెక్కులు ఎస్ఎల్‌బీసీ ద్వారా 12,00, క్యూసెక్కులు, నీరు దిగుబకు విడుదలవుతుంది, అదేవిధంగా ప్రాజెక్టు నుంచి అవుట్ ఫ్లో పూర్తిస్థాయిలో 5,88,580,క్యూసెక్కుల నీరు దిగువకు కొనసాగుతోంది.

## నేడు శరన్నవరాత్రుల్లో కీలకఘట్టం

### శ్రీ సరస్వతి దేవిగా దుర్గమ్మకు సిఎం పట్టువస్త్రాలు

### దుర్గమ్మకు మంత్రి సవిత పట్టువస్త్రాలు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గమ్మవారు శ్రీ మహాచండీ దేవిగా భక్తులను ఆదివారం అనుగ్రహించారు. రాత్రి పది గంటల వరకు దుర్గమ్మవారిని లక్ష పదివేల మంది భక్తులు దర్శించుకున్నారని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. కలెక్టర్ .లక్ష్మీషా, విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు, కమీషనర్ .రామచంద్రమోహన్, .ఇఓ వికె .శీనా నాయక్ లు ఏర్పాట్లు ఎప్పటి కపుడు పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి భక్తుల సంఖ్య అంతకంతకు పెరుగుతుండడంతో మూలానక్షత్రంరోజున సోమవారం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సుమారు 2లక్షల మంది సోమవారం శ్రీ అమ్మవారిని జన్మనక్షత్రం రోజు న దర్శించుకుంటారని అంచనా. దుర్గమ్మవారిని అర్జున అవార్డు గ్రహీత జ్యోతి సురేఖ ఆదివారం దర్శించుకున్నారు. బెజవాడ దుర్గమ్మవారి అలంకారం కోసం దాతలు సిఎం రాజేష్ రు.10లక్షల విలువైన 90 గ్రాముల బంగారు ఆభరణాలను తమ భార్య ప్రకృతి పేరిట విరాళంగా అందించారు. అలాగే ఉచిత ప్రసాదానికి విజయవాడకు చెందిన మంజూష రు.1లక్ష విరాళాన్ని అందించారు. దుర్గమ్మవారికి రాష్ట్ర మంత్రి సవిత పట్టువస్త్రాలు అందించారు. ఏడవరోజైన ఆదివారం రాత్రి 10 గంటలకు ఒక లక్ష పదివేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ వెల్లడించారు.

దుర్గమ్మవారిని ఆదివారం శ్రీ మహాచండీదేవి అవతారంలో జస్టిస్ ఐఎఎస్ అధికారి అజయ్ జైన్, ఎమ్మెల్యే రాధాకృష్ణ, రిటైర్డ్ జస్టిస్ కృపాసాగర్, జస్టిస్ సునీల్ చౌదరి, జస్టిస్ కిరణ్మయి, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి సురేఖ, ఎంపి కేశినేని శివనాథ్, మంత్రి కందుల దుర్గేష్, ఏపి ఛీఫ్ సెక్రటరి కె. విజయానంద్ తదితర ప్రముఖులు దర్శించుకున్నారు.

త కృష్ణానదిలో పెరిగిన వరద నీటని కలెక్టర్ లక్ష్మీషా పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులు జల్లు స్నానాలు మాత్రమే చేయాలని చెప్పారు. వరద వల్ల ఇబ్బంది లేకుండా రెండంచెల బ్యారికెడ్లు ఏర్పాటు చేయించారు. దసరాకు వచ్చే భక్తులను జల్లు స్నానాలు మాత్రమే చేయడానికి అనుమ తించాలని అధికారులను ఆదేశించారు.

## 75యేళ్లు నిండటంతోనే బాధ్యతల నుంచి తప్పుకున్నా

### సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నారాయణ



**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీ తాజా నిబంధనవళిని అనుసరించి కీలక బాధ్యతలనుంచి తప్పుకున్నట్లు సీపీఐ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ డాక్టర్ కంకణాల నారాయణ స్పష్టం చేసారు.తన వయసు 75 ఏళ్ళు నిండటంతో జాతీయ కార్యదర్శి పదవి నుంచి తప్పుకున్నట్లు తెలిపారు.సీపీఐ కంట్రోల్ కమీషన్ ఛైర్మన్‌గా తనను పార్టీ జాతీయ సభలో ఎన్నుకున్నారన్నారని తెలిపారు.. తన సామాజిక మాధ్యమ ఖాతాలో ఈ విషయాన్ని స్పష్టంగా వివరించారు. 75 ఏళ్ళు నిండిన వారు కీలక పదవుల నుంచి రిలీవ్ కావాలని చండీఘడ్‌లో జరిగిన పార్టీ జాతీయ మహాసభలో నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి మాత్రం సడలింపునిచ్చారు. దాన్ని అనుసరించి ఆ పదవిలో డి.రాజా కొనసాగుతారు' అని వివరించారు. పార్టీలో అంతర్గత సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వాటిని సక్రమంగా పరిష్కరించేందుకు కంట్రోల్ కమీషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమకాలీన రాజకీయకంశాలు,ఇతర సమస్యలపై తాను స్పందించి మాట్లాడతానన్నారు.పార్టీలో నూతనాలోచన విధానాలు కలిగిన యువ నాయకత్వం అవసరమన్నారు.

## మత్సకారులకు ప్రయోజనం లేని 'ఫిష్‌ఆంధ్రా': మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ,సెప్టెంబరు28,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ ప్రభుత్వంలో మత్సకారులకు కొత్తగా ఒక్క బోటు, వల,వాహనం వంటివేవీ ఇవ్వలేదని, ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన క్రింద కేంద్రం నిధులిస్తూ వాటిని 'ఫిష్ ఆంధ్రా'కు మళ్ళించారని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రూ.51 కోట్లు ఖర్చు చేసి షాపులు నిర్మించారని, వీటిలో చాలా వరకు పనిచేయడం లేదని,అసలు ఫిష్‌ఆంధ్రా వల్ల మత్స్యకారుల్లో ఎవరికీ ప్రయోజనం కలగలేదన్నారు.ఈ మేరకు మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో 2014-19 మధ్య మత్సకారులకు స్వర్ణయుగంగా ఉండేదని, వేట నిషేధ భృతి రూ.4వేల చొప్పున ఇవ్వడంతో పాటు చేపలు పట్టుకునేందుకు అన్నీ అందించామని చెప్పారు. గత ప్రభుత్వం ఆపేసిన డీజిల్ సబ్సిడీని ఈ ప్రభుత్వం ఇచ్చిందని, ప్రమాదవశాత్తూ మరణించిన 63 మందికి రూ.5 లక్షల చొప్పున సాయం అందచేశామని చెప్పారు.కాకినాడ ఎంఎల్ఏ వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేజ్ కల్చర్ తీసుకు రావాలని కోరారు. ఆక్వా రైతాంగానికి తమ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందన్నారు.ఆక్వా ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పనలో ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. వ్యవసాయరంగంలో యూరియా వాడకాన్ని తగ్గించమంటున్నామని,ఇందుకు ప్రతిగా కొన్ని ప్రోత్సాహాలు ఇస్తామన్నారు.

## కరూర్ తొక్కిసలాట ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ దిగ్భ్రాంతి

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** తమిళ నాడులోని కరూర్‌లో నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధ్యక్షుడు విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన అత్యంత దురదృష్టకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి పవన్ కల్యాణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ తొక్కిసలాటలో 31 మంది మరణించారని తెలిసి షాక్‌కు గురయ్యానని తెలిపారు. మృతుల్లో ఆరుగురు చిన్నారులు కూడా ఉండటం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి తమిళనాడు ప్రభుత్వం తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## రాజ్యాంగంపై ప్రతిపౌరుడుకి అవగాహన ఉండాలి

### రైల్వే ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎడి ఎస్ కిశోర్ కుమార్



రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేస్తున్న కిశోర్ కుమార్

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 28, ప్రభాత వార్త:** భారతదేశపు ప్రతిపౌరుడికి రాజ్యాంగ అవగాహన కల్పించడమే తమ ధ్యేయమని అఖిల భారత రైల్వే ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం గుంతకల్లు డివిజన్ అదనపు డివిజనల్ కార్యదర్శి జీ.ఎస్.కిశోర్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగ పుస్తకాలను పౌరులకు అందజేశారు. ప్రస్తుత ఆధునిక యుగంలో యువతకు రాజకీయ అవగాహన కల్పించడంతోపాటు దేశపౌరుల ప్రాథమిక హక్కులు, రక్షణ, భద్రతలను కల్పించాలనే ఉద్దేశంతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని వీటిని క్షేత్ర స్థాయిలో నివసించే పౌరులవరకు ప్రతి ఒక్కరికి అందించాలనే లక్ష్యంతో రాజ్యాంగ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో రైల్వే ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం పూర్వ అధ్యక్షుడు ఇ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వార్త

ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కరే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం కొనసాగిందంటే ఇద్దరూ బాధ్యులే.

-థామస్ ఫుల్లర్

# గుణపాఠం ఇంకెప్పుడు?

జనం పోగుబడినచోట రద్దీ ఏర్పడుతుంది. అలాంటిచోట గందరగోళం, తొక్కిసలాటకు ఆస్కారం ఉంటుంది. హడావుడి, ఆందోళనల మధ్య తొక్కిసలాటలు సర్వసాధారణం. అలా అని సరిపెట్టుకోవడం కన్నా గత అనుభవాల బేరీజుతో మరో దుస్సంఘటన జరగకుండా చూసుకోవడం విజ్ఞుల లక్షణం. ప్రతి దుస్సంఘటన మరో కొత్తదారికి మలుపు కావాలి. ఈ మధ్యకాలంలో సందర్భం, సమయం ఏదైనా ఇలాంటి సంఘటనలు జరిగి దాని వైఫల్యాలను పూస గుచ్చినట్లు బహిర్గతపరిచాయి. అన్ని సంఘటనల్లోనూ విషాదాన్ని. ముఖ్యంగా ప్రాణనష్టాన్ని చవిచూసాము. అవన్నీ మానవ తప్పిదాలు కారణంగా, నిర్వాహకుల నిర్లక్ష్యం వలన సంభవించినట్లు నిరూపితమయ్యాయి. దేవాలయాలు, జాతరలు, ఎన్నికల ప్రచారర్యాలీలు, సెలబ్రిటీలు హాజరయ్యే వేడుకల సందర్భంగా జనం పోగుబడినప్పుడు, అలాంటి ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగం మీద ఉంటుంది. ఇలాంటి కార్యక్రమాలు, జనసమ్మోహన యాత్రలు, రాజకీయ పక్షాల రకరకాల విన్యాసాలకు జనాల రద్దీని బట్టి పోలీస్ అనుమతులు తీసుకోవడం అవసరం. కానీ తమిళనాడు కరూర్‌లో టీవీకె పార్టీ అధినేత సినీ యాక్టర్ విజయ్ ర్యాలీ సందర్భంగా కనీసం 40 మంది మృతి చెందారు. ఇక్కడి విషయం గురించి చర్చించుకోవాలంటే వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్న వివరాలను బట్టి ఆ పార్టీ తమ ర్యాలీకి కేవలం 10 వేల మందిని వస్తారని అనుమతి తీసుకోగా, 27 వేలమంది జనం పిల్లాపాపలతో తరలివచ్చారు. అనుమతులిచ్చిన పోలీసు యంత్రాంగం కూడా స్వీయ అంచనాలు వేసుకునీ మరీ అనుమతులు ఇవ్వాలి. అవసరమైన భద్రత కల్పించాలి. అవన్నీ చేయకుండా వాళ్ల అంచనా మేరకు భద్రత కల్పించామని తేలికగా తీసిపడేయడం పోలీసు విధి, నిర్వహణ అనిపించుకోదు. విషాద ఘటనల నేపథ్యం, జనఅంచనాలు, ఏర్పాట్లు గురించి సమీక్షించి విశ్లేషిస్తే నేతలు, అధికారులు ఎవరికివారు తాజా దుస్సంఘటనకు తాము బాధ్యత కాదంటే తాము బాధ్యత కాదనే ధోరణితో ఉన్నారు. ప్రాణనష్టం సంభవించినపుడు కేవలం సంతాపాలు వ్యక్తం ఊరుకోగలరే తప్ప మరో ప్రమాదాన్ని నివారించే ప్రయత్నాలు చేయలేకపోతున్నారు. కనీసం వ్యవస్థను, ఆ వ్యవస్థలోని బాధ్యతారాహిత్యాన్నీ కూడా మందలించలేకపోతున్నారు. ఇదీ కలియుగ ధర్మం. మరోసారి అలాంటి దుస్సంఘటనలు జరుగకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న విషయంపై పర్యవేక్షణ లేక కనీసం సమీక్షలు జరిపిన సందర్భాలు కూడా కానరావు. తమిళనాట ఎంజీ రామచంద్రన్, కరుణానిధి, జయలలిత, రజనీకాంత్, కమల్ హాసన్, తాజాగా ఇప్పుడు దళపతి విజయ్‌లకు చెప్పుకో దగినంతమంది అభిమానులున్నారు. వారంతా రాజకీయ ప్రవేశమున్నవారే. పైగా వారివారి రాజకీయ ప్రచా రసభలకు భారీ బందోపస్తు అలవాటు పడినవారే. వారిని చూడగలగడం తమ అదృష్టమని, పూర్వజన్మ సుకృతమని భావించే అభిమానులే ఎక్కువమంది ఉన్నారు. రాజకీయాల్లోకి వచ్చే కథానాయకులకు ఆ మాత్రం ఫాలోయింగ్ ఉండడం కొత్తేమీ కాదు. అలాంటి రాష్ట్రంలో ప్రజాదరణ ర్యాలీ నిర్వహించుకోవల్సినప్పుడు ఆయా పార్టీ నిర్వాహకులకు, ప్రభుత్వ పోలీసు యంత్రాంగానికి బాధ్యత ఉంటుంది. వారు తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో ఏమాత్రం ఆదమరచి ఉన్నా అనుకోని సంఘటనలు జరిగే వీలుంది. ఇప్పుడదే జరిగింది. కరూర్ ర్యాలీకి విజయ్ ఉదయం 12 గంటలకు వస్తారని ప్రకటించగా దాదాపు 7 గంటలు ఆలస్యంగా హీరో చేరుకున్నారు. వారానికి 2 రోజులు ప్రజల్ని కలిసేందుకు విజయ్ పర్యటన ప్రణాళిక ప్రకారమే ఈ కార్యక్రమం మొదలైంది. ఏమైతేనేం రాత్రి 7.20కి బస్ కరూర్‌చేరుకోగా విజయ్ ప్రసంగం ప్రారంభిస్తుండగానే, అంతవరకు వేచివున్న జనం తమ హీరోను చూడాలని ముందుకు కదిలారు. అందులో చిన్నపాప తప్పిపోయిందన్న మాటలు వినిపించగా జనంలో అలజడి బయలుదేరి తొక్కిసలాట జరిగింది. అప్పటికే నిరాహారంగా, కనీసం మంచినీళ్లు కూడా అందుకోలేని పరిస్థితిలో ఉన్న అభిమానులు స్పృహతప్పి కిందపడిపోయారు. అదే సమయంలో విజయ్ మాట్లాడుతూ రేపటి అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే, డిఎంకెల మధ్యనే పోటీ ఉంటుందని, బీజేపీకి ఓటు వేయొద్దని, డిఎంకె, బీజేపీల మధ్య రహస్య ఒప్పందాలున్నాయని అన్నారు. ఇలాంటి రాజకీయ ప్రసంగంతో అలజడి పెరిగింది. తొక్కిలాస మొదలైంది. దాంతో ఊపిరాడక పదహారు మంది స్త్రీలు, ఎనిమిది మంది చిన్నారులు మృతి చెందారు. దాదాపు వంద మంది క్షతగాత్రులయ్యారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆ తర్వాత మరికొందరు చనిపోవడంతో ఆదివారం నాటికి మృతుల సంఖ్య నలభైకి పెరిగింది. సమయం, సన్నివేశం ఏదైనా అది దుర్ఘటనలకు దారి తీసిన సందర్భాలకు మసిపూసి మారేడు కాయ చేసినట్లుండకూడదు. దీని వలన ప్రజలకు కానీ, దుఃఖిత కుటుంబాలకు కానీ మేలు చేకూరదు. గతంలో ఎన్టీఆర్ వంటి అగ్రనేతలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ ప్రకటించి తెలుగునాట పల్లె పల్లెకూ రథయాత్ర చేసినప్పుడు కూడా మచ్చుకు ఒకటైనా దుస్సంఘటన నమోదు కాలేదు. కాగా నేడు టివికె పార్టీ పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంలో వైఫల్యం చెందినందునే చేదు అనుభవాన్ని ఎదురుచూడాల్సి వచ్చింది.

ఎత్తైన పర్వతాలను ఎక్కేందుకు ఎలా వంగి నడుస్తామో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కొంత అణుకువతో మెలగాలి.



రామకృష్ణ పరమహంస

కొందరు గొప్పవారుగా జన్మిస్తారు, మరికొందరు గొప్పవారుగా జీవిస్తారు. ఇంకా కొందరు గొప్పవారుగా తయారవుతారు.



ఫ్రాంక్లిన్

# ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి

*అధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తేనే ప్రోత్సాహకాలు పారిశ్రామిక రంగానికి కల్పించాలి. 2019 బడ్జెట్లో కార్పొరేట్ పన్నును 30 నుంచి 25శాతానికి తగ్గించారు. ఉపాధి అవకాశాలు మాత్రం పెరగలేదు. కార్పొరేట్ సంస్థలు ఈ ప్రోత్సాహకంతో మిగిలే నిధులతో కొత్త పెట్టుబడి పెట్టాలన్నది దీన్ని ఉద్దేశం. అయితే జరిగిందేమిటి ఉద్యోగ కల్పన కల్పించలేదు. ఉద్యోగులను ఎంతమంది నియమించుకుంటారో కంపెనీలు ప్రభుత్వానికి ముందుగా తెలియజేయాలి. ప్రతి ఆర్థిక సంవత్సరం ఉద్యోగాలను పెంచుకుంటూపోయే కంపెనీలకు రాయితీలు ఇవ్వాలి. ఎక్కువ మందిని నియమించండి తక్కువ పన్ను చెల్లించండి అనేది ప్రభుత్వ విధానం కావాలి. యువతకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అటు కంపెనీలు ఇటు ప్రభుత్వాలు కల్పించాలి. పాలకులు ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి.*

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

నేడు దేశంలో ఉత్పాదక రంగం కుదేలై ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం వలన మేకిన్ ఇండియా లాంటి పథకాలు సఫలీకృతం కానందున అటు చైనా ఇటు అమెరికా నుంచి అనేక యంత్రాలు,యంత్ర పరికరాలు దిగుమతి చేసుకోక తప్పదం లేదు. పారిశ్రామిక రంగాన్ని పెట్టుబడిదారులకు అప్పగించడం వలన సరళీకృత ఆర్థిక విధానాల వలన జరిగిన ఫలితమిది. కుదేలైన తయారీ రంగం ఒకవైపు ఉండగా నేడు దేశానికి దిక్కుగా సేవల రంగం మాత్రమే ముఖ్యంగా ఐటీరంగం వలన మనం ప్రపంచంలో అగ్రదేశాల సరసన ఉన్నాం. ప్రపంచ దిగ్గజ కంపెనీలలో సైతం మన ఐఐటీ,ఎన్ఐటి,ఐఏఎంలలో చదివిన మన దేశపు విద్యార్థులే సీఈఓలుగా ఉన్నారు. ప్రపంచ సాఫ్ట్వేర్ రంగంలో రాణించడం మనకు గర్వకారణం. దీని పునాదులు ఆనాడు ప్రభుత్వమే ఐఐటీలను ఎన్ఐటీలను స్థాపించి ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడం వలననే జరిగిందనేది మరువరాదు. ఐఐటీలలో ఎన్ఐటీలలోనూ చదువుకున్న యువత ప్రపంచ పెట్టుబడిదారుల దేశాలలో ఉద్యోగాలు పొందేందుకు వలసపోయి వీరంతా అమెరికా,బ్రిటన్, ఆస్ట్రేలియా, యూరప్, దేశాలలో ఆర్థికాభివృద్ధికి గణనీయమైన కృషిచేస్తున్నారు. ప్రపంచ అగ్రగామి కంపెనీలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, ట్విట్టర్, వంటి వాటి సీఈవోలుగా మనవారు ఉండటం సంతోషించదగ్గ విషయమే. కృత్రిమ మేధస్సు(ఏఐ) ప్రపంచ సాంకేతిక దృశ్యాన్ని మార్చుతున్న యుగంలో భారతదేశం ఒక కీలకమైన మలుపుదగ్గరఉన్నది. ఐటీ శక్తిగా మనదేశానికి ఎంతో ఖ్యాతి విశాలమైన సాంకేతిక ప్రతిభ ఉన్నప్పటికీ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ఇంకా సొంతంగా ఏఐ ప్లాట్ఫామ్లను అభివృద్ధి చేయలేదు. టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజాలను ప్రపంచానికి అందించిన దేశం మనది. కానీ ఓపెనెల్ నుంచి విడుదలైన చాట్‌జిపిటికు లేదా చైనాకు చెందిన డీప్సీసీక్ సమానమైన సొంత ఏఐ ఉత్పత్తులను మనం ఇంకా తయారు చేయలేదు.ఈ లోటు ఇప్పుడు మన ముందు ఒక పెద్ద సవాల్ నిలబెట్టింది. పెట్టుబడి పరిశోధనలతోపాటుప్రభుత్వ ప్రైవేటు సంస్థల మధ్య మరింత సమగ్ర సహకారం అవసరం. సరియైన మౌలిక సదుపాయాలు నిధులు లేకుండా స్వదేశీ ఏఐ అభివృద్ధి అసాధ్యం.రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ పై మన దేశం స్థూల జాతీయోత్పత్తిలో ఒక శాతం కన్నా తక్కువగానే ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. అంటే ఇక ఏఐ ఎలా అభివృద్ధి చెందుతుంది? ఈ రంగంపై విదేశీయులపై ఆధారపడలేం కదా? చైనా అయితే తన స్థూల జాతీయుత్పత్తిలో 2.43 శాతం కృత్రిమ మేధాపైన ఖర్చు చేస్తున్నది. చైనా కృత్రిమ మేధా రంగంలో అమెరికాతో దాదాపు సమాన స్థాయిని పొందడానికి రెండు అంశాలను కారణాలుగా చెప్పవచ్చు. మొదటిది వాణిజ్య సైనిక అనువర్తల అప్లికేషన్లో సెమీ కండక్టర్లను ఉత్పత్తి చేయడానికి అవసరమైన ప్రత్యేక యంత్రాలు, పరికరాలు ఏఐ ప్రాసెసర్ల నుంచి హార్డ్వేర్ ఉత్పత్తులు ఏఐ మోడల్స్‌వరకు మొత్తం డిజిటల్ టెక్నాల జీ రంగంలో అవసరమైన అన్నిటిని విషయంలో స్వయం సమృద్ధిని, సాంకేతిక ఆధిపత్యాన్ని చేరుకోవడానికి చురుకైన స్థిరమైన జాతీయ విధానం కలిగి ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో మనదేశం కృత్రిమ మేధా అభివృద్ధికి చేపట్టవలసిన వ్యూహం ఇంతవరకు లేకపోవడం శోచనీయం.నేడు దేశంలో కృత్రిమమేధా ఆధారిత కంపెనీలలో ఉన్న ఉద్యోగాలు పోతున్నాయి.ఉద్యోగస్తులను తొలగిస్తున్నారు.కృత్రిమ మేధా అభివృద్ధి చెందిన నేపథ్యంలో ఇటీవల టాటా కన్సల్టెన్సీ కంపెనీలో 12వేలమంది ఉద్యోగస్తులను తొలగించినారు. టెక్నాలజీ ఆధారిత కార్పొరేట్ సంస్థలు ఉపాధి అవకాశాలు కల్పించగలవా? మన యువతకు ఆ సాంకేతిక పరిజ్ఞానం



లేదుకదా? మూలధన సాంద్రత,ఉత్పత్తి పద్ధతుల ద్వారా కాకుండా శ్రమ సాంద్రత అంటేఎక్కువగా ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టులకు పాలకులు ఎందుకు పోవడం లేదు. వీరికి దేశంలో ఉన్న నిరుద్యోగ సమస్య తెలియదా? ఏటా రెండు కోట్లమందికి ఉద్యోగాలు ఇస్తామని కదా ప్రధానమంత్రి అయింది. ఉద్యోగాలు ఇవ్వడం ద్వారా ప్రజల ఆదాయాలు పెంచడం ఇష్టం లేదా? కంపెనీల ఆదాయాలు పెరిగితే పాలకులకు ఎంత లాభాలు గిట్టుబాటు లభిస్తుందో తెలియదుగానీ ప్రజలకు మాత్రం వాళ్ల భూములు ఖనిజ సంపద, అటవీ సంపద పోగొట్టుకోవడం తప్పనిసరి అయింది. ఏఐ ఆధారిత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ఎవరు వ్యతిరేకులు కారు. ఈ టెక్నాలజీని మన నిరుద్యోగులకు అందించితే తప్ప ఏఐ ఆధారిత కంపెనీలో ఏ ఒక్కరికి ఉద్యోగ కల్పన చేయలేవు. యువత నిరాశ నిస్పృహలతో పని, పాటలేకుండా ఉంటే ఈ దేశానికి దిక్కెవరు? పాలకులు నిరుద్యోగ యువతను నిర్లక్ష్యంచేస్తున్నందున యువత జాతి నిర్మాణంలో భాగస్వాములు కాలేకపోతు న్నారు.అటు ఆర్థికాభివృద్ధికి ఇటు సామాజిక భద్రతకు నష్టం వాటిల్లేది యువతలోఅశాంతి హెచ్చరిల్లడంవల్లే కదా? యువతలో నూతన ఉత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించి అలాంటి విధాన కార్యక్రమాలు రూపొందించి చేపడితే పాలకులు త్రికరణ శుద్ధిగా యువతీ యువకులను అధునాతన ప్రపంచంలోమమేకం చేయగలిగితే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కాలాన్ని మించిన వేగంతో యువత పరిగెత్తగలదు. చదివిన చదువుకు సరైన ఉద్యోగం దొరకక కనీస సంపాదనకు సైతం నోచుకోక దుర్భర పరిస్థితిలో మన యువత ఉండటం శోచనీయం. డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న వైనం పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. సాంకేతిక పరిజ్ఞానం చాలావేగంగా అభివృద్ధి చెందడం,జాబ్ మార్కెట్ కూడా సాంకేతిక విద్య అభివృద్ధి చెందడం వలన యువతకు అనుకూలమైన కావలసిన నైపుణ్యాలను కల్పించగలిగితే సాంకేతిక సాధికారికతో దేశం మెరిసిపోతుంది. ఎందుకనగా ఇంజినీరింగ్ పట్టభద్రులు కూడా సగానికి పైగా నిరుద్యోగులుగా ఉన్నారు.ప్రపంచంలో అత్యంత అల్ప స్థాయిలో సాంకేతిక నైపుణ్యాలను కలిగిన దేశం మనది. మొత్తం శ్రామికులలో కేవలం 4.69 శాతం మాత్రమే శ్రామికులకు ఎంతో కొంత నైపుణ్యం కలిగి ఉన్నారు.మొత్తం శ్రామికులలో చైనాలో 24శాతం, అమెరికాలో 52శాతం, యునైటెడ్ కింగ్డమ్ 68శాతం, జర్మనీలో 75 శాతం, జపాన్‌లో 80శాతం, సౌత్ కొరియాలో 96శాతం శ్రామికులకు పూర్తి నైపుణ్యాలతో ఆర్థిక అభివృద్ధికి ఆయా దేశాలలో సహాయపడుతున్నారు. మన దేశంలో మాత్రమే అత్యంత తక్కువ స్థాయిలో నైపుణ్యం కలిగిన శ్రామికులు ఉన్నారు. కావున మనదేశంలో శ్రామికుల నైపుణ్య శాతం పెంచాలి. ముఖ్యంగా యువత సాంకేతిక నైపుణ్యాన్ని పెంచగలిగితే దేశాభివృద్ధి వేగంగా జరుగుతుంది. దేశాభివృద్ధికి జనాభా నిధిగా ఉండటం మూలాన ఉపాధి అవకాశాలు కల్పించ లేనందువలన ఉపాధి రంగంలో వీరిశాతం కేవలం జనాభాలో రెండు శాతం మాత్రమే. వీరు మాత్రమే నైపుణ్యాలు అభివృద్ధి శిక్షణపొంది ఉన్నారు. కావున యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం తక్షణ ఆవశ్యకత ఉన్నదని గమనించాలి. అప్పుడే మన దేశం మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అభివృద్ధి చెందగలదు. యునెస్కో లెక్కల ప్రకారం మన దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యాథమెటిక్స్ కోర్సులు చేస్తున్నవారు ప్రపంచంలోనే ఎక్కువ. సేవల రంగాలకు సంబంధించిన విద్యా సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకుంటున్నవారు మనదేశంలో 26 మిలియన్లు దాటారు.తద్వారా దేశంలో ఎల్రక్టానిక్స్ తదితర ఉత్పత్తులను చేయవచ్చును.అలా చేయకుండా మన ప్రభుత్వం ఈ వస్తువులను ఎక్కువగా విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నారు. అధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తేనే ప్రోత్సాహకాలు పారిశ్రామిక రంగానికి కల్పించాలి. 2019 బడ్జెట్లో కార్పొరేట్ పన్నును 30 నుంచి 25శాతానికి తగ్గించారు.ఉపాధి అవకాశాలు మాత్రం పెరగలేదు.కార్పొరేట్ సంస్థలు ఈ ప్రోత్సాహకంతో మిగిలే నిధులతో కొత్త పెట్టుబడి పెట్టాలన్నది దీన్ని ఉద్దేశం అయితే జరిగిందేమిటి ఉద్యోగ కల్పన కల్పించలేదు. ఉద్యోగులను ఎంతమంది నియమించుకుంటారో కంపెనీలు ప్రభుత్వానికి ముందుగా తెలియజేయాలి.ప్రతి ఆర్థిక సంవత్సరం ఉద్యోగాలను పెంచుకుంటూ పోయే కంపెనీలకు రాయితీలుఇవ్వాలి. ఎక్కువమందిని నియమించండి తక్కువ పన్ను చెల్లించండి అనేది ప్రభుత్వ విధానంకావాలి. యువతకు కావాల్సినసాంకేతిక పరిజ్ఞానాన్ని అటు కంపెనీలు ఇటుప్రభుత్వాలు కల్పించాలి. పాలకులు ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి. ●

# నదుల పరిరక్షణతోనే మానవాళి మనుగడ

డా.బుర్ర మధుసూదన్ రెడ్డి

భూగ్రహ జీవనాడులుగా జీవనదులు భూమాత ఉపరితలంపై నిరంతరం ఏరులై పారుతూనే ఉన్నాయి. పర్యావరణంలో అతి ప్రధానమైన వనరులుగా జీవ నదులు ప్రాణికోటికి విశిష్ట సేవలను అందిస్తున్నాయి. నదులు ప్రవహించే జలాలు మాత్రమే కాదు, భూమండల గుండె సవ్వడులు. ఈ పుణ్యనదులు ధరణికే ప్రాణమిచ్చేవరాలు. పృథ్వీపై నెలకొన్న సహజ నదులు దేవుడిచ్చిన అపూర్వ వరప్రసాదాలు. జీవనదులు బిలియన్ల మానవాళికే కాదు సకల జీవకోటికి అవసరాలకు తాగు నీటిని, ఆహారాన్ని, జీవనోపాధులను కల్పిస్తున్నాయి. నదీతీరాలు మానవ వికాస కేంద్రాలు, ఆవాస క్షేత్రాలు. ప్రపంచవ్యాప్త జీవవైవిధ్య పునరుద్ధరణతోపాటు సంరక్షణ బాధ్యతలను తీసుకుంటున్నాయి. సువిశాల భారత దేశ పుణ్యభూమిపై ప్రవహిస్తున్న గంగా,గోదావరి,యమున, నర్మద, సింధు, మహానది, కావేరి లాంటి జీవనదులు దేవతలుగా పూజించబడుతున్నాయి. ఏ దేశం లోనైనా నదులు జీవకోటికి తాగు నీటిని ఇవ్వడమే కాకుండా వ్యవసాయం, పరిశ్రమలు,ఉపరితల రవాణా రంగాలకు ఊపిరిగా నిలుస్తున్నాయి. నీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్రప్రభుత్వం ఇటీవల జలశక్తి మంత్రిత్వశాఖను కూడా ఏర్పాటు చేసి పలు నదుల పరిరక్షణ చర్యలను తీసుకుంటున్నాయి. గత ఐదుదశాబ్దాలుగా మంచి నీటివనరుల్లో జీవించే జీవరాశుల్లో దాదాపు 83శాతం వరకు కనుమరుగయ్యాయని తెలుస్తున్నది. నేటి డిజిటల్ యుగంలో మారుతున్న జీవనశైలి, జీవన విలువల నడుమ నదుల పరిరక్షణ యజ్ఞా నికి అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. నదీ జలాల కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాల తలనొప్పి, నదీజలాలదుర్వి నియోగం, అర్థరహిత డ్యామ్‌ల నిర్మాణం, జలాల అక్రమ తరలింపు, వాతావరణ ప్రతికూల మార్పులు, స్వార్థానికి నదీమతల్లిని వెన్నుపోటు పొడవడం,అక్రమ మైనింగ్, అడవుల నరికివేత, ఆహార అభద్రత, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం, ప్రణాళిక రహిత పట్టణీకరణ, నదీజలాల పరిరక్షణ చట్టాల ఉల్లంఘనలు లాంటి కార్యకలాపాలతో నదీ జలాలు పలుచబడడం లేదా గరళ కేంద్రాలుగా మారడం కొనసాగుతున్నది. నదీ జలాల పరిరక్షణ,పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయడానికి ప్రజా చైతన్య కార్యక్రమాల నిర్వహణకు 1980 నుంచి ప్రతి ఏటా సెప్టెంబర్ నాలుగవ ఆదివారం,అనగా 28 సెప్టెంబర్ 2025 రోజున ప్రపంచ వ్యాప్తంగా 'ప్రపంచ నదుల దినం' లేదా 'వరల్డ్ రివర్స్ డే' వేడుకలను నిర్వహించడం జరుగుతున్నది. 2025 ప్రపంచ నదుల దినం ఇతివృత్తంగా 'ఆరోగ్యకరమైన నదులు,ఆరోగ్య వంతమైన భవిష్యత్తు' అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించుట జరుగుతోంది. నీటికాలుష్య కట్టడి,నీటిని వ్యాపారంగామార్చే ప్రైవేట్ రంగాల రెక్కలు విరవడం,నదీ జలాల దుర్వినియోగాలను అరికట్టడం, వ్యర్థాలను నదుల్లో కలుగకుండా అడ్డుకట్ట వేయడం, శుద్ధజలాల సంరక్షణ,నదీ తీరాల దురాక్రమణలను వ్యతిరేకించడం, వాటర్‌షెడ్ నిర్మాణాలు చేపట్టడం, నదుల జీవవైవిధ్యాలను కాపాడడంలాంటి చర్యలు తీసుకోవడం ద్వారా నదుల పునరుద్ధరణ జరిగి పూర్వపు శుద్ధ జలాలు తిరిగి జరజరా వాగులై,ఏరులై,నదులై నవ్వుతూ ప్రవహిస్తాయి.నదుల పరిరక్షణతో సుస్థిరాభివృద్ధి ముడిపడి ఉంటుంది. ప్రపంచ మానవాళి ఐక్యత తో మానవ హారం పడితేనే శుద్ధ నదీజలాల పునర్వైభవం సుసాధ్యం అవుతుంది. నదుల పరిరక్షణ అంటే మానవాళి మనుగడను కాపాడుకోవడమే అని భావించాలి.కాలుష్య నదీజలాలు జీవకోటి ఉనికికే పెను ప్రమాదాలని గుర్తుంచుకోవాలి. ●

# ఫ్యాక్టరీల చట్టసవరణ బిల్లును ఉపసంహరించాలి!

బొల్లిముంత సాంబశివ రావు

చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం 16 నెలలుగా ప్రజావ్యతిరేక, రైతాంగవ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలు అమలు జరుపుతూ ఉంది. అందులో భాగమే ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీల చట్టసవరణ బిల్లు.ఇదికార్మిక, శ్రామిక వ్యతిరేకబిల్లు. ఆంధ్రప్రదేశ్ దుకాణాల, వాణిజ్య సంస్థల చట్ట సవరణ బిల్లు 2025ను కార్మికశాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ 2025న శాసనసభలో ప్రవేశపెట్టగా సభ ఆమోదంతెలిపింది.సవరణబిల్లు ప్రకారం దుకాణాలు, వాణిజ్యసంస్థల్లో పనిచేసే రోజువారీ వేలలు 8నుండి 10 గంటలకు, ఫ్యాక్టరీ కార్మికుల రోజువారి పనిగంటలు 9 నుండి 10గంటలకు పెరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు పనిచేసేందుకు బిల్లులో ఆమోదం తెలపటం జరిగింది. గతంలో మూడు నెలల్లో75 గంటలుగా ఉన్న ఓవర్టైమ్పునిబిల్లు ద్వారా 144 గంటలకు పెంచారు. బిల్లులో సవరించిన అంశాలన్నీ1948 ఫ్యాక్టరీల చట్టంలో పేర్కొన్న కార్మిక హక్కులకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయి. సవరణబిల్లు కోసం ఏపీ ఫ్యాక్టరీల చట్టంలోని అనేక నిబంధనల్లో మార్పుల చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం ముసాయిదా బిల్లును విడుదలచేసింది. ఈ ముసాయిదా బిల్లునే ఇప్పుడు శాసనసభ, శాసనమండలి ఆమోదించాయి. చట్టంలోని సెక్షన్ 54 అనేది కార్మికుల పని గంటలకు సంబంధించినది. కార్మికుడు రోజుకు, వారానికి ఎన్నిగంటలు పనిచేయాలి అనేది ఈసెక్షన్ పేర్కొంటుంది. దీని ప్రకారం కార్మికుడు రోజుకి8.30గంటలు పనిచేయాలి. ఇందులో భోజన విరామం 30నిమిషాలు ఉంటుంది. చట్టంలోనిసెక్షన్ 54లో మార్పులు చేసిరోజుకి 10.30 గంటలు పనిచేయాలని, అందులో భోజన విరామం అర్ధగంటగా బిల్లులో పేర్కొనటం జరిగింది. ప్రస్తుతం చేస్తున్న 9గంటలకన్నా అదనంగా గంటపనిచేయాలి. దుకాణాల్లో పనిచేసే వారు అదనంగా రెండుగంటలు పనిచేయాలి. ఈసవరణతో ఎటువంటి వేతనం లేకుండా కార్మికుని అదనపు శ్రమశక్తిని యజమానులు కొల్లగొట్టిలాభాలు పొందుతారు. అదనపు శ్రమ చేయటంవల్ల కార్మికుడు దోపిడీకిగురౌతాడు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మారుస్తానని చంద్రబాబు చెప్పటం అంటే కార్మికులను శ్రమదోపిడీకి గురిచేసి జీవితాలను అంధకారంలోకి నెట్టి,యజమానులు లాభాలుపెంచటమా! చట్టసవరణ బిల్లులో వారానికి 48 గంటల పని యథాతథంగా ఉంటుందని చెప్పటం ఆశ్చర్యంగా ఉంది. రోజుకి 10 గంటల ప్రకారం వారంలో60 గంటలు పనిచేయాలి.అలాంటప్పుడు 48 గంటలు ఎలా అమలు జరుగుతుంది. అందుకు సంబంధించిన వివరాలు ఏమీచెప్పలేదు. పనిదినాలు తగ్గితేనే అది సాధ్యం అవుతుంది. ఫ్యాక్టరీలచట్ట సవరణబిల్లుకు ముందు ప్రతి మూడు నెలలకు 50నుండి75 గంటలు కార్మికుని



వ్రాతపూర్వక అనుమతితో అదనంగా ఓవర్టైమ్పని చేయించవచ్చు. సవరణల బిల్లులో దాన్ని144 గంటలకు పెంచారు. దీనివల్ల విశ్రాంతిలేకుండా కార్మికులపై పనిభారంతో వత్తిడికిలోనై, ప్రమాదాలు, ఆరోగ్యసమస్యలు ఏర్పడతున్నాయి.ఓవర్టైమ్పని చేసినందుకు ఇచ్చేవేతనంలో కూడా వ్యత్యాసం ఉంది. ఇద్దరు చేయాల్సిన పనిని ఒకని చేత చేయిస్తారు. దీనివల్ల ఫ్యాక్టరీ యజమాని అదనంగా కార్మికులను నియమించుకునే అవసరంలేకుండా అధికలాభాలు పొందితే, మరోపక్క ఉపాధి లేమితో నిరుద్యోగం పెరుగుతుంది. చట్టసవరణలకు ముందు అత్యవసర సర్వీసుల్లో సమ్మె చేయాలంటే 14 రోజుల ముందు సమ్మెనోటీసు ఇవ్వాలి. దీన్ని అత్యవసరంకాని సర్వీసులకు కూడా సవరణల తర్వాత వర్తింపచేశారు.ఫలితంగా అత్యవసరం కాని సర్వీసుల్లో నోటీస్ ఇవ్వకుండానే సమ్మె చేసే హక్కును కార్మికులు కోల్పోతారు. చట్టఉల్లంఘనపైన, ఫ్యాక్టరీల్లో ప్రమాదాలపైనా యాజమాన్యం చిన్నపాటి నష్టపరిహారంతో తప్పించుకునేందుకు చట్టంలోసవరణ చేయటం జరిగింది. దీన్ని అవకాశంగా తీసుకుని యాజమాన్యం ప్రమాదాల బాధ్యత నుంచి, చట్టఉల్లంఘనల నుంచి శిక్షను తప్పించుకునే అవకాశం ఏర్పడింది.ప్రమాదాలకు గురైయ్యే కార్మికులకులభించే పరిహారం నిరుపయోగంగా మారుతుంది.ఫ్యాక్టరీల చట్టంలోని సెక్షన్ 66 ప్రకారం మహిళాకార్మికులతో రాత్రి ఏడు గంటల తర్వాత ఉదయం 6 గంటలలోపు పనిచేయించకూడదు. దీన్ని సవరిస్తూ బిల్లులో మహిళలు రాత్రిపూట కూడా పనిచేయవచ్చని పేర్కొనటం జరిగింది. ఇది మహిళలకు సమానహక్కు కల్పించటంగా పేర్కొంది. వాస్తవంలో తక్కువ వేతనంతో మహిళల శ్రమశక్తిని యజమానులు కొల్లగొట్టే అవకాశం బిల్లుద్వారా కల్పించటమే. భారత సామాజిక వ్యవస్థ అర్ధభూస్వామ్య సంస్కృతిని కొనసాగిస్తున్నది. ఫలితంగా పురుషాధిక్యత కొనసాగుతూ స్త్రీని విలాస వస్తువుగా చూస్తున్నది.స్త్రీలపై నిరంతరం అనేక అత్యాచారాలు, హత్యలు కొనసాగుతున్నాయి.ఫ్యాక్టరీల్లో పట్టపగలే స్త్రీలు బలవంతపు అత్యాచారాలకు గురౌతున్నారు. అలాంటి పరిస్థితుల్లో రాత్రిపూట పనిచేసే మహిళా కార్మికులకు భద్రతఎలా ఉంటుంది. యజమానులు కల్పించే మహిళాభద్రత ఎలాంటిదో స్త్రీలకు, ప్రజలకు తెలిసిన విషయమే. 2022లో కేంద్రంలోని మోడీప్రభుత్వం, ఎన్నోపోరాటాలు చేసిసాధించుకున్న 44 కార్మిక చట్టాలను ఏకీకృతం చేయటం పేరుతో కార్మిక హక్కులను హరిస్తూ నాలుగులేబర్ కోడ్‌లుగా మార్చివాటిని చట్టాలుగా మార్చేందుకు పార్లమెంట్లో ప్రవేశపెట్టినప్పుడు టిడిపి పార్టీ దానికి మద్దతు తెలిపింది. అప్పుడే తన కార్మిక వ్యతిరేకతను చాటుకుంది.కార్మికవ్యతిరేక విధానాలు అమలు జరపడంలో మోడీవిధానాలనే చంద్రబాబు ప్రభుత్వంఅమలు చేస్తున్నది.ఏపీఫ్యాక్టరీల చట్టసవరణబిల్లు ద్వారా పరిశ్రమల, సంస్థలపై ప్రస్తుత చట్టంవల్ల కలిగే విధానపరమైన ఇబ్బందులు తొలగించేందుకు చేసిందిగా కూటమి ప్రభుత్వం చెప్పటం ద్వారా పరిశ్రమల,ప్రయోజనాల ప్రయోజనాలుకాపాడి, కార్మికహక్కులను కాలరాయటంఅన్నకూటమిప్రభుత్వవిధానం బయటపడింది.చంద్రబాబు ఆలోచనలు,విధానాలు పెట్టుబడిదారుల,ఫ్యాక్టరీల యజమానుల చుట్టూ తిరుగుతూ,కార్మిక హక్కులను హరించేవిగా ఉంటాయి.అందులో భాగమే ఫ్యాక్టరీలచట్ట సవరణబిల్లు.ఈబిల్లునువెంటనేఉపసంహరించాలి. ●

# ప్రజావాక్కు



## పిల్లల భవిష్యత్తుకు అల్పాహార పథకం

తెలంగాణ ప్రభుత్వం తమిళనాడు ఉదయం అల్పాహార పథకాన్ని ఆదర్శంగా తీసుకోవడం శుభపరిణామం. పేద కుటుంబాల పిల్లలు తరచుగా ఉదయం అల్పాహారం లేకుండా పాఠశాలకు వెళ్తారు. దాంతో చదువుపై ఏకాగ్రత తగ్గి,హాజరు కూడా ప్రభావితమవుతుంది.అలాంటి పరిస్థితుల్లో పాఠశాలలోనే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందిస్తేవిద్యార్థులు ఆరోగ్యంగా,ఉత్సాహంగా చదువుకోవచ్చు.తమిళనాడులో ఈ పథకంమంచి ఫలితాలు ఇచ్చినట్లు అనుభవం చెబుతోంది. అదే మార్గంలో తెలంగాణ కూడా అడుగులువేయడం,పిల్లల భవిష్యత్ పట్ల ప్రభుత్వ కట్టుబాటును సూచిస్తుంది. పథకం విజయవంతం కావాలంటే వంట నాణ్యత,పర్యవేక్షణ, పారదర్శకత కీలకం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## జనరిక్ మందులపై అవగాహన అవసరం

జనరిక్ మందులవినియోగాన్ని ప్రోత్సహించడం నేటి సమాజానికి,ముఖ్యంగా ఆర్థికంగా బలహీన వర్గాల వారికి అత్యంత కీలకం. బ్రాండెడ్ మందులతో సమానమైన నాణ్యతతో,30నుంచి 80తక్కువ ధరకు లభించే జనరిక్ మందులు ప్రజల ఆరోగ్యహక్కును సాకారం చేయగలవు. జనరిక్ ఔషధాలు ప్రపంచ ఆరోగ్య ప్రమాణాలకు అనుగుణంగాతయారవుతాయి.బ్రాండెడ్ కంపెనీలు మార్కెటింగ్, బ్రాండింగ్‌ల కోసం చేసే అనవసర ఖర్చులు జనరిక్ మందులకు ఉండవు.అందుకే అవి తక్కువ ధరకే అందుబాటులోకి వస్తాయి. జనరిక్ మందుల వాడకం పెరిగితే, వైద్య ఖర్చులు తగ్గుతాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ప్రకృతిని కాలుష్య రహితం చేద్దాం

అప్పట్లో వర్షాలు పడి వరదల్లో కొట్టుకు వచ్చిన మురికి నీరు చెరువుల్లోకి చేరికాలుష్యంగా మారడంతో ఆ మురికి నీటిని స్వచ్ఛమైన నీరుగా మార్చడానికి పెద్దలందరూ ఔషధ గుణాలు కలిగిన అరుదైన పువ్వులతో శాస్త్రీయంగా భక్తితో బతుకమ్మ పండుగను జరుపుకుని నీటిని కాలుష్య రహితంగా చేసేటోళ్లు..ఈ రోజుల్లో తంగేడు, గునుగు పువ్వులు కరువయ్యి.కాగితపు పూలకు కలర్లు అద్ది శాస్త్రీయపూలను మరిచి వ్యాధుల బారిన పడేలా చేస్తున్నారు. ఇకనైనా ప్రకృతి పూలను తెచ్చి పేరుద్దాం.

- కాల్వ నిఖిత,సిద్దిపేట

## లడఖ్‌లో అశాంతి

లడఖ్‌లో లేహ్ పట్టణంలో కొనసాగుతున్న నిరసనలు హింసాత్మక రూపుదాల్చడం,నలుగురి మృతికి దారితీయడం ఆందోళనకరం. కర్ఫ్యూ విధించడం ద్వారా ప్రభుత్వం పరిస్థితిని అదుపులోకి తెచ్చినా, దీర్ఘకాలిక పరిష్కారం కోసం వెంటనే చర్యలు చేపట్టాల్సి ఉంది. జమ్మూ కాశ్మీర్ నుండి వేరుగా కేంద్ర పాలిత ప్రాంతంగా 2019లో లడఖ్ ఏర్పడినప్పుడు అక్కడి ప్రజల్లో సంతోషం వ్యక్తమైంది.తమ చిరకాలపుకోరిక ఒకరాష్ట్రంగా ఏర్పడడం అన్నది సాధ్యం కావడానికి మొదటి మెట్టుగా భావించారు. ఆ తర్వాత లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రం, స్థానికంగా లేహ్ ప్రాంతానికి, కార్గిల్ ప్రాంతానికి చెరొక అభివృద్ధి మండళ్ల ఏర్పాటు ద్వారా పాలనసాగిస్తోంది. ఈశాన్యంలో అమలవుతున్న ఆరవ షెడ్యూల్ గిరిజన ప్రాంతాలకు స్వయం పాలన కోరుతూవస్తున్నారు.ఆదిశగా నిరసనలు,నిరహార దీక్షలు జరుగుతున్నా పెద్ద స్థాయిలో హింస ప్రబలడం ఇదే మొదటిసారి.

- డా.డి.వి.జి. శంకరరావు,పార్వతీపురం

## ప్రాజెక్టులు నిర్మించాలి

తెలంగాణ పురోగమిస్తుంది రాష్ట్రంవిడిపోతే స్వయం సమృద్ధత సాధిస్తాం అని చేసిన పోరాటం గొప్ప మార్పును తెస్తుంది. తెలంగాణ ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానం సాధించింది. దానికి ప్రధానకారణం చెరువులు కుంటలు మాత్రమే. ఒకనాడు పల్లె పల్లెనా పల్లేర్లు మొలిసే అని పాటపాడుకున్న ఈ నెల ఇవ్వాళ మహబూబ్‌నగర్‌లో కూడా పచ్చటిపొలాలు కనిపిస్తున్నాయి. వాటికి ప్రధాన కారణం కల్వకుర్తి బీమా నెట్టెంపాడ్ కోయిల్ సాగర్ లాంటి ప్రాజెక్టులు ప్రధాన కారణం అయితే ఇప్పుడు ఇది అంత ఎందుకంటే మిషన్ కాకతీయ పథకం ద్వారా పూడిక తీత పనులు జరిగి నీటి నిల్వ సామర్థ్యం బాగా పెరిగింది. తద్వారా జనగామ భద్రాద్రి కొత్తగూడెం మహబూబ్ నగర్ లాంటి కరువు ప్రాంతాలు సైతం జలాన్ని ఒడిసిపట్టడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి.

- భారత అవినాష్, జనగామ

## నిబంధనలు మార్చాలి

భారత దేశంలో ఎన్నికల నిర్వహణలోఎలెక్షన్ కమిషన్ కొన్ని మార్పులు తీసుకురావలసిన ఆవశ్యకతఉంది.ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికలు దేశం మొత్తం ఒకేసారి నిర్వహించాలి. అలాగే ముందస్తు ఎన్నికలు నిషేధించాలి. దీనివల్ల ప్రజాధనం వృధా కాకుండా చూడవచ్చు. అలాగే ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి. ఎన్నికల నిర్వహణలో లొసుగులను సరి చేయాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

గుంటూరు వార్త



# డిప్యూటీ సీఎం పవన్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ

## ప్రధాని పర్యటన, ఆటో డ్రైవర్ల సేవలో, జీఎస్టీ ఉత్సవ్‌పై భేటీలో చర్చ

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 28: తీవ్ర జ్వరంతో బాధపడుతోన్న ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి సీఎం చంద్రబాబు ఆదివారం వెళ్లారు. ఆరోగ్య పరిస్థితిని గురించి పవన్ కళ్యాణ్‌ను అడిగి తెలుసుకున్నారు. జ్వరం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అక్టోబర్ 4వ తేదీన ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభించనున్న



నేపథ్యంలో ఆ అంశంపై డిప్యూటీ సీఎం తో చర్చించారు. ఆటో డ్రైవర్ల కోసం చేపట్టే ఈ పథకం కూడా మన్ననలు పొందుతుందనే విశ్వాసం ఉన్నట్లు పవన్ తెలిపారు. జీఎస్టీ 2.0 సంస్కరణలలో భాగంగా రాష్ట్రంలో చేపట్టనున్న జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహణపైనా చర్చించారు. వచ్చే నెల



16వ తేదీన ప్రధాని మోదీ శ్రీశైలం రానున్న సందర్భంగా రోడ్ షో నిర్వహణ విజయవంతం చేసే అంశంపై ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు. వీటితో పాటు డీఎస్సీ అంశం కూడా ఇద్దరు నేతల మధ్య చర్చకు వచ్చింది. మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి ఒకేసారి 15,941 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడాన్ని పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామక పత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించి యువతలో మనోధైర్యాన్ని, స్ఫూర్తిని నింపారని ముఖ్యమంత్రి చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.

## 54వ డివిజన్‌లో టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త : ప్రజలకు తెలుగుదేశం పార్టీ బలమని,ఇది ప్రజలకోసం పుట్టిన పార్టీ అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు.స్థానిక 54వ డివిజన్ శివనాగరాజు కాలనీలో వార్డు ప్రెసిడెంట్ యర్రగుంట్ల ఆనంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యాలయం ప్రజలకు,ప్రభుత్వానికి వారధిగా ఉండాలని సూచించారు. తెలుగు జాతి కీర్తిని పెంచినపార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. నగరంలో ఏడాదికాలంలో అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ముందంజలో నిలిపామని స్పష్టంచేశారు.ఇందులో నాయకులు భాగస్వాములై ప్రజలకు సేవలందించాలని సూచించారు.కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ముప్పవరపు భారతి,క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గోళ్ళ ప్రభాకర్,డివిజన్ అధ్యక్షులు ఎర్రగుంట్ల ఆనంద్,గంటి నరసింహారావు,దేవరపల్లి కుమార్,చావా కృష్ణ,నన్నిడి శ్రీనివాసరావు,కొమ్ము కిరణ్,గోగినేని శ్రీనివాసరావు,రావి వెంకటరావు,ముత్తవని రాజేష్,సిరాజ్ వలి,రెహమాన్,జనార్థన్,మహబూబ్ పీరా,మురళీ,బాలు,నరేంద్ర,వెంకట్రావు,బిట్రా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



## ఫ్యాన్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త : విద్యార్థులకు చేయూతనివ్వడం సమాజానికి సేవ చేయడమేనని తూర్పుఎమ్మెల్యే నసీర్ అన్నారు.స్థానిక ఫ్యాన్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఫ్యాన్సీ కళ్యాణ మండపంలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు సేవ చేయాలనే సంకల్పం గొప్ప విషయమన్నారు.పాఠశాలల్లో ఎంతోమంది పేద విద్యార్థులు ఉంటారని వీరికి అందించే చిన్న సాయమైనా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదం చేస్తుందన్నారు.దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు.సీఎం చంద్రబాబు నాయుడు,విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.టీచర్ పేరెంట్స్ మీటింగ్ ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.రాష్ట్రంలో డిఎస్సీ ద్వారా 16,347పోస్టుల భర్తీ చేసి నిరుద్యోగులకు బంగారు భవిష్యత్తు అందించామన్నారు.తల్లికి వందనం ద్వారా ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ అమలు చేశామన్నారు.విద్యాకిట్లు అందించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేస్తున్నామని స్పష్టంచేశారు.కార్యక్రమంలో కొనకళ్ల సత్యం,దుద్దూరి శేషప్రభాకర్,దండా రామకృష్ణ,గర్రె శ్రీరాములు,బొచ్చు సుబ్బయ్య,కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా రాంబాబు ప్రమాణ స్వీకారోత్సవం

పెదనందిపాడు, సెప్టెంబర్ 28,ప్రభాతవార్త: కూటమి నాయకుల సహకారంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించి పేద మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేసిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి రామాంజనేయులు అన్నారు. పెదనందిపాడు మార్కెట్ యార్డ్ లో ఆదివారం పెదనందిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఎంపికైన కోడూరి రాంబాబు (రామారావు). ఏబిపాలెం సొసైటీ చైర్ పర్సన్ గా ఎంపికైన స్వయంపూ శివపార్వతి మరో ఇద్దరు పర్సన్స్ చే ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వేదికపైనే సొసైటీ సీఇఒ మదమంచి శ్రీనివాసరావు నూతన కమిటీ చే సంతకాలు చేయించారు. ఎమ్మెల్యే రామాంజనేయులుమాట్లాడుతూ కష్టపడి పని చేసిన కార్యకర్తలను కూటమి ప్రభుత్వం గుర్తించి వారికి పదవులు ఇచ్చి గౌరవిస్తుందని ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు న్యాయం చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి సీనియర్ పార్టీ నాయకులు డాక్టర్ మాకినేని పెద రత్తయ్య మాట్లాడుతూ పార్టీలో విభేదాలు విడనాడి పార్టీ అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేయాలని. ఇంకా ఎవరైనా సరైన పద్ధతిలో నడవకపోతే ప్రభుత్వం అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు జంపని హనుమంతరావు మాట్లాడుతూ. జనవరి నుండి స్థానిక సంస్థల ఎన్నికలు ప్రారంభమవుతాయని ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు విశేషంగా కృషి చేసి. తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించి పార్టీకి గుర్తింపు తేవాలన్నారు. రావి శివరామ కృష్ణయ్య. యార్డు డైరెక్టర్ ఉపేంద్ర మాట్లాడారు. నూతన మండలపార్టీ అధ్యక్షులు కోడూరి రాంబాబు మాట్లాడుతూ. తన ఎంపీకకు సహకరించిన మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య. ఎమ్మెల్యే రామాంజనేయులకు కృతజ్ఞత తెలిపి మండలంలో పార్టీ అభివృద్ధికి తన పూర్తి సహకారం అందజేస్తామన్నారు. ఏపీ పాలెం నుండి శాసనసభ్యులు బి రామాంజనేయులు కోడూరి రామారావు. రావి శివరామకృష్ణయ్య. జనసేన నాయకులను ప్రత్యేక వాహనంపై. కూటమి నాయకులు అభిమానులు వందలాది వాహనాలతో స్వాగతం పలుకుతూ ఊరేగివంపు జరిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు. తెలుగుదేశం పార్టీ నాయకులు. కూటమి జిల్లా నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







# కృష్ణానదికి వరద

# లంకవాసులు అప్రమత్తంగా ఉండాలి

### -మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త) : ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కృష్ణానదికి వరద ఉదృతి పెరుగుతుందని లంక వాసులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అత్తలూరివారిపాలెం దగ్గర కరకట్ట ప్రక్కన ఉన్న స్లూయిజ్‌ను పరిశీలించారు. అనంతరం బొమ్మువానిపాలెం వచ్చిన మనోహర్ కృష్ణానది ఉదృతిని పరిశీలించి గ్రామస్తులతో చర్చించారు. అన్నిశాఖల అధికారులతో విడివిడిగా మాట్లాడారు. ఈ



సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ ఇప్పటికే వరద6.40లక్షల క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజ్ నుండి దిగువకు విడుదల చేస్తున్నట్లు సమాచారం ఉందని, ఆ ప్రవాహం 7లక్షల వరకు పెరిగే అవకాశం ఉన్నందున లంక వాసులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఇప్పటికే నాలుగు బోట్లు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పారిశుద్ధ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. వరద ప్రభావాన్ని బట్టి ముందస్తుగా తూములూరు, హనుమాన్‌పాలెం పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా పిలిపిస్తున్నామన్నారు. లంక గ్రామాల ప్రజలు ఎవరూ అధైర్యపడవద్దని, తాను అండగా ఉంటానని మనోహర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బొమ్మువానిపాలెం గ్రామ సర్పంచ్ కొల్లి రజని, ఇన్‌చార్జి తహశీల్దార్ గోపాలకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, ఆర్.ఐ.వంశీకృష్ణ, నాయకులు అడపా నారాయణరెడ్డి, భీమవరపు కిషోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, గోవతోటి పవలేష్, తాతా శివయ్య, మాజీ సర్పంచ్ బొమ్ము శ్రీనివాసరెడ్డి, అత్తోట ఉప సర్పంచ్ దివ్వెల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## శరన్నవరాత్ర ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మాధవి

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త : పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్థానికంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్ర వేడుకల్లో పాల్గొన్నారు.తొలుత 18వ డివిజన్ ఆర్.అగ్రహారంలోని శ్రీగంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం,ఏటి అగ్రహారం కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం, పట్నంబజార్ లోని కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం,32వ డివిజన్ బ్రాడీపేట లోని కామాక్షి మార్డ్ అపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న శరన్నవరాత్ర మహోత్సవాలకు ఆలయాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి,గళ్ళా రామచంద్రరావు లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించి ఎమ్మెల్యే మాధవికి ఆశీర్వచనాలు అందజేశారు.ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ దసరా పర్వదినాలు సత్మార్గాన్ని,ధర్మాన్ని సూచించే పండుగ సమాజంలో చెడుపై మంచి గెలుపు సాధించే దసరా ఉత్సవాలు అందరికి ఆధ్యాత్మిక శక్తిని,నూతన ఉత్సాహాన్ని ఇస్తాయని,గుంటూరు ప్రజలందరికీ శుభాలు,శాంతి,ఐశ్వర్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నాను అని తెలిపారు.అలాగే స్థానికులు,ఆలయ నిర్వాహకులతో మాట్లాడి వారి అవసరాలు,సమస్యలు తెలుసుకున్నారు.ప్రజల అభ్యున్నతికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో స్థానికులు,పార్టీ నాయకులు,భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## షర్మిల వ్యాఖ్యలపై భాజపా నేతల ఖండన

గుంటూరు విద్య,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త : పిసిసి అధ్యక్షురాలు షర్మిల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘంపై చేసిన వ్యాఖ్యలను బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ తీవ్రంగా ఖండించారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందూవుల మనోభావాలతో షర్మిలమ్మ ఆటలాడుతుందని,షర్మిలమ్మ మాట్లాడే మాటలకు అర్థం ఉందా దళితవాడల్లో దేవాలయాలు ఎవరు కట్టమన్నారంటూ మాట్లాడటంపై జయ ప్రకాష్ నారాయణ తీవ్రంగా ఖండించారు. ఇలా హిందూవులపై ఇష్టానుసారంగా ప్రవర్తించబట్టే కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరించారన్న సంగతి గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.ముస్లీం కట్టిన మసీదులు,క్రిస్టియన్లు చర్చిలు కడితే మాట్లాడటం చేతకాని షర్మిల కూడా హిందూదేవాలయాలపై మాట్లాడం సిగ్గుచేటన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి దళితవాడల్లో హిందూ దేవాలయాలు కట్టడం నిషేధమా అని ప్రశ్నించారు.కాంగ్రెస్‌పార్టీ చేసిన అరాచక హిందూత్వ కార్యక్రమాలు ప్రజలు మరిచపోయారా అని గుర్తు చేశారు.క్రిస్టియన్ మతం ఆచరించే షర్మిల కూడా హిందూ మతం గురించి మాట్లాడటం దారుణమన్నారు.ఇలాంటి వ్యాఖ్యలు తక్షణమే షర్మిల వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల పన్నులతో నడిపే ప్రభుత్వానికి హిందూవుల ముడుపులతో సేవచేసే ధార్మిక సంస్థలకు తేడా తెలుసుకొని మాట్లాడాలి,రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గురించి మాట్లాడే హక్కు షర్మిలకు లేదని జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు.





## వైకాపా డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ

మంగళగిరి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త: అన్యాయానికి గురవుతున్న వైసీపీ కార్యకర్తల కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ ను గుంటూరు జిల్లా మంగళగిరి ఆత్మకూర్ బైపాస్ రోడ్డు నందు గల నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మీడియాతో సమన్వయకర్త దొంతి రెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు లు మాట్లాడుతూ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి గుర్తించి వారికి మనోధైర్యం కలిగించేందుకే ఈ డిజిటల్ బుక్ ను ప్రారంభించారన్నారు ప్రతి ఒక్క కార్యకర్తకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది ప్రతి ఒక్కరు ఈ డిజిటల్ బుక్ లో వారిపై జరిగిన అన్యాయాలను నమోదు చేసుకుంటే మన ప్రభుత్వం వచ్చిన తర్వాత వారికి తగు న్యాయం జరుగుతుందని అన్నారు. మొట్టమొదటిసారిగా ఒక కార్యకర్తపై జరిగిన అక్రమ కేసు పై కోర్టు సిఐడి కి అప్ప చెప్పటం హర్షణీయం అసెంబ్లీ సాక్షిగా బాలకృష్ణ మాట్లాడిన మాటలు పద్మం భూషణ్ చిరంజీవి ఖండించడం చాలా ఆనందకరంగా ఉందన్నారు బాలకృష్ణకు విలువలు లేని మాటలు మాట్లాడి వారి నాన్నగారి విలువను తగ్గిస్తున్నారు. ఈ డిజిటల్ బుక్ స్కానర్ ప్రతి ఒక్కరు వారిపై జరిగిన అన్యాయాలు ఇందులో నమోదు చేసుకోవాలి మండల వారీగా నాయకులు కార్యకర్తలు తెలియపరిచి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బురముక్కు వేణుగోపాల్ స్వామి రెడ్డి, నాలి వెంకటకృష్ణ, తాడిబోయిన శివగోపయ్య, అమరా నాగయ్య, పచ్చల రత్నకుమారి, డేవిడ్ రాజు, ఈపూరి ఆదాం, మల్లేశ్వరరావు తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తం

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త : వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా కోరారు.ఈ మేరకు ఆదివారం ప్రకాశం బ్యారేజీ వద్ద 5.67లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని,రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడం



జరిగిందని చెప్పారు.ఇంకా ఎక్కువ వరద వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని ప్రజలందరూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలెవ్వరూ నదిని దాటడానికి గాని,నది వద్దకు దుస్తులు ఉతకడానికి గాని లేదా ఇతర పనులు చేయడానికి వెళ్ళవద్దని అన్నారు.క్షేత్రస్థాయి అధికారులు తక్షణం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజల్లో అవగాహనకల్పించాలని ఆదేశించారు .కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, అన్నవరం పాలెం,లంక గ్రామాల కృష్ణానది వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.అధికారులు,సిబ్బంది ఇచ్చే సూచనలు పాటించాలని అన్నారు.వరదలు పరిస్థితిపై కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ 08963-2234014ఫోన్‌నంబర్‌కు సమాచారం అందించవచ్చని కలెక్టర్ చెప్పారు.



## 'కూటమి' ప్రభుత్వంపై 'బొల్లా' విష ప్రచారం

### ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ విమర్శ

వినుకొండ,సెప్టెంబర్28,ప్రభాతవార్త: వైకాపా మళ్ళీ అధికారంలోకి వస్తుందనే జగన్ కల ఎప్పటికీ నేరవేరదని రాష్ట్రాన్ని ఒక మూర్ఖుడు,రాక్షసుడు పరిపాలిస్తే ఎంతటి విధ్వంసం జరుగుతుందో ఐదేళ్ళ వైకాపా పాలనలో రాష్ట్ర ప్రజలు గ్రహించారని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీ.వీ మాట్లాడుతూ జగన్ పదే పదే ప్రస్తావిస్తున్న డిజిటల్ బుక్ పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఒక్క ఛాన్స్ అంటూ జగన్ అధికారం కోసం చేసిన మోసాన్ని ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. ఐదేళ్ళ పాలనలో జగన్ పేదలకు చేసిందేమీ లేదన్నారు.నిత్యవసర ధరలు,కరెంటు ఛార్జీలు,చెత్త పన్ను వేసి పేదల రక్తాన్ని తాగారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలు చేరువ చేశామన్నారు. సంక్షేమం-అభివృద్ధి సమపాళ్ళలో కొనసాగుతున్నాయని దీన్ని ఓర్వలేకనే వైకాపా కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనపైన తన సంస్థలపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. బొల్లా అక్రమ వ్యాపారాలు చేసి అవినీతి సొమ్ముతో కోటీశ్వరునిగా ఎలా ఎదిగారో ప్రజలందరికీ తెలుసన్నారు. బొల్లా అధికారంలో ఉన్నప్పుడు జగనన్న కాలనీ పేరిట వందల కోట్లు దండుకున్నారని విపరీతంగా భూకబ్జాలు చేసి కోట్లు గడించారని ఆరోపించారు. జాలలపాలెం భూముల వ్యవహారంలో బొల్లా వాస్తవాలు మాట్లాడకుండా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని గట్టిగా హెచ్చరించారు. సమావేశంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన,కూటమి నాయకులు పాల్గొన్నారు.





## ఏఎన్‌యు టూరిజం విభాగానికి రాష్ట్రస్థాయి పురస్కారం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు28, ప్రభాతవార్త: నాగార్జున యూనివర్సిటీకి 2025 బెస్ట్ టూరిజం ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ అవార్డు లభించింది. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో జరిగిన వరల్డ్ టూరిజం డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల అనంతరం విద్యాపరంగా రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి మరొకసారి ఈ అవార్డు వచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ అవార్డును టూరిజం విభాగాధిపతి ఆచార్య పూర్ణచంద్రరావుకు అందజేశారు. ఈ అవార్డు ఆరోదిగా పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీయం చంద్రబాబు నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో విభాగం మరింత అభివృద్ధి చెందేందుకు నిరంతరం కృషిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, హెల్త్ మినిస్టర్ సత్యకుమార్, ఎంఎల్ఏ బోండా ఉమా, ఏపి టూరిజం అథారిటీ చైర్మన్ ఎన్.బాలాజీ, సిఇఓ ఆమ్రపాలి, కమీషనర్ అజయ్‌జైన్, ఏఎన్‌యు టూరిజం విభాగం అధ్యాపకులు డా.రహ్మాన్, డా.జ్యోతి, డా.గీతాసోనీ, డా.రాజేష్, డా.రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



## 'జాబ్‌మేళా'ను సద్వినియోగం చేసుకోవాలి

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త : యువత జాబ్ మేళాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆదివారం విస్తృతంగా పర్యటించి వరదప్రభావాన్ని ప్రజలకు వివరించి పునరావాస కేంద్రాలకు తరలివెళ్ళాలని కోరారు.ప్రజలతో ముఖాముఖి మాట్లాడుతున్నప్పుడు పలువురు యువత,ముఖ్యంగా కరకట్ట



ప్రాంతంలో కనిపించగా వారి విద్యాభ్యాసం,ప్రభుత్వం చేస్తున్న పనులను అడిగారు.డిగ్రీలు చదివి ఖాళీగా ఉన్నట్లు తెలయజేయగా ప్రభుత్వం జాబ్ మేళాలు నిర్వహిస్తుందని వాటిని వినియోగించుకోవాలని సూచించారు.ప్రారంభంలో తక్కువ వేతనం వచ్చినప్పటికి అనుభవం సంపాదించడం ద్వారా అధిక వేతనాలు పొందగలరని చెప్పారు.ఇంటర్నెట్ తదితర సౌకర్యాల వలన ప్రపంచం చిన్న కుగ్రామంగా మారిందని,అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు.కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు,తహసీల్దార్ పాల్గొన్నారు.

## ప్రజారోగ్య కార్మికులకు ఉచిత మెగా వైద్యశిబిరం

గుంటూరు నగరపాలక సంస్థ,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త : ప్రజారోగ్య కార్మికుల ఆరోగ్యమే నగర ప్రజల ఆరోగ్యానికి రక్ష అని మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు.ఆదివారం గుంటూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సౌజన్యంతో గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య,ఇంజనీరింగ్ కార్మికులు వారి కుటుంబ సభ్యులు సుమారు 3వేల మందికి జిఎంసీ కమీషనర్ పులి శ్రీనివాసులు నేతృత్వంలో సఫాయిమిత్ర సురక్షా శివిర్‌లో భాగంగా లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాటిబండ్ల సీతారామయ్య స్కూల్ ప్రాంగణంలో గైనిక్,కార్డియాలజీ,ఇసీజి, ఎకో,యురాలజీ గ్యాస్ట్రో ఎంట్రాలజీ,కాలేయానికి సంబంధించి అతిముఖ్యమైన ఫైబ్రోస్కాన్,పిడియాట్రిక్స్ లకు సంబంధించి ఉచిత వైద్య పరీక్షలు,రక్తపరీక్షలు మందులు అందించేలా 30మంది నిపుణులైన వైద్యబృందంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ జరిగింది. మేయర్ రవీంద్రబాబు , జీఎంసీ కమీషనర్ పులి శ్రీనివాసులు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు ,ఐఎంఏ గుంటూరు ప్రెసిడెంట్ డాక్టర్ వై.సుబ్బారాయుడు, ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అమర లింగేశ్వరరావు,సెక్రటరీ డాక్టర్ సాయి కృష్ణ,జాయింట్ సెక్రటరీ డాక్టర్ చంద్ర రాధికారాణి,ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ,డాక్టర్ మోహన భాస్కర్,డాక్టర్ ఈ.కృష్ణమూర్తి,డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు,డాక్టర్ జి.శివరామకృష్ణ,డాక్టర్ బి.అప్పారావు,జిఎంసి అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు,డిప్యూటీ కమిషనర్లు బి.సిహెచ్ శ్రీనివాస్,బి.శ్రీనివాసరావు,ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ రామారావు,వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకారవేతనాలు

వినుకొండ,సెప్టెంబర్28,ప్రభాతవార్త: శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా కులాలు,మతాలు,రాజకీయాలకు అతీతంగా పేద ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు,ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణంలోని చీఫ్‌విప్ కార్యాలయంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ కార్యక్రమం



నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 35 మంది జర్నలిస్టుల పిల్లలకు ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున ఉపకార వేతనాలను జీ.వీ,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలన్న ఉద్దేశ్యంతోనే ఫౌండేషన్ స్థాపించి గత 30 ఏళ్ళుగా అనేక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులు వల్ల ఏ ఒక్క విద్యార్థి చదువులు మధ్యలో ఆపకూడదని విద్యార్థులకు ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించి మంచి స్థాయికి రావాలన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఉచిత కంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి అనేక మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి కళ్ళజోళ్ళు,మందులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. అలాగే అగ్ని ప్రమాద బాధితులకు వంటసామాన్లు,ఆర్థిక సాయం,ఇళ్ళు లేని పేదలకు ఉచితంగా ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి ఆధ్వర్యంలో ఫౌండేషన్ సేవలు మరింత విస్తరింపజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'సాంఘిక దురాచారాలపై పోరాడిన జాషువా'

వినుకొండ,సెప్టెంబర్28,ప్రభాతవార్త: తన పదునైన కవిత్వం ద్వారా సమాజంలోని సాంఘిక దురాచారాలను ప్రశ్నించి ఆలోచింపజేసిన గొప్ప అభ్యుదయ కవి గుర్రం జాషువా అని చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం మహాకవి గుర్రం జాషువా జయంతి పురస్కరించుకొని డీసీసీబీ ఛైర్మన్ మక్కెనతో కలిసి స్థానిక నర్సరావుపేట రోడ్డులోని జాషువా విగ్రహానికి



పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ సాహిత్యాన్నే ఆయుధంగా ఎంచుకొని సమాజంలోని దోపిడి,వర్ణ,వర్గ,కుల వివక్షలపై పోరాడిన అభ్యుదయవాది గుర్రం జాషువా తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బొల్లాపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నిక ఏకగ్రీవం



బొల్లాపల్లి,సెప్టెంబర్28,ప్రభాతవార్త: బొల్లాపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా ద్రోణాదుల మల్లికార్జున చారి,సెక్రటరీగా నెమలికొండ శేషయ్యచారి, ట్రెజరర్‌గా ధూళిపాల నాగ సుబ్రహ్మణ్యాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వ బ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మోతడక వీరాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రతి

## శ్రీ మహాచండీదేవిగా అమ్మవారి దర్శనం



యడ్లపాడు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త : శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఏడో రోజు శ్రీ పార్వతీదేవి అమ్మవారు భక్తులకు శ్రీ మహాచండీ దేవిగా దర్శనమిచ్చారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కోసం మహాలక్ష్మీ, మహాకాళీ, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా శ్రీ మహాచండీ అమ్మవారు ఉద్భవించారు. శ్రీ చండీ అమ్మవారిలో అనేక మంది దేవతలు కొలువై ఉన్నారు. శ్రీ మహాచండీ అనుగ్రహం వల్ల విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారతారు, ఏ కోరికలతో ప్రార్థిస్తామో ఆవన్నీ సత్వరమే లభిస్తాయని భక్తుల నమ్మకం. అమ్మవారికి నైవేద్యంగా పులిహోర, కట్టెపొంగలి సమర్పించారు. ఉదయం నుండే అమ్మవారిని భక్తులు భారీగా తరలి వచ్చి దర్శించుకున్నారు.

## కారంపూడిలో నిర్లక్ష్యపు నీడలో కోదండ రామాలయం



కారంపూడి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త: కారంపూడి పట్టణ శివారులోని కుడి కాలువ పక్కన గల మిట్టమీద ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న కోదండ రామాలయంలో నెల రోజులుగా ధీపధూప నైవేద్యాలు జరగకపోవడం భక్తులను కలచివేస్తుంది. రాముడికి పూజలు ఆగిపోవడం గ్రామానికి అరిష్టమని వేదపండితులు హెచ్చరిస్తున్నారు. దాతల సహకారంతో ఎంతో ఆర్భాటంగా నిర్మించిన ఈ ఆలయాన్ని కమిటీ సభ్యులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు బహిరంగంగానే చెబుతున్నారు. రోజువారీ పూజా కార్యక్రమాలకు అవసరమైన ఖర్చులు ఇవ్వకపోవడంతో పూజారులు కూడా ఆపాదించడ తప్పలేదని వేదపండితులు అంటున్నారు. గతంలో వేలకు వేలు జీతాలు వాగ్దానం చేసినా సంవత్సరాలుగా పూజారులకు ఎలాంటి పారితోషికం ఇవ్వకపోవడంతో తమ శక్తి మేరకు పూజలు కొనసాగించినట్లు తెలిపారు. అయితే కనీసం దీపధూప నైవేద్యాల ఖర్చులు కూడా ఇవ్వకపోవడంతో పూజలు పూర్తిగా ఆగిపోయాయి. ఇంత మహిమ గల రామాలయాన్ని నిర్మించి ఇప్పుడు తాళాలు వేయడం గ్రామానికి అరిష్టం తెస్తుందని భక్తులు మండిపడుతున్నారు. దేవాలయం నిర్మించడం ఎందుకు? మూతవేసేలా చేయడం ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పండితులు, మేధావులు కలుగజేసుకొని కమిటీతో చర్చించి నిత్యపూజలు పునరుద్ధరించాలంటూ భక్తులు డిమాండ్ చేస్తున్నారు. రోజూ ధూపదీప నైవేద్యాలు జరిగేలా చర్యలు తీసుకుంటే మాత్రమే గ్రామానికి శుభం జరుగుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యుదాఘాతానికి యువకుని మృతి



కారంపూడి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త: కారంపూడి ఇందిరానగర్ కాలనీ సర్కిల్ మెయిన్‌రోడ్డుకు సమీపంలోని ఒక గల్లీలో ఆదివారం ఉదయం విషాదకర ఘటన చోటు చేసుకుంది. చెట్టుకొమ్మలు తొలగించే క్రమంలో కరెంటు షాక్ గురై యువకుడు మృతి చెందాడు. మృతుడు చెరుకూరి వెంకట కోటయ్య (25) తన స్నేహితుడు కొత్తగా ఇల్లు అద్దెకు తీసుకోవడంతో చెట్టుకొమ్మలు అడ్డుగా ఉన్నాయని వాటిని తొలగించేందుకు కొయ్య ఇనుప కొడవలితో కొమ్మలు కొడుతున్న సమయంలో వాటిలో ఒకటి పక్కనే ఉన్న 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను తాకింది. వెంటనే కరెంటు షాక్ తగలడంతో కోటయ్య ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కోటయ్యకు భార్య, చిన్న పిల్లలు ఉన్నారు. అతని ఆకస్మిక మృతితో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. కుటుంబాన్ని చూసిన ప్రతిఒక్కరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ ఘటనతో ఇందిరానగర్ కాలనీ, కారంపూడి పరిసర ప్రాంతాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. స్థానికులు ఈ ప్రమాదానికి విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కూడా కారణమని ఆరోపిస్తున్నారు. హైటెన్షన్ లైన్ ఇంత దగ్గరగా ఉండటమే ప్రమాదానికి దారి తీసిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


## సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, సెప్టెంబరు 28 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు క్యాంపు కార్యాలయంలో కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల నుండి రావాల్సిన నిధులు, అనుమతులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసారు. అదే విధంగా పట్టణంలోని 5వ వార్డు పరిధిలో ఉన్న శివ సంజీవకాలనీ, 12వ వార్డులో ఉన్న షాలింనగర్ ప్రాంతంలో అసైన్మెంట్‌దారులకు పొజిషన్ సర్టిఫికెట్లు అందించే



విషయం పై మాట్లాడారు. నియోజకవర్గంలో ఉప్పలపాడు ప్రాంతంలో ఆటో నగర్ ఏర్పాటుకు సంబంధించి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. తమ విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని ఆయా కార్యక్రమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు.

## రూ.6కోట్ల కరెన్సీతో మహాలక్ష్మి అలంకరణ



నకరికల్లు, సెప్టెంబరు 28 ప్రభాతవార్త : మండలంలోని నరసింగపాడు గ్రామంలో వేంచేసియున్న మరకత లింగచంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ప్రత్యేకపూజ కార్యక్రమాలలో భాగంగా మహాలక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. రూ. 6కోట్లు నగదుతో అమ్మవారికి విశేష అలంకరణ చేసారు. హాజరైన భక్తులకు ఆలయ ధర్మకర్త పమిడిమర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ నిర్వహించారు.

## ఘనంగా కాసు కృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకలు

నరసరావుపేట, సెప్టెంబరు 28 ప్రభాతవార్త : మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను స్దానికంగా ఆదివారం ఆయన అభిమానులు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్



గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితోపాటు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనకు పుట్టిన రోజు శుభకాంక్షలు తెలిపారు. భారీ కేకులను కాసు కృష్ణారెడ్డి కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. పూలమాలలు, శాలువాలతో ఘనంగా కృష్ణారెడ్డిని సత్కారించారు. మాజీ కౌన్సిలర్ ఏలూరి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాలతో ర్యాలీని కాసు కృష్ణారెడ్డి పుట్టిన రోజు వేడుకలలో భాగంగా నిర్వహించారు. అదే విధంగా పలు సేవా కార్యక్రమాలను ఆయన అభిమానులు నిర్వహించారు. తన కోసం వచ్చిన వారికి ప్రత్యేకంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారికి కాసు కృష్ణారెడ్డి కృతఘ్నతలు తెలిపారు.

## మందుబాబులు, పేకాటకు నిలయంగా క్రైస్తవ సమాధుల తోట : వైకాపా

నరసరావుపేట, సెప్టెంబరు 28 ప్రభాతవార్త : పట్టణంలోని క్రైస్తవ సమాధుల తోట మందుబాబులకు, పేకాటకు నిలయంగా మారిందని జిల్లా వైఎస్సార్‌సిపి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం వైకాపా నాయకులు అధ్వానంగా ఉన్న సమాధుల తోటను



పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్‌గోపిరెడ్డి మాట్లాడారు. పవిత్రమైన సమాధుల తోట గురించి పురపాలక సంఘం అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవటం లేదన్నారు. వచ్చే ఆదివారం లోపు పారిశుధ్య పనులు చేయకుంటే తమ స్వంత నిధులతోఅక్కడ పనులు చేయటం జరుగుతుందన్నారు. అంతర్గత వీధులలో నీరు నిలిచి నడిచేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. సిలువ చుట్టూ పంది కొక్కులు చనిపోయి ఉన్నాయని తెలిపారు. రాత్రి పూట మందుబాబులుఇక్కడ తాగుతున్నారని, పేకాటకు నిలయంగా మారిందన్నారు. తక్షణమే పారిశుధ్య పనులతో పాటు పాడై పోయిన సెంట్రల్ లైటింగ్, మంచినీటి ట్యాపులను బాగు చేయించాలని జిల్లా వైఎస్సార్‌సిపి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేసారు.

## వైకాపా కార్యకర్తల కష్టాలు 'డిజిటల్ బుక్'లో నమోదు: పిఆర్కే



మాచర్ల, సెప్టెంబరు 28 ప్రభాతవార్త: వైసీపీ కార్యకర్తలు పడే కష్టాలను, బాధలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయవచ్చని పల్నాడు వైసీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పక్కనపెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తుందని వైసీపీ కుటుంబ సభ్యులను కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో నాయకులు, అధికారులు పెట్టే ఇబ్బందులను ఈ డిజిటల్ బుక్‌లో పొందుపరిస్తే రేపు జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు ట్రాన్స్‌ఫర్ లేదా, రిటైర్ అయినా సరే వదిలే ప్రసక్తే లేకుండా న్యాయపరంగా శిక్షించే విధంగా జగన్ చర్యలు తీసుకోవడానికి ఈ డిజిటల్ బుక్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రజల కోసం పోరాడుతూ కూటమి ప్రభుత్వం నుంచి వేధింపులకు గురైన వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం. ఎవరికి ఏ కష్టం వచ్చినా డిజిటల్ బుక్‌లో నమోదు చేయండి. మీ తరఫున పార్టీ నిలబడుతుంది. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతుందని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

## 'కపిలవాయి'కి విశ్వజనని ఫౌండేషన్ విద్యారత్న పురస్కారం



మాచర్ల, సెప్టెంబరు 28 ప్రభాతవార్త: విశ్వజనని ఫౌండేషన్ ప్రతిభా పురస్కారాల్లో భాగంగా వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్‌కు విద్యారత్న అవార్డు వరించినట్లు తెలిపారు. నవంబరు 1న హైదరాబాదులోని సురవరం ప్రతాపరెడ్డి, పొట్టిశ్రీరాములు తెలుసు యూనివర్సిటీలో ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. వాగ్దేవి విద్యాసంస్థలు, ఇన్ఫర్‌మేటిక్స్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్, పూజిత కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టరుగా విద్యారంగ సంస్థలో ఆయన చేస్తున్న సేవలకు ఈ అవార్డు అందుకోనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు బొగ్గరపు బ్రహ్మానందం తెలిపారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ

మాచర్ల, సెప్టెంబరు 28 ప్రభాతవార్త: ఆవోపా ఆద్వర్యంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక పల్నాడు జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ ఛైర్మన్, జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కూనిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, చదువుతున్న పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఆర్యవైశ్యులు ప్రస్తుతం అన్ని రంగాల్లో



ముందుకు దూసుకుపోతున్నారని అన్నారు. ఆవోపా అధ్యక్షులు, ఉపాధ్యాయులు జేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుఉగా మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సలహాలను అందించేందుకు సిద్ధమని చెప్పారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి తుమ్మేపల్లి సాంబశివరావు, వాసవీ క్లబ్ జోన్ ఛైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, పాస్ట్ రోటరీ క్లబ్ అధ్యక్షులు మేడం నాగేశ్వరరావు, సీనియర్ ఆవోపా నాయకులు రంగా లక్ష్మీనారాయణ, టంగుటూరి ఈశ్వరయ్య, ఆవోపా కార్యదర్శి తిరివీధుల వెంకట నాగేశ్వరరావు, వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు భవనాశి రవితేజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రులు

వినుకొండ,సెప్టెంబర్28,ప్రభాతవార్త: పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఏడవ రోజు అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమించారు. అమ్మవారికి రంగు రంగుల గాజులతో





ప్రత్యేక అలంకరణ చేశారు. బాలికలచే ప్రత్యేక భరతనాట్యం,కళ్యాణ మండపం ఆవరణలో 450 మందిమహిళలతో కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పది రోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు,కుంకుమార్చనలు,పూజా కార్యక్రమాలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు బొన్నలగడ్డ బాబ్జి,గౌరవ అధ్యక్షులు తాతా వెంకట సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల అమర్నాధ్,రెడ్డినగేష్‌బాబు,కోశాధికారి పెండ్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**నూజెండ్లలో:** మండలంలోని రవ్వారం గ్రామ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర జగన్మాత పీఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రధానాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు,పూజలు చేసి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## కాన్ఫిడేరేషన్ ఆఫ్ లైసెన్సుడ్ ఇంజనీర్స్, సర్వేయర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ఆఫ్ ఏపి యూనియన్ నూతన కమిటీ

నరసరావుపేట, సెప్టెంబరు 28 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా కాన్ఫిడేరేషన్ ఆఫ్ లైసెన్సుడ్ ఇంజనీర్స్, సర్వేయర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ ఆఫ్ ఏపి యూనియన్ నూతన కమిటిని ఆదివారం ఎన్నుకోన్నారు. స్దానిక ఐఎంఏభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మసాని కమలాకర రెడ్డి రాష్ట్ర నాయకులు ముని శ్రీనివాసరావు, ఎన్ఎన్‌విఎస్ఎస్ మూర్తి, ఆర్ సతీష్‌కుమార్ పాల్గొని తమ సందేశాలుఇచ్చారు. ఇంజనీర్స్ వృత్తిలో ఎదురవుతున్న పలు సమస్యలపై చర్చించారు. అనంతరం కార్యక్రమంలో జిల్లా నూతన కమిటి సభ్యులుగా గౌరవ ఛైర్మన్ కొమ్మసాని కమలాకరరెడ్డి, ఛైర్మన్‌గా ఎం మురళి, అధ్యక్షులుగాఎస్ లక్ష్మీకాంత్, ట్రెజరర్‌గా డి రాజశేఖర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎం శ్రీనివాసరావు, బి నరేంద్ర, జనరల్ సెక్రటరీలుగా ఎం రామాంజనేయులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఇంజనీర్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.




## వైకాపా రాష్ట్ర కార్యాలయం కార్యదర్శిగా వీరారెడ్డి నియమాకం

నరసరావుపేట, సెప్టెంబరు 27 ప్రభాతవార్త : వైఎస్సార్‌సిపి తాడేపల్లి కేంద్ర కార్యాలయం రాష్ట్ర కార్యదర్శిగాపల్నాడు జిల్లాకు చెందిన వి వీరారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ సెంట్రల్ ఆఫీస్ నుండి ఆయనకునియామక పత్రాలు విడుదల చేసారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని కుంకులగుంట గ్రామానికి చెందిన వీరారెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి వైకాపా కార్యకర్తగా కొనసాగుతున్నారు. గత ప్రభుత్వంలో ఆయన డిజిటల్ కార్పేరేషన్ డైరెక్టర్‌గా సేవలందించారు. రాష్ట్ర కార్యాదర్శిగా నియమితులైన వీరారెడ్డికి పలువురు పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనపై పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉంచిన నమ్మకం నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని వీరారెడ్డి తెలిపారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

రొంపిచర్ల, సెప్టెంబరు 28 ప్రభాతవార్త : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వ హించారు. ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, విద్యార్ధులు రోటరీ సభ్యులకుతమ



వంతు సహాకారం అందించారు. శిబిరంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ గాయత్రి, క్లబ్ అధ్యక్షులు షేక్ కరీం, సెక్రటరీ భవనం మునీందర్‌రెడ్డి, డైరెక్టర్‌లు మేళ్లచెరువు సుమిత్ర,జమ్ములు రాధాకృష్ణా, జిలాని మాలిక్, సుబ్బారావు, పున్నారావు, ఆంజనేయులు సేవలందించారు. గ్రామ మాజీ సర్పంచ్ చక్రారెడ్డి, పిచ్చిరెడ్డి తమ వంతు సహాకారం అందించారు. మొత్తం 300వందల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 150మందికి శుక్లం ఆపరేషన్‌లు నిర్వహించాలని వైద్యులు సూచించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారి కి ఉచితంగా వాటిని నిర్వహించి తమ వాహనాలలో తిరిగి ఇంటి వద్దకు తీసుకుని రావటం జరుగుతుందని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

# ప్రభుత్వ భూమి ప్రభుత్వ అవసరాలకు ఉపయోగ పడేనా ?

## ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో కాసులు కురిపిస్తున్న వైనం !

యడ్లపాడు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త : భవిష్యత్ తరాల అవసరాల నిమిత్తం ప్రభుత్వం కొంత భూమిని రిజర్వ్‌చేసి ఉంచుతుంది. మరి కొంత భూమిని అప్పటి అవసరాల నిమిత్తం నివేశనా స్దలాలకు, సాగు అనుకూలమైన భూమిని సాగు నిమిత్తం బడుగు బలహీన వర్గాల లబ్ధిదారులకు కండీషనల్ పట్టాల రూపంలో అందజేస్తారు. భవిష్యత్‌లో ఎప్పుడైనా ప్రభుత్వానికి అవసరమైనప్పుడు మరలా తిరిగి తీసుకోనేవిధంగా ఉంటుంది. అయితే వీటన్నింటిని ప్రభుత్వం ప్రత్యేకంగా 22(ఎ)గా పరిగణించి వాటిపై ఎటువంటి లావాదేవీలు జరగకుండా చూస్తుంది. అయితే కొంతమందికి మాత్రం అధికారుల తప్పిదమో లేక పట్టించుకొనే వారు లేరేమో అని వారి ఇష్టానుసారంగా నిర్వహించుతూ ఎప్పటివో జీవోలు చూపుతూ వారి పనికాకపోయినా వాటిని మార్పులు చేస్తూ ప్రభుత్వానికి సమస్యగా తయారు అవుతున్నారు. వీరి కారణంగా ప్రభుత్వ భూమిని ఎదేచ్ఛగా వ్యవసాయ భూమిగా సాగుచేసుకుంటూ వారు మాత్రం కాసులు కురిపించుకుంటున్నారు. చివరికి వీరి వ్యవహారం ఎక్కడి దారాక పోయిందంటూ అధికారులు ప్రభుత్వ రికార్డులలో వీరి పేరు చేర్చేదాక వచ్చింది. నేడు మండలంలో ఏడాది కేడాదికి నివేశనా స్దలాలకు లబ్ధిదారుల సంఖ్య పెరిగిపోతున్నా ఇక్కడ మాత్రం ప్రభుత్వ భూమి అధికారుల



అదీనంలో లేకపోవటం విశేషం. ప్రభుత్వం నివేశనా స్దలాలు అందజేస్తామని అనటంతో మండల పరిధిలోని అన్ని గ్రామాల నుండి అర్జీలు ఇబ్బడి ముబ్బడిగా రావటం జరిగింది. వీటిని పరిశీలించటంలో అధికారులకు తలనొప్పిగా మారింది. జిల్లాలో ఏ మండలంలో రాని విధంగా యడ్లపాడు మండలంలో సుమారు రెండు వేల అర్జీలు అందాయి. ప్రభుత్వం మాత్రం అందజేస్తామని చెపుతున్న కోటావిధంగా మాత్రం 250మాత్రమే నని అధికారులు తెలుపుతున్నారు. ఉన్న ప్రభుత్వ భూమిని పరిరక్షణలోపం కారణంగా లబ్ధిదారులకు పట్టాలు అందజేయాలంటే మాత్రం లక్షలలో ప్రభుత్వం భూములు కొనుగోలు చేసి ఇవ్వవల్సిన దుస్థితి నేడు మండలంలో చోటు చేసు కుంది. దీనిపై జిల్లా స్దాయి అధికారులు బృందం పూర్తిస్దాయిలో ప్రక్షాళణ చేసి రీ పరిశీలన చేసి అన్ని అన్యాక్రాంతమైన భూములను వెనక్కితీసుకుంటేగాని సమస్య పరిష్కారం అయ్యే విధంగా లేదు. దీనికి తోడు నియోజక వర్గ అసైన్డ్ కమిటి సమావేశం నిర్వహించి పరిరక్షించవల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.

## శక్తి స్వరూపిణి శ్రీకనకదుర్గమ్మ: అనగాని శివప్రసాద్




నిజాంపట్నం, సెప్టెంబరు 28, ప్రభాతవార్తః శక్తి స్వరూపిణిగా, ఆదిపరాశక్తిగా శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని భక్తులు కొలుస్తారని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. ఆదివారం నిజాంపట్నంలోని యాదవ బజార్‌లో, జల్సా బజార్‌లో దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజాది కార్యక్రమాలను జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్దలతో పూజలు చేయాలని కోరారు. జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య, కేసన రామకృష్ణ, తాతా ఏడుకొండలు, కొలసాని రాము, కుమారస్వామి, గుడారంకయ్య పాల్గొన్నారు.

## వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో వేదపారాయణం



తెనాలి టౌన్, సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త): వేద పారాయణ హిందూ సంప్రదాయంలో ఎంతో పవిత్రమైనదని, అది ఒక ధార్మిక ఆచారబంధమైనదని, తద్వారా ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందని, తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపల్ బ్రహ్మశ్రీ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని పేర్కొన్నారు. శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా, ఆదివారం పట్టణంలోని నాజర్ పేటలోగల, వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య భవనంలో, బ్రహ్మశ్రీ సామవేదం సత్యనారాయణ ఆధ్వర్యంలో వేద పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఘనపాటి విష్ణుభట్ల ఆంజనేయ చైనులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుబ్రహ్మణ్య అవధాని మాట్లాడుతూ వేద పారాయణ ద్వారా ఆధ్యాత్మిక శక్తి పెరగటంతో పాటు శుభ ఫలితాలు లభిస్తాయి అన్నారు. నెగిటివ్ ఎనర్జీ తొలగి మంచి వాతావరణం ఏర్పడుతుందని, సంపద ఆరోగ్యం శాంతి ఐశ్వర్యాలు కలుగుతాయన్నారు. దైవ అనుగ్రహం కూడా సంపూర్ణంగా లభిస్తుందని తెలిపారు సమాఖ్య అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ, వేదపారాయణను గురువు మార్గదర్శకంలో చేస్తే గొప్ప ఫలితాలు లభిస్తాయన్నారు. 50 మంది వేద పండితులు వేద పారాయణ నిర్వహించారు. అనంతరం సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో పండితులను ఘనంగా సన్మానించారు. సమాఖ్య పాలకవర్గాన్ని పండితులు ముక్తకంఠంతో వేదమంత్రాలతో ఆశీర్వదించారు. సమాఖ్య ప్రతినిధులు కుందేటి సుబ్రహ్మణ్యం, తిరుమలరావు, కామేశ్వరరావు, నారాయణ వేణుగోపాల్, అనిల్ కుమార్, మేడూరు శ్రీనివాసమూర్తి, ఆంజనేయులు, పొనుగుపాటి వెంకటేశ్వర్లు, టి.నాగ సుబ్రహ్మణ్యం, తాడేపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి: బిఎస్పీ నేతల ఫిర్యాదు




తెనాలి టౌన్ సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త): పట్టణంలోని ఐతానగర్ ప్రాంతంలోని ,క్రిస్టియన్ సమాధులు తోట దురాక్రమణలకు గురౌతున్నట్లు, సమాదులకు మరో చోట స్థలాన్ని కేటాయించాలని కోరుతూ, బహుజన సమాజ్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇంచార్జి కారుమంచి సునీల్ సందీప్ అన్నారు. ఆదివారం ఐతానగర్ క్రైస్తవ సమాదులవద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, క్రైస్తవులకు కేటాయించిన సమాదులతోట దూరాక్రమనలకు గురవడంతో, మృతిదేహాలు భూస్థాపన చేయడానికి స్థలం కొరత ఏర్పడుతుందని, ఆరోపించారు. స్వయంగా తన పితరుల సమాధులు దూరాక్రమనలకు గురైనట్లు, ఐతానగర్ ప్రాంతానికి చెందిన గెద్దటి ప్రకాష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పెద్దల సమాధులను కళ్లారా చూసుకోలేని దుస్థితి ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై గద్దటిప్రకాష్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో, పట్టణానికి చెందిన వైద్యురాలు దర్శి జీవనలత సమాదుల స్థలాన్ని అక్రమించినట్లు, పిర్యాదుచేయగా విచారించి చర్యలు తీసుకొంటామన్ని సి.ఐ రాములనాయక్ చెప్పారని ప్రకాష్ తెలిపారు. క్రిస్టియన్ సమాదులతోట కు స్థలాన్ని కేటాయించాలని గత ప్రభుత్వాలను కోరినా ఫలితం లేదని, ప్రస్తుతం సమాధులు కట్టడాలు పెరగడంతో, సమాధులు స్థలం కరువైందని తెనాలి బాప్టిస్ట్ చర్చి కార్యదర్శి తెనాలి ఆనంద్ కుమార్ అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో, గెద్దటి జ్ఞానరాజు, బొనిగల ప్రదీన్, కోంద్రురాజు, కొమ్ము వర్మ, కంచర్ల సుమంత్, పిల్లి క్రాంతి, కొప్పుల అనిల్, బోనిగల ప్రవీణ్ తదితరులు పాల్గున్నారు.

## శ్రీమహా చండీదేవిగా దుర్గామాత దర్శనం




తెనాలి టౌన్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, ఏడో రోజు అమ్మవారు శ్రీ మహా చండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని పలు ఆలయాల్లోని అమ్మవారికి శుక్రవారం విశేషంగా అలంకరణ చేశారు. శ్రీ మహా చండీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వగా, ఉదయం నుండి విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుండి భక్తులు ఆలయాలకు విచ్చేసి, అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకుని, కానుకలు సమర్పించారు. పట్టణంలోని అష్టలక్ష్మి అమ్మవారి దేవాలయం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, శివాజీ చౌక్ ప్రాంతంలోని శ్రీ కాళికామాత దేవస్థానం, అలాగే దేవిచౌక్ ప్రాంతంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానం, ఇంకా పలు దేవాలయాల్లోని అమ్మవారి ఆలయాల్లో, అమ్మవారి దివ్యశోభ, భక్తుల కోలాహలం, ఆలయ ఏర్పాట్లు దసరా ఉత్సవాల వైభవాన్ని చాటి చెబుతున్నాయి. ఈ ఆధ్యాత్మిక వాతావరణం భక్తుల రద్దీని, ఏర్పాట్ల తీరును, ప్రతిబింబిస్తూ తయారుచేసిన ప్రత్యేక అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

## గుర్రం జాషువాకు ఘననివాళి



తెనాలి టౌన్, సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త): సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు తన కవిత్వం ద్వారా ప్రజలను చైతన్యపరచిన గొప్ప రచయిత గుర్రం జాషువా అని ఆయన అభిమానులు పేర్కొన్నారు. విశ్వ కవి పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా, ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న జాషువా విగ్రహమువద్ద, ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాషువా రచనలు సమాజంలోని అసమానతలను నిప్పురవ్వలై ఛేదించాయని, కుల వివక్షను ధైర్యంగా ఎదుర్కొని కవి సామ్రాట్ గా కీర్తి పొందిన ఆధునిక తెలుగు కవి గుర్రం జాషువా అన్నారు. జాషువా బాల్యం నుంచే ఛీత్కారాలు ఎదురైనా తలొంచక, తన కవిత్వాన్ని ఆయుధంగా మలిచారన్నారు. ఆయన రచనల్లో కెల్లా కుల వివక్ష పై రాసిన, గబ్బిలం ఫిరదౌసి క్రీస్తు చరిత్ర అత్యంత ప్రజాదరణ పొందాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ కళా ప్రపూర్ణ లాంటి బిరుదులు పురస్కారాలు అందజేసాయన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా విజ్ఞానసమితి కమిటీ సభ్యులు, జాషువా అభిమానులు పాల్గొన్నారు.

## మధుమేహ వ్యాధిపై అవగాహన సదస్సు



తెనాలి టౌన్ సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మధుమేహ వ్యాధి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని బోస్ రోడ్డు లో ఉన్న అసోసియేషన్ భవనంలో నిర్వహించిన, ఈఅవగాహన సదస్సు ను, మాజీ శాసన సభ్యురాలు, ప్రముఖ వైద్యురాలు, డాక్టర్ గోగినేని ఉమ ముఖ్యఅతిధిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సదస్సు కు ఐఎంఏ తెనాలి శాఖ మాజీ అధ్యక్షులు డాక్టర్ చందు సాంబశివుడు అధ్యక్షత వహించారు. అనంతరం డాక్టర్ ఉమ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవటం, సమయపాలన, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, లాంటివి పాటించి మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. సాధారణంగా మధుమేహం యొక్క లక్షణాలు, అధికదాహం, తరచుగా మూత్రవిసర్జన(ముఖ్యంగా రాత్రిళ్ళు), బరువు తగ్గటం, అధిక అలసట, ఆకలి పెరగటం, దృష్టిలోపం, గాయాలు నెమ్మదిగా తగ్గటం, ఇవన్నీ మధుమేహ లక్షణాలని, ఈ లక్షణాలలో ఏవైనా ఉంటే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. అలాగే మెడికల్ ప్రాక్టీషనర్లకు ఎంతో ఉపయోగకరమైన సీఎంఈ కార్యక్రమాన్ని తొలిసారిగా తెనాలిలో నిర్వహించటం పట్ల పలువురు వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్, కార్యదర్శి మధు ప్రభాకర్, అలాగే పట్టణానికి చెందిన పలువురు సీనియర్ వైద్యులు, ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## కృష్ణా నది వరద ప్రవాహంతో ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడకూడదు

### - అధికారులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

బాపట్ల, సెప్టెంబర్28, ప్రభాతవార్త: కృష్ణ నది వరద ప్రవాహంతో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదని, వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. ఆదివారం సాయంత్రం బాపట్ల జిల్లా, రేపల్లె రెవిన్యూ డివిజన్ పరిధిలోని కొల్లూరు మండలం కృష్ణ నది నీటి ప్రవాహం తో ముంపు ప్రమాదం ఉన్న తోకల వారిపాలెం, పోతర్లంక, గాజుల్లంక, అవుల వారి పాలెం పరిధిలో కృష్ణ నది నీటి ప్రవాహం తో ముంపు గ్రామాల్లో ఆర్డీఓ, మండల స్థాయి అధికారులు ,గ్రామ సర్పంచులతో కలసి పర్యటించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో కృష్ణా నదికి అధిక నీరు రావడం జరుగుతుందన్నారు. రెండో వార్నింగ్ మ్రోగిందని ఆరు లక్షల 50 వేల క్యూసెక్కుల నీరు రావడం జరిగిందని, ముంపు గ్రామాల్లో ఉన్న ప్రజల అందరిని అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. కొల్లూరు మండలంలో వరద ప్రవాహం తో ముప్పు ఉన్న గ్రామాలలో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో రీహెబిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముంపు గ్రామాలలో ఇప్పటికే 80 శాతం నిత్యావసర వస్తువులు పంపిణి చేశామన్నారు. వరద పరిస్థితుల పై గ్రామస్థులకు పరిస్థితులను ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా తెలియజేయాలన్నారు. కృష్ణ నది నీటి ప్రవాహం ప్రాంతాల్లో ఉన్న గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత మండల స్థాయి లో అధికారులతో టీమ్స్ ను ఏర్పాటు చేశామన్నారు. ముంపు ప్రాంతల్లో గ్రామాలలో ఎలాంటి సమస్యలు వస్తాయని ప్రజలను కలెక్టర్ అడిగి తీసుకున్నారు. రోడ్లు, వర్ష కాలంలో పిల్లలు స్కూల్స్ కు నదిలో గుండా వెళవాల్సి వస్తుందని, రోడ్లు, బోట్స్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కలెక్టర్ కు తెలియజేసారు. మీరు చెప్పిన సమస్యలు పరిష్కరం చేస్తామని గ్రామస్థులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. పోతర్లంక, గాజుల్లంక గ్రామంలోని రేషన్ షాప్స్ ను పరిశీలించి రేషన్ కార్డులు ఉన్న అందరికి నిత్యవసర వస్తువులు సంక్రమంగా పంపిణీ చేస్తున్నారా అని డీలర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్‌డివో విజమలక్ష్మీ, డిపిఓ. ప్రభాకర్ రావు, మండల తహాశీల్దార్, ఎంపిడిఓ. పంచాయతీ సెక్రటరీ, వి ఆర్ ఓ విఆర్ సర్పించులు తదితరులు ఉన్నారు.




## దసరా సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలి: ఎస్పీ



బాపట్ల, సెప్టెంబర్28, ప్రభాతవార్త: దసరా సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై కచ్చితంగా నిఘా ఉంచాలని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో అదివారం ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో జరిగిన కొన్ని పరిణామాలను దృష్టిలో ఉంచుకొని పిల్లలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలియజేస్తున్నామన్నారు. జిల్లాలో ముఖ్యంగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా గ్రామాలు, పట్టణాల శివారులలో ఉన్న చెరువులు, గుంతలు నిండిపోగా, నదులు, వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. సెలవుల కారణంగా సరదాగా కాలక్షేపం కోసం పిల్లలు, యువకులు చెరువులు, కాలువలు, వాగులు, నదీతీరాలు, సముద్రతీరాలకు వెళ్లి ఈతకు దిగే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. బాపట్ల జిల్లా పరిధిలో విశాలమైన సముద్రతీరం ఉండటంతో ముఖ్యంగా సూర్యలంక, వాడరేవు, రామాపురం వంటి సముద్రతీరాలకు యాత్రికులు భారీగా తరలివస్తున్నారని వారిలో కొందరు యువకులు పోలీసుల హెచ్చరికలను లెక్కచేయకుండా లోతుగా సముద్రంలోకి వెళ్లి, అకస్మాత్తుగా వచ్చే పెద్ద అలల వల్ల ప్రమాదాల్లో పడుతున్న ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఈ తరహా ఘటనలను నివారించేందుకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. పిల్లలు, యువత పోలీసు శాఖ సూచనలు కచ్చితంగా పాటించాలని, మీ ప్రాణం మీ చేతుల్లోనే ఉందన్న బాధ్యతతో నడవాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

బాపట్ల, సెప్టెంబర్28, ప్రభాతవార్త: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే పి జి ఆర్ ఎస్ లో ప్రజల అందజేసిన సమస్యల అర్జీల పై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఆతర్వాత 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం తెలిపారు. తెలిపారు. జిల్లా కలెక్టరేట్ తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్ కార్యాలయాలలో ను మరియు మండల తహాశీల్దార్ల కార్యాలయాలలోసంబంధిత అధికారులు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరిస్తారన్నారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఆయన తెలిపారు.

## లోతట్టు ప్రాంతాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల, సెప్టెంబర్28, ప్రభాతవార్త: కృష్ణా నదిలో నీటి ప్రభావం వేగంగా పెరుగుతుందని అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. అధివారం కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ రేపల్లె రెవిన్యూ డివిజన్ పరిధిలో విదులు కేటాయించిన అధికారులు సిబ్బంది సిద్ధంగా ఉండి పరిస్థితులను ఎప్పటికపుడు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజల ను సురక్షిత ప్రాంతంలోని 25 రిహెబిటేషన్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రీహెబిటేషన్ కేంద్రాలకు డిఆర్డీఏ పి డి.లవన్న ఇంచార్జి గా ఉన్నారన్నారు. రీ హెబిటేషన్ కేంద్రానికి వి ఆర్ ఓ, విఆర్ ఏ, అంగన్వాడీ వర్కర్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్ లు,ఏ యన్ ఎం లతో టీం వాట్సాప్ గ్రూప్ లో వరద పరిస్థిని అధికారులకు సిబ్బందికి వెంటనే తెలియజేయాలన్నారు. రీహెబిటేషన్ కేంద్రాలలో త్రాగునీరు, మందులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీహెబిటేషన్ కేంద్రానికి డిప్యూటీ ఎంపీడీఓ ఇంచార్జి గా బాధ్యతగా పనిచేయాలన్నారు. రీహెబిటేషన్ కేంద్ర పరిధిలోని గ్రామస్తుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోని వరద పరిస్థితులను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలపాలన్నారు. రీహెబిటేషన్ కేంద్రాల మేనేజ్మెంట్ మరియు ప్రజల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు జిల్లా మత్స్య శాఖ అధికారితో సమన్వయం చేసుకొని, లైఫ్ జాకిట్స్, రోప్స్, (తాళ్ళు) అన్ని పరికరాలు సిద్ధంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారిని ఆదేశించారు. రీహెబిటేషన్ తో పాటు హెబిటేషన్ పరిధిలో ఉన్న అధికారులు సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.



## శ్రీమహా చండీ దేవిగా అమ్మవారు దర్శనం

బాపట్ల, సెప్టెంబర్28, ప్రభాతవార్త: శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో బాపట్ల కోన ప్రభాకర రావు కళాక్షేత్రం లో అత్యంత వైభవంగా జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల లో భాగంగా అదివారం అమ్మవారు శ్రీ మహా చండీ దేవి గా భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, తీర్ధ ప్రసాద వినియోగం జరిగాయి. సామూహిక లలితా సహస్రనామ పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందని పీఠం నిర్వాహకులు నెమలికంఠి హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయింత్రం 6గంటలకు కుంకుమార్చన, రా 7గంటకు లకు తీర్థ ప్రసాద వినియోగం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో రొంపిచర్ల మణికంఠ, ప్రశాంత్, కృష్ణ గౌడ్, వక్కలగడ్డ బాలాజీ, కృష్ణసాయి మరియు భక్తులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుకగా డీఏ ప్రకటించాలి: ఎస్టీయు




బాపట్ల, సెప్టెంబర్28, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు దసరా కానుకగా కరువు భత్యం(డిఏ) ప్రకటించాలని ఎస్‌టీయూ బాపట్ల జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక బాపట్ల జిల్లా ఎస్‌టియూ కార్యాలయంలో అదివారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న శ్రీనిరావు మాట్లాడుతూ 2024 నుండి ఇప్పటివరకు 4 డి ఏ లు పెండింగ్లో ఉన్నాయని, పిఆర్సి బకాయిలు, డిఏ, సరెండర్ లీవ్ బకాయిలు, పిఎఫ్ ఎపిజిఎల్ఐసి లోన్లు మెడికల్ రియాంబర్స్మెంట్ బిల్స్ బకాయిలు దాదాపు రూ, 25 వేల కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని ఆ బకాయిల విడుదలకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల చివరి రోజు ప్రస్తుత మరియు మాజీ ఎమ్మెల్యేలకు పింఛను మరియు వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని అసెంబ్లీ కమిటీ సిఫార్సు చేసిందని మరి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం కల్పించమంటే, వైద్య సదుపాయాలు కల్పించమంటే మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి బాగాలేదని కుంటి సాకులు చెబుతుందన్నారు. డి ఎస్ సి నియామకాల ద్వారా కొత్త ఉపాధ్యాయులు పాఠశాలలకు వస్తున్నందున ఎం టి ఎస్ ఉపాధ్యాయులను ఏకోపాధ్యాయ పాఠశాలలకు సర్దుబాటు చేయాలన్నారు. ఉపాధ్యాయువాణి కన్వీనర్ పీవీ నాగరాజు మాట్లాడుతూ 12వ పి ఆర్ సి కమిషనర్ నియామకం ఆలస్యం అవుతున్నందున తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నూర్ భాషా సుభాని మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు టెట్ పరీక్ష ఉత్తీర్ణత కావాలనే నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం న్యాయ నిపుణులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ప్రధాన కార్యదర్శి గుడివాడ అమరనాథ్ సంయుక్తంగా ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్ బి. ఉదయశంకర్, సిహెచ్ నరసింహారావు, గవిని శ్రీనివాస్, పి. శివాంజనేయులు, ఏ వి నారాయణ, తోట శివయ్య, కోటేశ్వరరావు, నారాయణమూర్తి , ప్రభాకర్, తదితరుల పాల్గొన్నారు.

## 'రాబీస్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలి'




బాపట్ల, సెప్టెంబర్28, ప్రభాతవార్త: రాబీస్‌వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయసంచలకులు డాక్టర్ వూరిబిండి శ్రీనివాస్ తెలిపారు. బాపట్ల ప్రాంతీయ పశువైద్యశాల లో వరల్డ్ రాబీస్ డే కార్యక్రమాన్ని అదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పశువైద్యశాల సహాయసంచలకులు డా వూరిబిండిశ్రీనివాస్ మాట్లాడుతూ రాబీస్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రతిఒక్కరూ తమ తమ కుక్కలకు విధిగా యాంటి రాబీస్ టీకా వేయించాలన్నారు. ప్రతియేటా సుమారు 6000 మరణాలు రాబీస్ వ్యాధి కారణంగా సంభవిస్తున్నాయన్నారు. ఇందులో ఎక్కువగా15నుంచి 20 సంవత్సరాల వయసున్న యువతి, యువకులు ఉన్నట్లు ఆయన తెలిపారు..ఈ మరణాలు అన్ని కూడా కేవలము ఈ వ్యాధి పట్ల అవగాహన లేకపోవడం వల్ల సంభవిస్తున్నాయని, దీనికి కారణం మనదేశంలో వీదికుక్కల సంఖ్య అధికం గా ఉండం కూడా కారణం అని తెలిపారు, రాబోయే 2030 సంవత్సరానికి రాబీస్ రహిత దేశం గా మార్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డా బి వేణుగోపాల్ మాట్లాడుతూ రాబీస్ వ్యాధి జంతువుల నుంచి మనుషలకు కాటు కారణంగా వ్యాప్తి చెందుతుంది కాబట్టి, టీకాల ద్వారా అరికట్టడం ఒకటి, రెండవది కరిచిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు..ఈ కార్యక్రమంలో సుమారు 40 కుక్కలకు టీకాలు వేసి జంతు ప్రేముకులకు ఆవాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు జంతు ప్రేమికులు, పశుపోషకులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలకృష్ణ వ్యాఖ్యలపై కాపు నేతల నిరసన



తెనాలి టౌన్, సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త): ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో, ప్రముఖ సినీ నటుడు చిరంజీవిపై హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను పట్టణ కాపు సంఘ నాయకులు తీవ్రంగా ఖండించారు. బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై, అభ్యంతరం వ్యక్తం చేస్తూ, పట్టణంలోని రామలింగేశ్వరం పేటలోని డిపోరోడ్డు చౌరస్తా వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన శాసనసభలో ఇటువంటి వ్యాఖ్యలు బాధాకరమన్నారు. వాస్తవాలను వక్రీకరించి మాట్లాడటం బాలకృష్ణకు తగదన్నారు. సినీ పరిశ్రమకు పెద్దగా, సినీ కార్మికులకు అండగా, వారికిఏసమస్య వచ్చినా అండగా నిలబడి, ప్రభుత్వంతో ఒక బాధ్యతగా చర్చించి, పరిశ్రమకు అండగా నిలబడే వ్యక్తి చిరంజీవి అని, చిరంజీవిపై వ్యంగ్యంగా, అగరవంగా మాట్లాడిన, బాలకృష్ణ ఇప్పటికైనా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు కాపు నాయకులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

## సాక్షాత్తూ మునిసిపల్ ఛైర్మన్ వార్డులో ఆవుల స్వైరవిహారం



తెనాలి మున్సిపాలిటీ సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త): పట్టణంలోని ప్రధాన రహదారులు మరియు పలు వీధుల్లో ఆవులు స్వైర విహారం చేయడంతో, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఈ సమస్యపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సాక్షాత్తు మున్సిపల్ ఛైర్మన్ ప్రాతినిధ్యం వహిస్తున్న 8వ వార్డులోని హిందీ ప్రేమీమండలి రోడ్డు, మహాలక్ష్మి మ్మ చెట్టు పరిధిలోను, అలాగే ఇస్కాన్ టెంపుల్ వీధిలోను రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తు, ఆవులు దాడి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ మార్గంలో తిరుపతమ్మ తల్లి దేవాలయం మరియు అరవింద విద్యా కేంద్రం పాఠశాల ఉండటంతో పిల్లలు పెద్దలు రోడ్లపై వెళ్లాలంటే భయపడే విధంగా ఆవుల సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేదని, కావున ప్రజాప్రతినిధులు, ఆవులు సంచారంపై తగిన పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## మాజీ ఎంపీటీసీ కాట్రగడ్డ రామారావు మృతికి సంతాపం



కొల్లూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త : మండలంలోని తడికలపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ మెంబర్ కాట్రగడ్డ రామారావు (80)ఆదివారం ఉదయం మృతి చెందగా వారి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి వారి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సంతాపం తెలిపిన వారిలో కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు సుంకర శ్రీనివాసరావు, వేములపల్లి మోహన్‌కృష్ణ, ముమ్మనేని నారయ్య, ముమ్మనేని మురళి, పెదపూడి నాగరాజు, మరియు కొల్లూరు మండల తడికలపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.

## కృష్ణానది ముంపు పరివాహిక లంక గ్రామాల్లో కలెక్టర్ వినోద్‌కుమార్ పర్యటన



కొల్లూరు, సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త) : ప్రకాశం బ్యారేజీ నుండి కృష్ణానదిలోకి 6లక్షల46వేలు క్యూసెక్కులు నీరు కృష్ణానదిలోకి వదలడంతో నీరు లోతట్టు ప్రాంతాలను చుట్టు ముట్టినది. దీని దృష్టిలో ఉంచుకుని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ నది పరివాహక ముంపు ప్రాంతాలైన లోకలవానిపాలెం, పోతార్లంక, కిష్కిందపాలెం, లంక గ్రామాల్లో ఆదివారం పర్యటించి ఆ గ్రామాల్లో సర్పంచులతోనూ ప్రజలతోనూ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతి పెరిగితే గ్రామాల ప్రజలు అధికారులతోనూ సర్పంచులతో సహకరించి పునరావాస కేంద్రాలకి తరలి వెళ్ళాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎవరు ఆందోళన చెందాల్సిన పని లేదని అధికార యంత్రాంగం సిద్దంగా ఉందని, ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందం కూడా వచ్చి ఉన్నదని ఎలాంటి విపత్తు పరిస్థితినైనా ఎదుర్కోవడానికి అధికార యంత్రం సిద్దంగా ఉందని ఆయన తెలిపారు. మండల పరిధి కొల్లూరులో పునరావాస కేంద్రాలను కూడా సిద్దంగా ఉంచుమని కరకట్ట ఎక్కడ ఎక్కడ బలహీనముగా ఉన్నదో గుర్తించి అక్కడ తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మీ, కొల్లూరు మండల తహాశీల్దార్ బి.వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అరవింద వారధిపై వరద నీరు పరిశీలన



కొల్లూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త : కొల్లూరు మండల పరిధిలోని అరవింద వద్ద వరద నీరు ప్రవహిస్తున్న ప్రవాహాన్ని ఆదివారం పరిశీలిస్తున్న రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్, సంగం డైరీ డైరెక్టర్ గుత్తికొండ జ్ఞానానంద భగవాన్, కోగంటి వెంకటేశ్వరరావు, దూళిపూడి కృష్ణ, మండల పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## పెదనందిపాడు లలిత త్రిపుర సుందరి అమ్మవారికి మణిద్వీప వర్ణన



పెదనందిపాడు. సెప్టెంబర్ 28, ప్రభాతవార్త: పెదనందిపాడు శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారికి లలిత లక్ష్మీ సరస్వతి అమ్మవార్ల అలంకరణ కన్నుల పండుగ నిర్వహించారు. 308 మంది మహిళలచే 9సార్లు మణిద్వీప వర్ణన. మహిషాసుర మర్దని స్తోత్రం. అమ్మవారికి స్పెషల్ హారతులు అద్భుతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తడవర్తి సురేష్ బాబు. కూని శెట్టి సుబ్రహ్మణ్యం. నున్న ఆంజనేయ గుప్తా. పొత్తూరి నాగేశ్వర స్వామి. శ్రీరామ్ నాగేశ్వరరావు. లావు రాజశేఖర్. అర్జున్ రావు. పాల్గొనగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అత్తోటలో వైభవంగా దసరా ఉత్సవాలు

కొల్లిపర, సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త) : దసరా ఉత్సవాలు మండల పరిధిలోని అత్తోటలో వైభవంగా జరుగుతున్నాయి. 7వ రోజు అయిన ఆదివారం శివాలయంలో ఉన్న అమ్మ వారిని శ్రీమహాచండీదేవిగా అలంకరిం చడంతో మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేసి తమ భక్తి భావనను చాటుకున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శివాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ప్రత్యేక పూజలు చేశారు.



పండితులు వివిధ రూపాల్లో అలంకరించడంతో భక్తులు కూడా పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మనోహర్‌కు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దివ్వెల ఏడుకొండలు, బొల్లిముంత వెంకటేశ్వరరావు, కొఠారు ఆంజనేయులు, దాసరి నరసయ్య, విష్ణుమొలకల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కనులపండుగగా దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు





కొల్లిపర, సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త) : దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలోని పలు దేవాలయాల్లో కన్నుల పండుగగా జరుగుతున్నాయి. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి దేవాలయంలో శ్రీకాళికాదేవిగా, శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో శ్రీభద్రకాళిదేవిగా, ఆర్యవైశ్య కళ్యాణ మండలపంలో శ్రీమహాచండీ దేవిగా అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అంతే కాకుండా ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో చిన్నారులు వివిధ రూపాల వేషాధారణలతో దర్శనమిచ్చారు.



దీంతో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అదే విధంగా మండలంలోని వల్లభాపురం, కుంచవరం, మున్నంగి, పిడపర్రు, తూములూరు, దావులూరు, హనుమాన్‌పాలెం, అత్తోట, అన్నవరం, శివలూరు గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

## పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్టు చేసిన ఎస్సై



కొల్లూరు, సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త) : పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు కొల్లూరు ఎస్సై జానకి అమరవర్ధన్ తన సిబ్బందితో కలిసి కొల్లూరు మండల పరిధి తాడిగిరిపాడు గ్రామ శివారుకు వెళ్ళగా అక్కడ ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకోవడం జరిగింది. వారి దగ్గర నుండి 28వేల200లి డబ్బులు మరియు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం పరుచుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విజయదశమి ఉత్సవాలు

పొన్నూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో విజయదశమి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి నిత్యం అమ్మవారు వివిధ రకాల అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారికి ప్రతి నిత్యం అభిషేకాలు, హోమాలు, విశేషార్చనలు నిర్వహిస్తున్నారు. అర్చకస్వాములు ప్రతి నిత్యం అమ్మవారి అలంకరణకు సంబంధించిన విశేషాలను వివరిస్తున్నారు. గోత్రనామార్చన నిర్వహించారు. ఆదివారం మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులందరికీ తీర్థప్రసాద గోష్టి జరిగింది. ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ నేతృత్వంలో సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

## వస్త్రదానం గొప్పకార్యం: శ్రీ షిరిడీసాయి సేవా మండలి చైర్మన్ సర్రాజు

పొన్నూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త: అన్ని దానముల కన్న వస్త్రదానమే మిన్నయని శ్రీ షిరిడి సాయి సేవా మండలి చైర్మన్ సర్రాజు మధుసూదనరావు అన్నారు. స్థానిక సాయినగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఆదివారం బాబా 107వ పుణ్య తిథి ఉత్సవాల సందర్భంగా పేదలకు వస్త్రదానం చేశారు. చీరలు, దుప్పట్లు, లుంగీలు తదితరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్రాజు మాట్లాడుతూ ప్రతి ఏటా పుణ్యతిథి ఉత్సవాలను పురస్కరించుకొని దాతల సహాయంతో పేదలకు వస్త్రదానాలను చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి నిత్యం జరిగే పుణ్యతిథి ఉత్సవాలు, దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. చైర్మన్ మధుసూదనరావు నేతృత్వంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



## మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనం



పొన్నూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త: అత్యంత పురాతనమైన సాక్షి శ్రీ భావనారాయణస్వామి వారి దేవాలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు మహా చండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయం అర్చకస్వామి గురుమూర్తి అందుకు సంబంధించిన ప్రత్యేక పూజాదికార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

## వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ధ్యేయం: ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త: వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామంలో శ్రీ అంకమ్మతల్లి కిసాన్ డ్రోన్ సిహెచ్‌సి గ్రూప్ సభ్యులు వడ్లమాని రంగారావు, గేరా వెంకట రెడ్డియ్య, పతేళ్ళ అంకమ్మరావు, జొన్నకూటి రమేష్‌బాబు, నాగరాజులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక



అందిపుచ్చుకొని యువరైతులు ముందుకు రావాలని కోరారు. నూతన సాంకేతిక వ్యవసాయయంత్రీకరణ ద్వారా రైతులకు సమయాన్ని, ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం చొరవ చూపుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.9.80లక్షలు విలువ చేసే వ్యవసాయ డ్రోన్ పొందేందుకు బ్యాంకు రుణ సదుపాయం పొంది రైతు వాటా చెల్లించవలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ ప్రోత్సాహం నిమిత్తం 80శాతం(దాదాపు) రూ.7.84లక్షలు(సబ్సిడీ)(గ్రూపు) సభ్యుల వాటా రూ.1.96లక్షలు, వ్యవసాయశాఖ నుండి సహకారం అందిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 800కు పైగా గ్రామస్థాయి కిసాన్ సమైక్యలను ఏర్పాటు చేసి రైతులకు డ్రోన్స్ అందించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రైతులు బృందాలుగా ఏర్పడి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, చలమశెట్టి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను సన్మానించడం పూర్వజన్మ సుకృతం

### -చేబ్రోలులో ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పొన్నూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త: మనం చదువుకున్న రోజులు గుర్తుకొస్తున్నాయి....నాడు ఎంతో కలిసిమెలిసి ఆటపాటలతో చదువుకున్నాం.....ఉపాధ్యాయులు మనల్ని ఎంతో ప్రయోజకులుగా తీర్చిదిద్దారు....నేడు మనం ఈ స్థితిలో ఉన్నామంటే ఆ ఉపాధ్యాయులే కారణం...వాళ్ళు నేర్పిన విద్యా బుద్ధులు, మానవత్వ విలువలు... తోటి వారికి సహాయపడే తత్వం మాకు గుర్తుంది.... అదేబాటలో పయనిస్తున్నాం... భవిష్యత్తులో పయని స్తూనే ఉంటాం.... అంటూ పూర్వ



విద్యార్థులు ఆదివారం చేబ్రోలులో కలిసి ఎంతో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1993-94సంవత్సరంలో తమకు చదువు చెప్పిన శ్రీ రాఘవేంద్ర ట్యుటోరియల్స్ అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. మండల కేంద్రమైన సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ గట్టుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సన్మానం నిర్వహించడం తమ జీవితంలో మరచిపోలేని మధురానుభూతి అని అభివర్ణించారు. మీరు ఎంత ఉన్నత స్థాయిలో ఉన్న తల్లిదండ్రులను మరువకూడదన్నారు. డైరెక్టర్ నజీర్‌చాంద్‌బాబు మాట్లాడుతూ మీ అందరి గ్రూపులో మమ్మల్ని ఉంచితే మాకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పరాశరం శ్రీనివాసమూర్తి, రాజు, శివరామకృష్ణ, పొట్టి శ్రీనివాసరావు, జల్ది నాగరాజుతోపాటు పూర్వ విద్యార్థులు అరుణ, రాజ్యలక్ష్మి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త: పట్టణంలోని వివిధ వార్డుల్లో ఇటీవల ఆరోగ్యంతో బాధపడుతున్న పలువురు టిడిపికి చెందిన వారిని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదివారం పరామర్శించారు. 26వ వార్డుకు చెందిన ఉల్లంగుంట వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యం కారణంగా చికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకొంటున్నారు. ఈ విషయం తెలుసుకొని ఆయన్ను పరామర్శించారు. ఇంకా పట్టణంలో పలు వార్డుల్లో టిడిపి సానుభూతిపరులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట దాసరి విజయ్‌కుమార్ తదితరులున్నారు.



## ఘనంగా భగత్‌సింగ్ జయంతి

పొన్నూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త: స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆదివారం విప్లవ వీరుడు భగత్‌సింగ్ జయంతి అత్యంత ఘనంగా నిర్వహించారు. భారతమాత దాస్య శృంఖలాలను చేధించిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ అని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. భగత్ సింగ్ 12ఏళ్ళకే భారతజాతీ విముక్తి కోసం కంకణం కట్టుకొని 14ఏళ్ళకే భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారన్నారు. అటువంటి మహనీయుని అడుగుజాడల్లో ప్రస్తుత యువత పయనించాలని కోరారు. స్వాతంత్ర్య సముపార్జనకు జరిగిన అనేక ఉద్యమాలలో భగత్‌సింగ్ పాల్గొని దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి పులిపాటి రాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ నజీమ్, బాబు, సాజిత్, తదితరులు పాల్గొన్నారు.



## మంగళగౌరీదేవిగా అమ్మవారి దర్శనం

పొన్నూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త: పట్టణంలోని తెలగపాలెంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు మంగళగౌరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకరణను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అర్చకస్వామి చిలకపాటి లక్ష్మణ్‌రామాచార్యులు పూజాధికార్యక్రమాలను నిర్వహించారు. భక్తులందరికీ తీర్థప్రసాద వినియోగం జరిగింది. దేవాలయం శాశ్విత ధర్మకర్త ఆకుల వెంకటేశ్వరరావు, దేవాలయం కమిటి అధ్యక్షుడు అల్లం సాంబశివరావు పర్యవేక్షణలో కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు.




## శలపాడులో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త: చేబ్రోలు మండల పరిధిలోని శలపాడు భవాని మణికంఠ కమిటి ఆధ్వర్యంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కమిటి ఆధ్వర్యంలో గత మూడేళ్ళుగా ఇక్కడ అమ్మవారికి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. ఈ అమ్మవారిని దర్శించుకున్న నరేంద్రకుమార్ ఈ ఏడాది పంటలు పుష్కలంగా పండి ప్రతి ఒక్కరి ఇంటిలో ఆనందం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్ధించారు. అనంతరం గ్రామస్తులందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## వీరాంజనేయునికి స్వామినాయుడు ప్రత్యేక పూజలు

పొన్నూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త: స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామివారిని ఆదివారం అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు రవణం స్వామినాయుడు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్నటువంటి సహస్రలింగాలను, స్వర్ణ వెంకటేశ్వరస్వామి వారిని, దశావతారాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకస్వాములు పూజాధికార్యక్రమాలను



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు, యరసాని నాగభూషణం, వల్లంశెట్టి శ్రీధర్, షేక్ కరీముల్లా, సూదా వసంత్, వి.చంద్రమోహన్, పత్తి సురేష్, పత్తి శ్రీకాంత్, వేముల నారాయణ, ఎలవర్తి ఫణి, కె.నాంచారయ్య, విన్నకోట సురేష్, మాదాసు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## దేశప్రజల గుండెల్లో చిరంజీవి భగత్‌సింగ్

గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త : భరతమాత విముక్తి కోసం కేవలం 23సంవత్సరాల వయస్సులోనే నవ్వుతూ ఉరికొయ్యను ముద్దాడిన భగత్‌సింగ్ దేశప్రజల గుండెల్లో చిరంజీవిగా నిలిచారని, భావితరాలకు దిక్సూచిగా కొనసాగుతున్నారని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు నివాళులర్పించారు. స్థానిక కొత్తపేట కూడలిలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పించిన సంస్థ సభ్యులు అనంతరం అవగాహన సంస్థ కార్యాలయంలో సభ నిర్వహించారు. కార్యక్రమానికి విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విద్యావేత్త చంద్రయ్య మాట్లాడుతూ భగత్‌సింగ్ జ్వలించే నిప్పుకణిక, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలిట సింహస్వప్నంగా నిలిచారన్నారు. ప్రముఖయోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ భగత్‌సింగ్ ఒక వ్యక్తికాదు, అతనొక మహావిప్లవ శక్తి, ఒకసిద్ధాంతానికి ఒకమార్గానికి త్యాగధనుల వారసత్వానికి అతను ప్రతీక గా నిలిచాడన్నారు. కార్యక్రమాన్ని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పర్యవేక్షించారు. సంస్థ సభ్యులు ముప్పాళ్ళ ప్రసాదరావు, జనార్ధనరావు, పీటర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కుమార్తెల దినోత్సవం

తాడేపల్లి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ కుమార్తెల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వర్సిటీలోని పలువురి అధ్యాపకుల కుమార్తెలు సందడి చేశారు. ఈ సందర్భంగా కెఎల్ మహిళ్యా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య మాట్లాడుతూ ఆడపల్లి లేనిదే సృష్టిలేదన్నారు. తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడంలో కూతుర్లదే పైచేయి అన్నారు. ఆడ, మగా తేడా లేకుండా టెక్నాలజీలో దూసుకుపోతు్న ఈ రోజుల్లో ఆడపిల్లలు లేని





లోటు ఎవరూ తీర్చలేనిదన్నారు. తల్లిదండ్రుల గర్వపడేలా విజయాలు సాధిస్తూ, తమ కుటుంబాలను పోషించడమే కాకుండా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు అమ్మలాగా సేవలు చేస్తున్నారన్నారు. పెండ్లి తర్వాత మరో ఇంటికి దేవతగా వెళుతుందని అయినా కన్నవారి మీద ప్రేమ ఏమాత్రం తగ్గదన్నారు. తల్లిదండ్రుల ఆలనా పాలన చూడడంలో కొడుకులతో పోలిస్తే కూతుర్లదే పైచేయి అన్నారు. అందుకే సమాజంలో ఆడపల్లి పాత్ర చాలా గొప్పదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ విసి డాక్టర్ పార్థసారధి వర్మ, ఆచార్య విసి డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కే.రూత్ రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 'నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా'



పెదనందిపాడు, సెప్టెంబర్ 28. ప్రభాతవార్త: నాటి సమాజంలోని కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా తన రచనల ద్వారా ప్రజలలో చైతన్యాన్ని కల్పించిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువాఅని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు పేర్కొన్నారు. పద్మభూషణ్, కవి కోకిల, కళా ప్రపూర్ణ, కవితా విశారద, కవి దిగ్గజ గుర్రం జాషువా 130 వ జయంతి సందర్భంగా ఆదివారం పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో, గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగానిర్వహించారు. గ్రంథాలయ నిర్వాహకులు డి.శివ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహనరావు మాట్లాడుతూ సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం ఆయన తన రచన ద్వారా ఎంతగానో కృషి చేశారని తెలిపారు. వార్డు సభ్యుడు వెలినేని శివయ్య, కొలగాని మంజుల, విజయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దేవీశరన్నవరాత్రుల సందర్భంగా కీర్తనాలాపన

గుంటూరు కల్చరల్, సెప్టెంబర్28, ప్రభాతవార్త: స్థానిక డొంక రోడ్డు బృందావన క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రముఖ శాస్త్రీయ సంగీత గాయకులు ఆర్ పి ఎల్ నరసింహారావు.. పలుకు తేనెల తల్లి పవళించెను,, జయలక్ష్మి వర లక్ష్మి, జగజ్జనని సుఖపాణి కళ్యాణి, మొదలగు పలు కీర్తనలు , మధురంగా పాడి భక్తులని రంజింప చేశారు .కె. రామకృష్ణ మృదంగం, , పాలేటి గోవర్ధన్ రావు వయిలిన్ సహకారం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు కళాకారులను ఘనంగా సత్కరించారు



## మనం గడిపే ప్రతి క్షణం విలువైనదే: కోనేరు హంపి

పొన్నూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త: చెస్ ఆటలో మనం గడిపే ప్రతి క్షణం విలువైనదేనని ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోనేరు హంపి అన్నారు. ఆలిండియా చెస్ పెడరేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న 62వ నేషనల్ చెస్ ఛాంపియన్ పోటీలు ప్రారంభం సందర్భంగా ఆమె మాట్లాడారు. చెస్ క్రీడాకారులందరికీ ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఒక గొప్ప వేదికని తెలిపారు. దేశం నలుమూలల నుండి వచ్చే క్రీడాకారులతో ఆడే అవకాశం ద్వారా, అనుభవాన్ని పెంపొందించుకునే అవకాశం లభిస్తుందన్నారు. అయితే ఆటలో కొన్నిసార్లు ఆటంకాలు, విఫలాలు ఎదురైనా వాటిని అధిగమించే ధైర్యం చాలా ముఖ్యమన్నారు. కోచ్ చెప్పే సూచనలపై నమ్మకం ఉండాలన్నారు. ఆయన తప్పులు సరిచేసి సరైన మార్గంలో నడిపిస్తారని చెప్పారు. ఆటలోని ప్రతి అనుభవాన్ని పాఠంగా తీసుకొని ముందుకు సాగితేనే నిజమైన క్రీడాకారుడిగా ఎదగవచ్చన్నారు. ఆలిండియా చెస్ ఫెడరేషన్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ ఏకే వర్మ మాట్లాడుతూ చెస్ అనేది ఆలోచన, ఓర్పు, దృష్టి, మేధస్సుల కలయికని చెప్పారు. ఆటలో ప్రతి క్రీడాకారుడు తన ప్రతిభను నిరూపించుకోవడానికి, తన ప్రతిభను మరింత మెరుగుపరచుకోవడానికి ఇలాంటి వేదికలు అవసరమన్నారు. విజ్ఞాన్స్ వీసి ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ చెస్ బోర్డులో ఒక గేమ్ గెలవడానికి మనం మన ప్రణాళికలను అమలు చేయడంతోపాటు ప్రత్యర్థి ప్రణాళికను కూడా ముందుగానే అంచనా వేసి ఎదురో్కవాలన్నారు. అదే విజయానికి మూలమన్నారు. చెస్ ఎప్పుడూ చదరపు బోర్డు రూపంలోనే ఎందుకు ఉంటుంది? ఎందుకు దీన్ని దీర్ఘచతురస్రం రూపంలో ఆడకూడదు? అనేది కూడా ఒక ఆలోచనీయమైన ప్రశ్న అని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ వివిధ విభాగాధిపతులు, డీన్లు తదితరులు పాల్గొన్నారు.



## జగన్మాతకు భక్తుల నీరాజనాలు

గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 28, ప్రభాత వార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం పాలకమండలి ఆధ్వర్యంలో శ్రీపద్మావతి కళ్యాణమండపం వేదికగా అమ్మవారు గాయత్రీదేవీగా దర్శనమిచ్చారు. ఆలయ పాలకమండలి వారు విశేషంగా భక్తులు అమ్మవారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను అందుకున్నారు.



-బ్రాడీపేట శంకరమందిరంలో ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు కాళికాదేవిగా దర్శనమిచ్చారు. విశేషపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందించారు. సాయంత్రం కుంకుమార్చనలు జరిగాయి.



-వికాస్‌నగర్ 11వ లైన్‌లోని శ్రీషిర్డిసాయి మందిరంలో పాలకమండలి అధ్యక్షులు పూర్ణచంద్రరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అమ్మవారు స్కంద మాతగా దర్శనమిచ్చారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సువాసినులచే కుంకుమార్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు వితరణ చేస్తున్నారు. సిద్ధార్థ నగర్ శ్రీకనకమహాలక్ష్మీ మందిరంలో వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి ఆధ్వర్యంలో చండి అమ్మవారిగా అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, ప్రత్యేకంగా అలంకరణ చేశారు. లోకకల్యాణార్థం ప్రతిరోజు శక్తి హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

-అరండల్‌పేట శ్రీ అష్టలక్ష్మి సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారిని పుష్పశయ్యగా అలంకరించి పూజలు నిర్వహించారు. విశేషంగా పాల్గొన్న సువాసినులచే కుంకుమార్చనలు, సాయంత్రం దంపతులచే అమ్మవారి సహస్ర నామ పూజలు నిర్వహించారు. విశేష హారతీ మంత్రపుష్పం అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

## 'బలహీనమైన పరిస్థితుల్లోకి ప్రవేశిస్తున్న ప్రపంచ ఆర్థిక రంగం'

గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త : ప్రపంచ ఆర్థికరంగం బలహీనమైన పరిస్థితుల్లోకి ప్రవేశిస్తుందని ఒక పద్ధతి ప్రకారం విధ్వంసం జరుగుతుందని ప్రపంచ ఆర్థిక వేదిక తాజా నివేదిక వెల్లడించడం పట్ల అవగాహన సంస్థ ఆందోళన ప్రకటిస్తుంది. 72మందికి పైగా ఆర్థిక నిపుణులు వేసిన అంచనాను అన్ని దేశాల ప్రభుత్వాలు పరిగణనలోనికి తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాల్లో కూరుకుపోతున్నాయని ఆర్థిక రంగం బలహీనత పైన కేంద్ర ప్రభుత్వ ఆర్థిక నిపుణులు లోతుగా అధ్యాయనం చేయకుండా పేదరికం పూర్తిగా పరిష్కారమైందని అబద్దాలు చెబుతున్నారని ప్రభుత్వ ఆర్థిక రంగం దిగజారకుండా తగు చర్యలు తీసుకోవాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

29-9Pg5 MN 9_29-9Pg5.qxd 9/28/2025 11:27 PM Page 1



# బీహార్‌లో నితీశ్‌కు ఎదురుగాలి!

### ఈసారి మహాఘట్ బంధన్‌కు అవకాశం

### నిరుద్యోగం, శాంతిభద్రతలే ప్రధానాంశాలు

### ఎన్డీఏ సర్కార్‌పై పెరిగిన వ్యతిరేకత


### ఆర్జేడీకి ఒబిసి, ఇబిసిల మద్దతు

### కాంగ్రెస్‌కు ఓట్లు పెరిగే అవకాశం

### 105-114 సీట్లకే ఎన్డీఏ పరిమితం

### ఎంజీబీకి 118-126 స్థానాలు పక్కా

### లోక్ పాల్ ప్రి-పోల్ సర్వేలో వెల్లడి






**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 :** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ మొదటి వారంలో షెడ్యూల్ విడుదల కానుంది. ఇప్పటికే అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష మహాఘట్‌బంధన్‌లు ఎన్నికల ప్రచారాన్ని అనధికారికంగా ప్రారంభించాయి. పార్టీల మధ్య, నేతల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో బీహార్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ నేపథ్యంలో బీహార్ ప్రజలు ఏమనుకుంటున్నారు? అని 'లోక్ పోల్' అనే సంస్థ ప్రి-పోల్ సర్వే చేపట్టింది. మూడు వారాలపాటు రాష్ట్రమంతా కలియతిరిగి ఓటర్ల అభిప్రాయాలు సేకరించింది. ఆ సర్వే వివరాలను 'ఎక్స్' వేదికగా విడుదల చేసింది. ఈసారి ఎన్నికల్లో బీజేపీ- జేడీయూ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి 38-41శాతం ఓట్లతో 105 నుంచి 114 సీట్లు మాత్రమే వచ్చే అవకాశముంది. అలాగే ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమికి 39-42శాతం ఓట్లతో 118 నుంచి 126 స్థానాలు కైవసం చేసుకోనుంది. ఇతరులు, ఇందులో ప్రధానంగా ప్రశాంత్ కిశోర్ పార్టీకి 12 నుంచి 16శాతం వరకు ఓట్లు రావచ్చని, అయితే 2 నుంచి 5 సీట్లు మాత్రమే గెలవగలుగుతాయని సర్వే తేల్చింది. అసెంబ్లీలో 243 స్థానాలుండగా, 122 స్థానాలు సాధించిన పార్టీ లేదా కూటమి అధికారం చేజిక్కించుకోనుంది. అయితే, ఎన్నికలకు ముందు ఓటింగ్ జరిగే సమయానికి బట్టి అంచనాలు తారుమారు అయ్యే అవకాశముందని 'లోక్ పోల్' సంస్థ అభిప్రాయం వ్యక్తం చేసింది. బీహార్‌లో ఇటీవల కాలంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, వలసలు ఈసారి ఎన్నికల్లో ప్రధాన అంశాలు కానున్నాయి. నితీశ్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత పెరిగిందని సర్వేలో వెల్లడైంది. ఆరోగ్య సమస్యలు, అవినీతి, క్షీణిస్తున్న శాంతిభద్రతల ప్రభావం నితీశ్ పాలనపై పడిందని చెబుతోంది. గతంలో ఎన్డీఏకు వెన్నుదన్నుగా నిలిచిన ఓబీసీ, ఈబీసీలు ఈసారి ఆర్జేడీ- కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారు. కాంగ్రెస్ కులగణన సహాయంతో ఎస్సీలు, ఈబీసీల్లో ఉదా-చమర్, ముసాహర్, మల్లా తదితర కులాల్లో ఓటు బ్యాంకును గణనీయంగా పెంచుకునే అవకాశముంది. జేడీయూ బలమైన ఓటు బ్యాంకు కూడా ఈసారి ఆర్జేడీకి మద్దతివ్వనున్నారు. ముస్లింలు- యాదవుల ఏకీకరణ దేశాన్ని బలోపేతం చేస్తోందని ఆయా వర్గాల్లో నమ్మకం పెరుగుతోంది. దీంతో జేడీయూ ప్రభావం క్రమంగా తగ్గుతోందని పేర్కొంది. బీజేపీ ఓటు బ్యాంకుకు జాన్ సూరజ్ పార్టీ గండికొట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. బీజేపీకి బనియాల కులం మద్దతు ఉంది. అయితే, జాన్ సూరజ్ పార్టీ ఉన్నత కులాల ఓటర్లను లక్ష్యంగా చేసుకుంది. ఫలితంగా బీజేపీకి ఆయా కులాల నుంచి నెగిటివ్ ఫలితాలు వచ్చే అవకాశాలున్నట్లు కనిపిస్తోంది. మై బెహన్ మాన్ యోజన, ఉచిత విద్యుత్ వంటి పథకాల కారణంగా మహిళా ఓటర్లు మహాఘట్‌బంధన్ వైపు చూపుతున్నట్లు కనిపిస్తోంది. ఓట్ల దొంగతనం కూడా ప్రభావం చూపే అవకాశముంది. రాహుల్ గాంధీ ఇమేజ్ మెరుగుపడిందని, ఓటర్ల కోసం ఆయన చేసిన యాత్ర, ప్రజా సమస్యలపై దృష్టి సారించిన నాయకుడిగా ఇమేజ్ పెరుగుతున్నట్లు పేర్కొంది. ఉత్తర ప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలోని స్థానాలలో బీఎస్పీ ప్రభావం క్షీణించడంతో మహాఘట్ బంధన్‌కు అవకాశాలు పెరిగే అవకాశముంది.

## బీహార్ ఎన్నికలకు 470 మంది పరిశీలకులు!

**పాట్నా, సెప్టెంబరు 28:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు ముమ్మరంచేస్తోంది. ఈ క్రమంలో 470 మంది పరిశీలకులను నియమించింది. వీరిలో 320 మంది ఐఎఎస్‌లు కాగా 60 మంది ఐపిఎల్‌లతోపాటు మరో 90 మంది ఇతర ఉన్నతాధికారులున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు మరో ఏడు స్థానాల్లో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ రెడీ అవుతోంది. ఎన్నికల సమయంలో అవకతవకలకు తావులేకుండా చూడటం, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాత పోటీ వాతావరణం కల్పించాలని జనరల్, పోలీసులు ఖర్చుల పరిశీలకులను నియమిస్తున్నది.

అక్టోబరు తొలివారంలోనే బీహార్‌లో ఎన్నికల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించనున్న ఈసీ అంతకుముందురోజే పరిశీలకులకు దిశానిర్దేశం చేస్తోంది. మొత్తం 243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీ గడువు నవంబరు 22తో ముగియనుంది. ఇందుకోసం ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసేందుకుఈసీ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తిచేయగా ఇందుకు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు విచారణలో ఉంది.



## నటి సంజనకు సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** డ్రగ్స్ కేసులో సినీ నటి సంజనా గల్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నైజీరియన్ డ్రగ్ పెడ్లర్‌తో సంజనా సంబంధాలపై ఆరోపణలు, 2020నాటి డ్రగ్స్ కేసులో నటి సంజనా గల్రానీకి కర్ణాటక హైకోర్టు మార్చి 25, 2024 క్లీన్ చిట్ ఇస్తూ తీర్పునిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ కేసులో సుప్రీంకోర్టు తాజాగా నటి సంజనా గల్రానీతోపాటు మిగతా వారికి నోటీసులు జారీ చేసింది. డ్రగ్స్ పంపిణీ, విక్రయం ఆరోపణలతో సంజనా గల్రానీ గతంలో అరెస్టయ్యారు. ఈ కేసును విచారించిన కర్ణాటక హైకోర్టు.. ఆమెకు క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే, విచారణలో సంజనా ఫోన్ కాల్స్ డాటా, ఇతర వివరాలు, నగదు లావాదేవీలతో పాటు నైజీరియన్ డ్రగ్ పెడ్లర్‌తో ఆమెకున్న సంబంధాలను కర్ణాటక హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని ప్రభుత్వం ఆరోపించింది. ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ అమన్ పన్వర్ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. దీంతో నటి సంజనా సహా డ్రగ్స్ కేసులో గతంలో హైకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన వారికి జస్టిస్ సూర్యకాంత్, జాయ్‌మాల్య బాగ్చి సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

## బ్యూనస్ ఏరీస్‌లో ముగ్గురు యువతుల దారుణ హత్య

**బ్యూనస్ ఏరీస్, సెప్టెంబరు 28:** అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎరీస్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ముగ్గురు యువతులను చిత్రహింసలు పెట్టి హత్య చేయడమే కాకుండా, ఈ ఘోరకృత్యాన్ని సోషల్ మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ పాశవిక చర్యకు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. బాధిత కుటుంబసభ్యులతో కలిసి పార్లమెంట్ వరకు భారీర్యాలీ నిర్వహించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బ్యూనస్ ఏరీస్ శివారు ప్రాంతానికి చెందిన మోరెనా వెర్డి (20), బ్రెండా డెల్ కాస్టిల్లో (20), లారా గుటిమెర్రెజ్ (15) అనే ముగ్గురు అమ్మాయిలు ఈ నెల 19న అదృశ్యమయ్యారు. ఐదు రోజుల తర్వాత,ఒక ఇంటి పెరట్లో వారి మృతదేహాలను పోలీసులు పాతిపెట్టిన స్థితిలో కనుగొన్నారు. డ్రగ్స్ ముఠాతో ఉన్న విభేదాలే ఈ హత్యలకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పార్టీ పేరుతో యువతులను ఒక వ్యాన్‌లోకి ఎక్కించుకుని, ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా అదుపులోకి తీసుకున్న నిందితుల్లో ఒకరు హత్యను ఇన్‌స్టాగ్రామ్‌లోని ఒక ప్రైవేట్ అకౌంట్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసినట్లు వెల్లడించడం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. సుమారు 45మంది ఈ లైవ్‌ను చూసినట్లు అధికారులు తెలిపారు. నా దగ్గర డ్రగ్స్ దొంగిలిస్తే ఇలాగే జరుగుతుందని ఒక ముఠా నాయకుడు వీడియోలో హెచ్చరించినట్లు సమాచారం. నిందితులు బాధితుల వేళ్లను నరికి, గోళ్లను పీకి, తీవ్రంగా కొట్టి ఊపిరాడకుండా చేసి చంపారని



స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనపై స్పందించిన జాతీయ భద్రతా మంత్రి పాట్రిసియా బుల్రిచ్ మాట్లాడుతూ ఇప్పటివరకు ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలతో సహా ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. ఐదో నింది తుడిని బొలీవియా సరిహద్దు నగరమైన విల్లాజోన్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ హత్యలకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న 20 ఏళ్ల పెరూ దేశస్థుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మరోవైపు, ఈ లైవ్ స్ట్రీమింగ్ తమ ప్లాట్‌ఫామ్‌పై జరిగిందనడానికి ఎటువంటి ఆధారాలు లభించలేదని ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ మెటా ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దారుణమైననేరంపై దర్యాప్తు చేస్తున్న అధికారులకు తాముపూర్తిగా సహకరిస్తున్నామని మెటా ప్రతినిధి చెప్పారు.నిరసనలో పాల్గొన్న బాధితుల కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. జంతువులతో కూడా ఇంత క్రూరంగా ప్రవర్తించరు. మాకు న్యాయం జరగాలంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## సోనమ్ దిష్టిబొమ్మలు దగ్ధంచేయకుండా చర్యలు తీసుకోండి

### మధ్యప్రదేశ్ హైకోర్టు తక్షణ ఆదేశాలు

**భోపాల్,సెప్టెంబరు 28:** మేఘాలయలో హనీమూన్ సందర్భంగా కొత్తగా పెళ్లైన భర్తను హత్య చేసిన నిందితురాలు సోనమ్ రఘువంశీ దిష్టిబొమ్మను దసరా రోజున దహనం చేయడాన్ని మధ్యప్రదేశ్ హైకోర్టు నిషేధించింది. నిందితురాలు లేదా ఇతర వ్యక్తుల దిష్టిబొమ్మలను దహనం చేయకుండా చూడాలని అధికారులను ఆదేశించింది. ఇండోర్‌కు చెందిన వ్యాపారవేత్త రాజా రఘువంశీకి సోనమ్‌తో పెళ్లి జరిగింది. అనంతరం కొత్త జంట హనీమూన్ కోసం మేఘాలయ వెళ్లారు. అక్కడ ప్రియుడితో కలిసి భర్తను సోనమ్ హత్య చేసింది. ఈ కేసుపై దర్యాప్తు చేసిన పోలీసులు సోనమ్, ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహా, ఇతర నిందితులను అరెస్ట్ చేశారు. దసరా రోజున 'సుర్పణక దహనం' కోసం 11 తలల దిష్టిబొమ్మను సిద్ధం చేస్తున్నట్లు ఇండోర్‌కు చెందిన సామాజిక సంస్థ 'పౌరుష్' తెలిపింది. సోనమ్‌తో పాటు భర్తలు, పిల్లలు, అత్తమామలను దారుణంగా హత్య చేసిన నిందితులైన మహిళల చిత్రాలు ఉంటాయని పేర్కొంది. మరోవైపు సోనమ్ తల్లి సంగీత ఆ సంస్థకు వ్యతిరేకంగా మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ ప్రణయ్ వర్మతో కూడిన సింగిల్ బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. అలాంటి దిష్టిబొమ్మ దహనానికి అనుమతి లేదని శనివారం తీర్పునిచ్చింది. పిటిషనర్, ఆమె కుమార్తె, కుటుంబం ప్రాథమిక హక్కులను ఇది ఉల్లంఘిస్తుందని పేర్కొంది. కాగా, 'భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి చర్య ఆమోదయోగ్యం కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 కింద హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించలేరు' అని కోర్టు స్పష్టం చేసింది. అలాంటి దిష్టిబొమ్మ దహనం జరగకుండా చూడాలని, మహిళా నిందితులు, వారి కుటుంబాల ప్రతిష్టను దెబ్బతీసే చట్టవిరుద్ధమైన లేదా రాజ్యాంగ విరుద్ధమైన చర్యలను నిరోధించాలని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్లను హైకోర్టు ఆదేశించింది.



## ప్రపంచ దేశాల్లో 80% సమస్యలన్నీ వృద్ధనేతల వల్లనే..

### అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా



**శ్రీనగర్, సెప్టెంబరు 28:** ప్రపంచదేశాల్లో 80శాతం మంది వృద్ధ నేతలు అధికారం పట్టుకుని వేలాడుతుండటంవల్లనే సమస్యలు పెరుగుతున్నాయని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా అన్నారు. పిరమిడ్లతో సహ ప్రతిదానిపైనా తమ పేర్లను చెక్కడం వంటివాటివల్ల సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. 77 ఏళ్లవయసులో అగ్రరాజ్యానికి అధ్యక్షుడుగా ఉన్న ట్రంప్‌ను ఉద్దేశించే ఆయన ఈ వ్యాఖ్యలు చేసారని అంతా అనుమానిస్తున్నారు. లండన్‌లో జరిగిన ఒక ఈవెంట్‌లో ఒబామా మాట్లాడుతూ ప్రపంచ సమస్యల్లో 80శాతం మరణానికి భయపడే వృద్ధులు అధికారాన్ని పట్టుకుని వేలాడుతుండటంవల్లనేనని చెప్పడం సముచితం. వారు ఏదీ వదులుకోరు. వారు పిరమిడ్‌లను నిర్మిస్తారు. ప్రతిదానిపైనా తమ పేర్లను చెక్కించుకుంటారని అన్నారు. బ్రిటిష్ చరిత్రకారుడు డేవిడ్ ఒలుసొగాతో జరిగిన ముఖాముఖిలో ఈవ్యాఖ్యలు చేసారు. 2017నుంచి 2018 వరకూ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న బరాక్ ఒబామా 2019లో కూడా సాధారణంగా వృద్ధులు ముఖ్యంగా బాగా ముదిమి వయసు బారిన పడినవాళ్లు అధికారం అనే మార్గంనుంచి బయటకు రారని అన్నారు. పారాసిటమాల్ వాడితే గర్భస్థశిశువుల్లో ఆటిజం పెరుగుతుందన్న ట్రంప్ వ్యాఖ్యలపైనా ఒబామా విమర్శించారు. ట్రంప్ వ్యాఖ్యలు సత్యదూరమని ఒబామా కొట్టిపారేసారు.

## సెక్యూరిటీ దళాల దాడుల్లో 17 మంది పాక్ తాలిబన్‌లు మృతి




**ఇస్లామాబాద్, సెప్టెంబరు 28:** పాకిస్తాన్ వాయవ్యప్రాంతంలో ఆదేశ భద్రతా దళాలు జరిపిన మెరుపుదాడుల్లో సుమారు 17 మంది పాకిస్తానీ తాలిబన్ యోధులు మృతిచెందారు. ఖైబర్ ఫఖ్తూన్‌క్వా ప్రావిన్స్‌లోని కరక్ ప్రాంతంలో ఈ దాడులు జరిపారు. ప్రాంతీయ పోలీస్ చీఫ్ షెహబాజ్ ఇలాహి వివరాలప్రకారం ఈ దాడుల్లో ముగ్గురు పోలీస్ అధికారులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు ఇవ్వని చీఫ్ వీరిని ఖ్వార్జి అని మాత్రమే చెప్పారు. వీరంతా పాకిస్తాన్ తాలిబన్‌కు చెందినవారని తెలిపారు. ఇటీవలి కాలంలో టిటిపై ఆకస్మికదాడులు, ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వాయవ్య ప్రాంతంలోనే డేరా ఇస్మాయిల్‌ఖాన్ జిల్లాలో 13 మంది టిటిపి ఫైటర్లు చనిపోయారు. ఇటీవలికాలంలో పాకిస్తాన్‌లో మిలిటెంట్ హింసపెరిగిపోయింది. వేర్పాటువాదుల దాడులు ఎక్కువయ్యాయి. పాకిస్తానీ తాలిబన్ కూడా ఈ దాడులు నిర్వహించింది. ఈ సంస్థనే తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్తాన్ లేదా టిటిపి అని కూడా పిలుస్తారు. అఫ్ఘన్ తాలిబన్లతో సంబంధాలు ఎక్కువ ఉన్న టిటిపి పాక్ ప్రభుత్వ దళాలపై మెరుపుదాడులు చేస్తోంది. 2021లో ఆఫ్ఘన్ తాలిబన్ అధికారం లోకి వచ్చినప్పటినుంచి టిటిపి మిలిటెంట్లు, కమాండర్లు ఆఫ్ఘనిస్తాన్‌లో ఆశ్రయం పొందుతున్నారు.

## ఆధార్ అప్‌డేట్‌కు ఇకపై రుసుముల బాదుడు

### కొత్తకార్డులు ఉచితమే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** ఆధార్ కార్డు సంబంధించిన వివిధ సర్వీసులకు ఇకపై అదనపు ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఆధార్ సేవల యూజర్ ఛార్జీలను పెంచుతూ యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఏఐడీఏఐ) ప్రకటించింది. అయితే, కొత్త ఆధార్ కార్డుల జారీ సర్వీసులు ఉచితంగానే అందిస్తామని తెలిపింది. కానీ, ఇప్పటికే జారీ చేసిన ఆధార్ కార్డుల్లో అడ్రస్ మార్చుకోవడం, నిర్ణీత వయసు వారు వేలి ముద్రలను అప్డేట్ చేయడం వంటి సేవలకు ఛార్జీలు విడతల వారీగా పెంచుతున్నట్లు తెలిపింది. మొదటి విడతలో పెంచిన ఛార్జీలు అక్టోబర్ 1 నుంచే అమలులోకి తీసుకొస్తున్నారు. 17 ఏళ్ల వయసు దాటిన వారు తమ ఆధార్ కార్డులో వేలి ముద్రలను అప్డేట్ చేసుకోవాలంటే ప్రస్తుతం ఈ సర్వీసులకు రూ.100 వసూలు చేస్తున్నారు.అయితే, దీనిని రూ.125కు పెంచారు. ఇక అడ్రస్ మార్చుకునేందుకు ప్రస్తుతం రూ.50 మేర వసూలు చేస్తుండగా ఈ ఛార్జీలను రూ.75కు పెంచుతున్నారు. అక్టోబర్ 1వ తేదీ నుంచే పెరిగిన ఛార్జీలు అమలులోకి వస్తాయని యూఐడీఏఐ పేర్కొంది. ఈ మేరకు యూఐడీఏఐ హెడ్ ఆఫీసులోని డిప్యూటీ డైరెక్టర్ హిమాన్షు దేశంలోని అన్ని యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయాలకు సమాచారం అందించారు. కొత్త ఆధార్ ఎన్‌రోల్మెంట్ ఉచితంగానే ఉంటుంది. చిన్న పిల్లలు 5 సంవత్సరాల నుంచి 7 ఏళ్ల మధ్య వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేయాల్సి ఉంటుంది. వారికి సైతం ఈ సేవలు ఉచితంగానే ఉంటాయి. అలాగే 15 ఏళ్ల నుంచి 17 ఏళ్ల వయసు వారికి సైతం ఎలాంటి ఛార్జీలు ఉండవు. 17 ఏళ్ల వయసు దాటిన వారికి కొత్త ఛార్జీలు వర్తిస్తాయి. రెండో విడతలో ఈ ఛార్జీలు రూ.100, రూ.125గా నిర్ణయించారు. ఇవి అక్టోబర్ 1, 2028 నుంచి అమలులోకి వస్తాయి. ఇక మూడో విడతలో సెప్టెంబర్ 30, 2031 నుంచి రూ.90 నుంచి రూ.150గా ఉంటాయని యూఐడీఏఐ తెలిపింది. మరోవైపు 2026, జూన్ 14వ తేదీ వరకు మై ఆధార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్లో ఆధార్ డాక్యుమెంట్ అప్డేట్ ఉచితంగా చేసుకోవచ్చని యూఐడీఏఐ తెలిపింది. ఆ తర్వాత ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఇక ఆఫ్‌లైన్ ద్వారా ఆధార్ నమోదు కేంద్రాల్లో అయితే ఇప్పుడు కూడా ఛార్జీలు కట్టాలి. అయితే, ఆధార్ కేంద్రాల్లో ఇప్పటికీ రూ.50, రూ.100 పాత ఛార్జీలనే ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది. కొత్త వాటిని అక్టోబర్ 1వ తేదీ తర్వాత ప్రదర్శించే అవకాశాలు ఉన్నాయి. పేరు మార్పు, చిరునామా మార్పు, ఫోన్ నంబర్ మార్పు, బయోమెట్రిక్ అప్డేట్ వంటి వాటికి కొత్త ఛార్జీలు వర్తిస్తాయి. చిన్న పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ కోసం యుఐడిఏఐ స్కూళ్లలోనే ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తోంది.






## భారత్ విషయాల్లో జోక్యం చేసుకోం

### రష్యా అధ్యక్షుడు పుతిన్

**న్యూయార్క్, సెప్టెంబరు 28:** ఈ యేడాది చివర్లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. తర్వాత భారత విలేకరులతో మాట్లాడారు. డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారని లవ్రోవ్ తెలిపారు. ఇరు దేశాల మధ్య విస్తృతమైన ద్వైపాక్షిక అజెండా ఉందన్నారు. వాణిజ్యం, సైనిక, సాంకేతికత, కృత్రిమ మేధ వంటి కీలక విషయాల్లో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య జరిగే సాధారణ దౌత్య చర్చల్లో భాగంగా ఈ యేడాదిలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాస్కోలో పర్యటించే అవకాశం ఉందని, తాను కూడా భారత్‌లో పర్యటిస్తానని తెలిపారు. వాణిజ్యం, ఇంధన సంబంధిత అంశాల్లో భారత్ చర్యల్లో తాము జోక్యం చేసుకోమని లవ్రోవ్ స్పష్టం చేశారు. వీటిపై స్వయంగా నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం ఆ దేశానికి ఉందన్నారు. చమురు వాణిజ్య విధానాలపై భారత వైఖరిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చమురు కొనుగోళ్లపై ఇంతకుముందు జైశంకర్ పేర్కొన్న విషయాలను లవ్రోవ్ మరోసారి ప్రస్తావించారు. అమెరికా తన చమురును అమ్మాలనుకుంటే.. దీనికి సంబంధించిన నిబంధనలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని జైశంకర్ పేర్కొన్నట్లు తెలిపారు. కానీ, యుఎస్‌తో కాకుండా రష్యా లేదా ఇతర దేశాలతో వాణిజ్యం కొనసాగించడం అనేది తమ సొంత విషయమని ఆయన తెలిపినట్లు వెల్లడించారు. దీనిని ఉదహరిస్తూ భారత్‌కు ఆత్మగౌరవం ఉందని లవ్రోవ్ వ్యాఖ్యానించారు.

## భారత్‌పై నోరుపారేసుకున్న అమెరికా మంత్రి లుట్నిక్

**వాషింగ్టన్, సెప్టెంబరు 28:** అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ మరోసారి భారత్‌పై నోరుపారేసుకున్నారు. అమెరికాతో వాణిజ్య భాగస్వాములైన భారత్, బ్రెజిల్ వంటి దేశాలు తమ గురించి మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వారు తమ మార్కెట్లను తెరిచి అమెరికా ప్రయోజనాలకు హానీ కలిగించే విధానాలను వెంటనే రద్దు చేసుకోవాలన్నారు. స్విట్జర్లాండ్, బ్రెజిల్, భారత్ వంటి దేశాలను అగ్రరాజ్యం మరింత సరిచేయాల్సిన అవసరం ఉందని ఓ ఇంటర్వ్యూలో ప్రేలాపనలు చేశారు. ఆయా దేశాలు తమతో ఆలోచించి మాట్లాడాలని అన్నారు. రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలుపెట్టాకే భారత్ రాయితీపై రష్యా నుంచి ముడిచమురు కొనుగోళ్లు పెంచిందని లుట్నిక్ ఆరోపించారు. ఇప్పటికైనా ఎవరివైపు ఉండాలనే విషయంపై మోడీ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. లుట్నిక్ గతంలోనూ ఇదే విధంగా భారత్‌పై నోరు పారేసుకున్నారు.



## ఇద్దరు వ్యక్తులపై కాంగ్రెస్ నాయకుడి దాడి



**భోపాల్, సెప్టెంబరు 28:** కాంగ్రెస్ నేత కుమారుడు ఇద్దరు వ్యక్తులపై దాడి చేయడంతోపాటు వారిని బెదిరించాడు. నగరంలోని సగం మంది తన పేరు వింటే భయపడతారని వారితో అన్నాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బాధిత వ్యక్తుల ఫిర్యాదుతో కాంగ్రెస్ నేత కుమారుడిపై కేసు నమోదైంది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 3న అనికేత్ బైరాగి తన బావమరిది నీరజ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, అసెంబ్లీ మాజీ స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతి కుమారుడు నీర్ ప్రజాపతి ఇంటికి వెళ్లి కలిశాడు. ఆయన మేనల్లుడు అమిత్ ప్రజాపతి, నీరజ్ మధ్య జరిగిన వివాదాన్ని ప్రస్తావించాడు. కాగా, వివాదాన్ని పరిష్కరించడానికి బదులు అనికేత్, నీరజ్‌ను నీర్ ప్రజాపతి దుర్భాషలాడాడు. వారిద్దరిని కొట్టాడు. 'భోపాల్‌లో సగం మంది తన పేరుకు భయపడతారు' అని బెదిరించాడు.

## సంక్షిప్తంగా..

### విద్యార్థినులను వేధించిన స్వామీజీ అరెస్టు



**ఆగ్రా, సెప్టెంబరు 28:** విద్యార్థినులపై లైంగిక వేధింపులు, కోట్ల రూపాయల ఆర్థిక మోసం వంటి తీవ్ర ఆరోపణలతో కొన్ని రోజులుగా పరారీలో ఉన్న వివాదాస్పద స్వామీజీ చైతన్యానంద సరస్వతిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన అధికారులు, ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో ఆగ్రాలోని ఓ హోటల్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని శ్రీ శారద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్‌కు డైరెక్టర్‌గా పనిచేసిన చైతన్యానంద (62) అసలు పేరు పార్థసారథి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) స్కాలర్‌షిప్‌పై చదువుకుంటున్న 17 మందికి పైగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడని, వారిని తాకుతూ వేధించాడని, అసభ్యకర సందేశాలు పంపాడని తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. అర్ధరాత్రి తన గదికి రావాలని విద్యార్థినులను బలవంతం చేసేవాడని, వారి కదలికలను ఫోన్ ద్వారా నిత్యం గమనించే వాడని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

### నార్త్‌కరోలినా రెస్టారెంట్‌లో కాల్పులు: ముగ్గురు మృతి

**నార్త్‌కరోలినా, సెప్టెంబరు 28:** అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. నార్త్ కరోలినాలో ఓ దుండగుడు వినూత్న రీతిలో రెస్టారెంట్‌పై దాడికి పాల్పడ్డాడు. బోటులో వచ్చి జనంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపిన ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. విల్మింగ్టన్‌కు సమీపంలోని సౌత్ పోర్ట్ యాట్ బేసిన్ ప్రాంతంలో ఉన్న 'అమెరికన్ ఫిష్ కంపెనీ' అనే రెస్టారెంట్‌లో శనివారం రాత్రి 9:30 గంటల సమయంలో ఈ దాడి జరిగింది. రెస్టారెంట్ సమీపంలోని నీటిలో ఒక బోటు వచ్చి ఆగింది. అందులో ఉన్న ఓ వ్యక్తి ఒక్కసారిగా రెస్టారెంట్‌లోని వారిపై తుపాకీతో కాల్పులు జరపడం ప్రారంభించాడు. అనంతరం అదే బోటులో వేగంగా పరారయ్యాడు. ఈ ఘటనలో మొత్తం ఏడుగురిపై బుల్లెట్లు దూసుకెళ్లినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



### సోషల్ నెట్‌వర్కింగ్‌లో నంబర్ వన్ 'అరట్టై'..



**చెన్నై,సెప్టెంబరు 28:** చెన్నైకి చెందిన జోహో కార్పొరేషన్ అభివృద్ధి చేసిన 'అరట్టై' యాప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. యాపిల్ యాప్ స్టోర్‌లో సోషల్ నెట్‌వర్కింగ్ విభాగంలో ఇది నంబర్ వన్ స్థానంలో నిలిచింది. 'అరట్టై' అంటే తమిళంలో "మాట్లాడటం" అని అర్థం. టెక్స్ట్ మెసేజ్‌లు,వాయిస్/ వీడియోకాల్స్, ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు పంపడం, స్టోరీస్, ఛానల్స్ క్రియేట్ చేయడం ఇలా వ్యక్తిగత మరియు వృత్తిపరమైన అవసరాలకు తగిన ఫీచర్లతో ఈ యాప్‌ను రూపొందించారు. దేశీయ ఉత్పత్తులు, సేవలను వినియోగించాలని ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ యాప్‌ను కేంద్రమంత్రులు ధర్మేంద్రప్రదాన్, అశ్వినీ వైష్ణవ్ ప్రోత్సహిస్తున్నారు. తాజాగా తాను జోహోకు మారుతున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. మైక్రోసాఫ్ట్ పవర్ పాయింట్ బదులుగా జోహోతోనే తాజా కేబినెట్ ప్రజెంటేషన్ తయారు చేసినట్లు ఆయన తెలిపారు.

### బాలికపై ఆరునెలలుగా అత్యాచారం: నిందితుడి అరెస్టు

**లక్నో,సెప్టెంబరు 28:** ఒక వ్యక్తి బాలికను కిడ్నాప్ చేశాడు. ఒకచోట నిర్బంధించి ఆరు నెలలుగా అత్యాచారానికి పాల్పడ్డాడు. చివరకు బాలికను నిర్బంధించిన ప్రాంతాన్ని పోలీసులు గుర్తించారు. ఆమెను రక్షించడంతోపాటు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఉత్తరప్రదేశ్‌లోని భదోహి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మోధ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక మార్చి 22న అదృశ్యమైంది. ఆమె తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులపాటు అన్ని చోట్ల వెతికారు. కాగా, 21 ఏళ్ల ఆశిష్ కుమార్ సరోజ్ ఆ యువతిని మభ్యపెట్టి లోబర్చుకుని కిడ్నాప్ చేసినట్లు దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు. ఆరు నెలల తర్వాత సెప్టెంబర్ 26న ప్రయాగ్‌రాజ్ జిల్లాలోని సంగం రైల్వే స్టేషన్ సమీపంలో ఆ బాలికను రక్షించారు. ఆశిష్ కుమార్ తనను నిర్బంధించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు ఆమె ఆరోపించింది. దీంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.



# దక్షిణ కొరియాలో మంత్రుల పర్యటన

- సుస్థిర నగరాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై అధ్యయనం
- నామి ఐలాండ్, చియాంగ్ గెచెవోన్ వాగు, హాన్ నదిని పరిశీలన
- ఏపీఈడీబీ ఆధ్వర్యంలో మంత్రుల బృందం మూడు రోజులపాటు పర్యటన



**రాజంపేట, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** అమరావతితో పాటు రాష్ట్రంలో సుస్థిర నగరాల అభివృద్ధి, రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి సంస్థ(ఏపీఈడీబీ) ఆధ్వర్యంలో మంత్రులు, అధికారులు దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 11.40 గంటలకు ఆ దేశ రాజధాని సియోల్ చేరుకున్నారు. ఆ తర్వాత దక్షిణ కొరియాలోని నామీ ఐ ల్యాండ్ సీఈవో మిన్ క్యోంగ్ వూతో మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు భేటీ అయ్యారు. దక్షిణ కొరియాలో సహజ సిద్ధమైన, సాంస్కృతిక, సాంప్రదాయక పర్యాటక ప్రదేశంగా ఉన్న నామీ ఐలాండ్ ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నది. సియోల్‌లో ఉన్న అతి పెద్ద పర్యాటక ప్రాంతం ఇదే కావడం విశేషం. ఇక్కడ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లతో ఏడాది పొడవునా సంగీత ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆర్థికంగానూ అభివృద్ధి సాధిస్తోంది. నామీ ద్వీపం అభివృద్ధి, పర్యాటకులను ఆకట్టుకునేందుకు తీసుకున్న చర్యలపై సీఈవోతో మంత్రి నారాయణ చర్చించారు. 4,60,000 చ.మీ. విస్తీర్ణంలో అందమైన చెట్లు, పూల మొక్కలతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న నామీ ద్వీపంలో అనుసరిస్తున్న విధానాలను అమరావతిని బ్లూ గ్రీన్ సిటీగా రూపుదిద్దడంలో పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి నారాయణ నిర్ణయించారు. మధ్యాహ్నం లంచ్ తర్వాత సియోల్‌లోని చియాంగ్‌గేచెఒన్ వాగును మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. 30 ఏళ్ల క్రితం పూర్తిగా మురుగునీటితో తీవ్ర కాలుష్యకారకంగా ఉండి ఆ తర్వాత అత్యంత పరిశుభ్రంగా మారిన చియాంగ్‌గేచెఒన్ వాగును పరిశీలించారు. 2003-2005 మధ్యకాలంలో సీయోల్ నగరంలో మెరుగైన వాతావరణం కల్పించడం కోసం "చియాంగ్‌గేచెఒన్" పునరుద్ధరణ ప్రాజెక్టును స్థానిక ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీయోల్ నగర వాతావరణాన్ని మెరుగుపరచడం కోసం చేసిన ప్రయత్నం ఫలించి నేడు అత్యంత ఆహ్లాదకరంగా చియాంగ్‌గేచెఒన్ వాగు పరిసర ప్రాంతాలు మారాయి. ముఖ్యంగా గతంలో అత్యంత మురికిగా, కాలుష్య కారకంగా ఉండే "చియాంగ్‌గేచెఒన్" వాగులోని నీరు.. నేడు పునరుద్ధరణ తర్వాత ఎంతో స్వచ్ఛంగా మారడం, గాలి నాణ్యత పెరగడం, శబ్ద కాలుష్యం తగ్గడం.. తద్వారా జీవవైవిధ్యం మెరుగుపడటం ఈ వాగు పునరుద్ధరణలో ప్రత్యేకత. ఏపీలో కాలుష్య కారకంగా మారిన నదులు, కాలువలు, వాగులు వంటి వాటిని పునరుద్ధరించే కోణంలో ఈ వాగును మంత్రులు, ఏపీ ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎం.టీ.కృష్ణబాబు, కన్నబాబు పరిశీలించారు. సాయంత్రం దక్షిణ కొరియాలో హన్ నదిని మంత్రులు పరిశీలించారు. దక్షిణ కొరియా రాజధాని సీయోల్ ను నగరం మధ్యలో ప్రవహించే హన్ నది.. నదీ పరిసర ప్రాంతాలను మంత్రులు పరిశీలించారు. సియోల్ అభివృద్ధిలో అంతర్భాగంగా నిలుస్తూ, నగరవాసులకు ఆహ్లాదకర వాతావరణ కల్పిస్తూ.. పర్యాటకులను ఆకర్షిస్తుండటం హన్ నది యొక్క ప్రత్యేకత. అమరావతి నిర్మాణంలో సైతం ఇటువంటి ఆహ్లాదకర వాతావరణం కల్పించే కోణంలో హన్ నది తీర ప్రాంతాలను మంత్రులు పరిశీలించారు. హాన్ నది పరివాహక ప్రాంతంలో అనేక పార్కులు, వంతెనలు, సైకిల్ మార్గాలు వంటి అభివృద్ధి నిర్మాణాలతో ఆధునిక రాజధానులకు సరికొత్త రూపంగా సియోల్ నిలుస్తుంది. కృష్ణానది తీరంలో అమరావతి రాజధాని నిర్మిస్తున్న క్రమంలో హన్ నది.. తరహాలో ఆధునిక రాజధాని నిర్మాణంలో కృష్ణ తీరంలో అభివృద్ధికి ఉన్న అవకాశాలపై మంత్రులు స్థానిక అధికారులతో చర్చించారు. రాత్రికి దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో భారత రాయబార కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ నిషికాంత్ సింగ్, షాలిని సింగ్ దంపతుల ఆహ్వానం మేరకు స్థానిక శరవణ భవన్‌లో మంత్రులు పి. నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు టి. కృష్ణబాబు, కాటమనేని భాస్కర్, కన్నబాబు తదితరులు హాజరయ్యారు.



## సమసమాజ స్థాపనే జాషువా ఆశయం

### గుర్రం జాషువా జయంతి సభలో పలువురు వక్తలు

**అనంతపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త బ్యూరో:** సమాజంలోని అసమానతలు రూపుమాపి సమసమాజం వైపుగా అడుగులు వేసే ఆశయంగా గుర్రం జాషువా సాహిత్యం సాగిందని వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో యస్.యస్.బి.యన్ కళాశాలలో ఆదివారం జరిగిన గుర్రం జాషువా జయంతి సభలో వక్త, సాహిత్య విమర్శకులు డా.కల్లూరి ఆనందరావు పేర్కొన్నారు. విశ్రాంత ఉపకులపతి, వేమన ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షతన సభ కొనసాగింది. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ.. సమాజ స్థితిగతులను పద్యం ద్వారా ఎలుగెత్తి ప్రజలను చైతన్యవంతం చేయడంలో జాషువా కృషి అనన్యమైనదని అన్నారు. మరో వక్త డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి.. వేమన జాషువాలను తులనాత్మకంగా విశ్లేషించారు. ఇరువురు కవులు తాము ఏ వర్గాలను విమర్శించారో ఆ వర్గాలు సైతం వీరి ప్రతిభను గుర్తించేలా చేసారని అన్నారు. సమాజ పురోగతికి వీరి సాహిత్యం చేదోడుగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పద్యగాయకులు వేంకటేశ్వర ప్రసాద్ జాషువా పద్యాలను గానం చేసారు. ఈ కార్యక్రమంలో ఆచార్య లక్ష్మీనారాయణ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఫౌండేషన్ సభ్యులు లోకన్న కృష్ణారెడ్డి, నాగాశేషారెడ్డి, కవులు సురేష్, రియాజ్ అహమ్మద్, జూటూరు షరీఫ్, మధురశ్రీ, వన్నప్ప, వీరభద్రప్ప, టి.వి రెడ్డి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు

## సమసమాజ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత గుర్రం జాషువా

- రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్



జాషువా జయంతి సభలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జున రావు రచించిన విశ్వనరుడు పుస్తకాన్ని ఆవిష్కరణ

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** కలాన్ని ఆయుధంగా వాడుకొని సమాజంలోని రుగ్మతలను రూపుమాపిన వ్యక్తి మహాకవి గుర్రం జాషువా అని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం విజయవాడ ఎన్టీఆర్ కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. నవయుగ కవి చక్రవర్తి జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం కోసం కృషి చేస్తున్న డా. కనకదుర్గ ప్రసాద్ రావు, డా. పాలపర్తి శ్రీధర్, మీసాల లక్ష్మణ, కె.గురువమ్మలకు కవికోకిల పద్మభూషణ్ గుర్రం జాషువా 2025 పేరిట ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు పురస్కారాలను మంత్రి ప్రదానం చేశారు. పొట్లూరి హరికృష్ణకు జాషువా ప్రతిభా పురస్కారాన్ని అందజేసారు. అంతకుముందు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జున రావు రచించిన విశ్వనరుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, ఎన్టీఆర్ కలెక్టర్ జి. లక్ష్మీశ, నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాంస్కృతిక శాఖ అధికారులు సుమన్, శ్రీనివాస్, ప్రముఖ రంగ స్థల, సినీ నటుడు మీసాల లక్ష్మణ్, నంది అవార్డు గ్రహీత డా. కనకదుర్గా ప్రసాద్ రావు, కత్తి గురువమ్మ, డా. శ్రీధర్, జానపద కళల అకాడమీ మాజీ చైర్మన్ పొట్లూరి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని తన పాండిత్యంతో పరవశింపజేసిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అన్నారు. భావితరాలకు మహాకవి గుర్రం జాషువా గొప్పతనాన్ని తెలపాల్సిన అవసరాన్ని వివరించారు. భావితరాలకు గుర్రం జాషువా భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జాషువాపై ఆలపించిన గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

## కురుబలను రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకుని వస్తాం



**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** కురుబలను రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, ఇతర నాయకులు ఆమెను కలిశారు. సామాజికంగా కురబలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కురుబలకు అధిక ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. కురుబల సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. బిసిల అభ్యున్నతికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు.కురబలకు అన్ని విధాలు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. కురబల నుంచి మంచి విద్యావంతులు అధికారులు, రాజకీయవేత్తలు. వైద్యులు, ఇంజినీర్లు తయారు కావాలన్నారు. అందుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మంత్రిని కలిసిన వారిలో కురుబ సంక్షేమ సంఘం నాయకులు బి ప్రసాద్, ఎం సదాశివ తదితరులు ఉన్నారు.



## మన్‌కీబాత్ ప్రతి భారతీయునికి ప్రేరణ

**అనంతపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురంలోని అలెగ్జాండర్ ఫంక్షన్ హాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రజలతో, నాయకులతో, కార్యకర్తలతో, కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడి, షహీద్ భగత్‌సింగ్ త్యాగస్ఫూర్తి, లతా మంగేష్కర్ గాన మాధుర్యం, గాంధీ జయంతి సందర్భంలో ఖాదీ ప్రోత్సాహం, మహిళా సాధికారత విజయాలు, సముద్రయానంలో యువ మహిళా సాహసాలు, స్వచ్ఛ భారత్ ఉద్యమం, అలాగే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సేవా భావం వంటి అంశాలను ప్రస్తావించారు. తరువాత మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. మోడి మన్‌కీ బాత్ ప్రతి భారతీయునికి ప్రేరణ. భగత్‌సింగ్ వంటి మహనీయుల త్యాగస్ఫూర్తి మనకు మార్గదర్శి. ఖాదీకి మద్దతు, మహిళా సాధికారత, యువత సాహసాలు, శుభ్రత ఇవన్నీ ఆచరణలో పెడితేనే దేశం శక్తివంతమవుతుంది. ప్రజలతో కలిసి ఈ కార్యక్రమాన్ని వీక్షించడం నాకు గర్వకారణం అని తెలిపారు.

## డీజెడ్‌బిఐ.కామ్ వెబ్‌సైట్ ప్రారంభం



ఆయుష్ వైద్యశాల కోసం రూపొందించిన డీజెడ్‌బిఐ.కామ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి సత్యకుమార్‌కు మెమెంటో అందజేస్తున్న అధికారులు

**అనంతపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త బ్యూరో:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయుష్ వైద్యశాల కోసం రూపొందించిన డీజెడ్‌బిఐ.కామ్ వెబ్‌సైట్‌ను రాష్ట్ర ఆరోగ్య, కుటుంభ సంక్షేమ శాఖ, ఆయుష్ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం స్థానిక గెస్ట్ హౌస్‌లో ప్రారంభించారు. డిజెడ్‌బిఐ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు అనే ఒక స్టార్ట్ అప్ కంపెనీ ఆయుష్ వైద్యులను ప్రపంచ నలుమూలల ఉన్న ఎవరైనా స్వస్థత, ఆయుష్ చికిత్సలను (ఆయుర్వేద, యోగ నాచురోపతి, యునాని, సిద్ద హోమియోపతి) కోరుకునే వారికోసం వైద్యులచే వైద్యసేవల కొరకు తయారు చేయబడిన ఒక ఆన్‌లైన్ వేదిక ద్వారా ఆయుష్ వైద్యులను, హాస్పిటల్స్‌ను క్లినిక్‌లను, వైద్య వృత్తిలో ఉన్న ఇతర నిపుణులను, ఫార్మసీలను, ల్యాబ్‌లను, స్వస్తియన్‌లను (ఆరోగ్యం పొందాలని కోరుకునే వారు) వీరందరినీ ఒక ఏకీకృత వేదిక ద్వారా అనుసంధించటం ద్వారా ఇంటివద్దకే వైద్యము, ఆన్‌లైన్ ద్వారా వైద్యులను సంప్రదించటం, వైద్యులు వీడియో కన్సల్టేషన్ ద్వారా స్వస్తియన్లకు (రోగులకు) చికిత్సలను అందుబాటులోకి తేవడం, అంతేకాక భారత్ దేశంలోని ఏమూలకైనా కొరియర్ ద్వారా నేరుగా మందులు పంపించే వెసలుబాటు ఇలాంటి అనేక సౌకర్యాలతో సంప్రాదాయ ఆయుష్ వైద్య వెబ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా డిఐజెడ్‌బిఐ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ దాకవరపు సురేష్ మాట్లాడుతూ.. తమ సంస్థ సభ్యులకు ఒక సంవత్సరం పాటు పూర్తిగా ఉచితంగా సాఫ్ట్‌వేర్ పరిష్కారాలను అందించటం ద్వారా సాంప్రదాయ ఆరోగ్య సంరక్షణ పద్ధతలను శక్తివంతం చేస్తామన్నారు. వైద్యులు సేవలందించే క్రమంలో తమ సాంకేతికత ద్వారా వారి శ్రమని తగ్గించి మెరుగైన వైద్యం అందించటానికి తోడ్పాటు అందిస్తామన్నారు. అంతరాలను తగ్గించడం, నమ్మకాన్ని పెంపొందించడం, సమగ్ర ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యం అని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో డిఐజడ్‌బిఐ హెల్త్ వెల్‌నెస్ హెడ్ డా.రజిత యాదవ్ వీరబోయిని కో ఫౌండర్, డిజబీఐ నతురయి హెల్త్ వెల్‌నెస్ హాస్పిటల్ బెంగళూరు, డాక్టర్ నాగేశ్వరరావు వీరబోయిని చైర్మన్ గోకుల్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ అనంతపురము, ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్ పాల్గొన్నారు.



దుకాణం దారునితో మాట్లాడుతున్న కలెక్టర్

## జిఎస్‌టి తగ్గింపు ధరలను అమలు చేయాలి

### శ్రీకాళహస్తిలో అంగడంగడికి వెళ్లి కలెక్టర్ పరిశీలన

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** ప్రతి షాపు నిర్వాహకులు తగ్గించిన జిఎస్‌టి మేరకు ధరలను ఖరారు చేసుకొని విక్రయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ సూచించారు. అయితే తమకు పాత ధరలతోనే సరకులు సరఫరా అవుతున్నాయని దుకాణం దారులు కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. శ్రీకాళహస్తిలో జిల్లా కలెక్టర్ నాలుగుమాడ వీధుల్లో దుకాణం దుకాణానికి వెళ్ళి నిర్వాహకులతో జిఎస్‌టికి సంబంధించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం జిఎస్‌టి తగ్గింపు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వరన్ జనాల్లోనూ, దుకాణం దారుల్లో అవగాహన కల్పించుటకు చొరవ చూపారు. ప్రతి గడపకు జిఎస్‌టి తగ్గింపు ఫలాలు ఆందేలా విస్తృత ప్రచారం చేసారు. ఈ సందర్భంగా దుకాణం దారులు కలెక్టర్ దృష్టికి తెచ్చిన సమస్యలపై స్పందిస్తూ వాటిని త్వరగా పరిష్కరిస్తామని కలెక్టర్ వెంకటేశ్వరన్ భరోసా ఇచ్చారు. తాము ఉత్పత్తి దారులతో చర్చిస్తున్నామని వివరించారు. కొత్త తగ్గిపు పన్నుతో ఎంఆర్‌పిలు వస్తాయని వివరించారు. కలెక్టర్ నాలుగుమాడ వీధుల్లోని ప్రతి అంగడి వద్దకు వెళ్ళ కొనుగోలుదారులు, అమ్మకం దారులతో మమేకమయ్యారు. బంగారు దుకాణాలు, బుక్‌స్టాల్స్ బేరివారి మండపం వద్ద ఉన్న సూపర్‌బజార్‌లో వస్తువులపై ఉన్న ధరలను అమ్మకం దారుడు అందిస్తున్న ధరలను పరిశీలించారు. సూపర్‌బజార్ యజమాని మహమ్మద్‌తో చర్చించారు. అలాగే బుక్‌స్టాల్ యజమాని ఆరవిందరెడ్డితో చర్చించారు. వారు జిఎస్‌టి తగ్గింపు ఇన్వాయిస్ రావటం లేదని బిల్లులు చూపారు. అయితే కొనుగోలు దారులు తమను నిలదీస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ వీటిని పరిష్కరించుటకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

### ప్రతిగడపకు ఫలాలు అందాలి

క్షేత్ర స్థాయిలో పరిశీలనలు, అవగాహన కల్పించిన కలెక్టర్ వెంకటేశ్వరన్ మీడియాతో మాట్లాడుతూ జిఎస్‌టి ఫలాలు ప్రతి గడపకు చేరాలన్నది ప్రభుత్వ లక్ష్యం అని వివరించారు. నిత్యావసర వస్తువులు, మెడికల్స్, ఎలక్ట్రానిక్స్ పరికరాలపై జిఎస్‌టి తగ్గింపు వచ్చిందని వీటిని ప్రతి వినియోగదారునికి అవగాహన కల్పించి ఆ ఫలాలను దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ అవగాహన ర్యాలీలో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, వాణిజ్య పన్నుల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



## కాత్యాయిని అలంకారంలో ముత్యాలమ్మ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పండగలు సంబరాల్ని నింపుతున్నాయి. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో అమ్మవారు జ్ఞాన ప్రసూనాంబ దేవిగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ఆదివారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జ్ఞాన ప్రసూనాంబ దేవిని కాళరాత్రి అలంకారం నిర్వహించారు. ఈ అలంకారం భక్తుల్ని ఇట్టే ఆకట్టుకునేటట్లు తీర్చిదిద్దారు. ముత్యాలమ్మగుడి వీధిలోని ముత్యాలమ్మ ఆలయంలోనూ, ఏడుగంగమ్మలు వెలసిన ఆలయాల్లో విశేష పూజలు చేశారు. కాగా దక్షిణ కాళిమాత ఆలయం, పానగల్‌లోని పొన్నాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాలకు విశేష అలంకారాలు నిర్వహించారు. శనివారం జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు, ముత్యాలమ్మ ఆలయం, ఏడుగంగమ్మల ఆలయం అమ్మవారి విగ్రహాలకు కాత్యాయిని అలంకారం నిర్వహించారు.

## కాణిపాకంలో గరుడసేవ

**కాణిపాకం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అను బంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి పెరిందేవి సయిత వరద రాజస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గరుడసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కలియుగ వైకుంఠం తిరుమలలో గరుడసేవ జరిగే సమయంలో శ్రీవరదరాజస్వామి ఆలయంలో స్వామివారికి గరుడ సేవను నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమానికి కాణిపాకంకు చెందిన యాదవ వంశస్థులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈ మేరకు ఆలయంలో పగలు స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి దూపదీప నైవేద్యాలను సమర్పించారు. ప్రత్యేక హోమాలను నిర్వహించారు. తిరిగి రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తన కిష్టమైన అలంకరించిన గరుడ వాహనంపై వుంచి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



## విజయలక్ష్మీ దేవిగా ఆదిలక్ష్మీ అమ్మవారు

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి పట్టమహిషి అయిన శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారికి నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు 7వ రోజైన ఆదివారం అమ్మవారికి శ్రీ విజయలక్ష్మీ దేవి అలంకారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారి మూలమూర్తికి పట్టువస్త్రాల సమర్పణ, పూలాంగి సేవ నిర్వహించారు. తదుపరి అమ్మవారి ఉత్సవ మూర్తికి పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, పలు రకాలైన సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో ప్రత్యేకంగా స్నపన తిరుమంజనం (అభిషేకం) నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తికి పూలాంగి సేవ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పద్మపీఠోత్సవం, ఆస్థాన సేవ నిర్వహించారు. తదుపరి అమ్మవారికి విజయ లక్ష్మీదేవి అలంకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గోపూజ ద్వారా ముక్కోటి దేవతల అనుగ్రహం



**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** ప్రతి నిత్యం గోపూజ చేయడం ద్వారా జనులకు ముక్కోటి దేవతల అనుగ్రహం లభిస్తుందని భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలోని మణిద్వీప మహా సంస్థానంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో 7వ రోజైన ఆదివారం ఉదయం 5 గంటలకు గర్భాలయంలోని శ్రీ లలితాంబికా దేవి, శ్రీ మహా లక్ష్మీదేవి, శ్రీ మహా సరస్వతీ దేవిలకు, శ్రీ మహా గణపతి, శ్రీ సుబ్రమణ్యేశ్వరల స్వాములకు అభిషేకాలు, సుప్రభాత సేవ నిర్వహించారు. ఉదయం 6.30కి వేదపారాయణం, శ్రీ మహా రుద్రాభిషేకం, శ్రీ లలితాంబికా దేవి, శ్రీ మహా లక్ష్మీదేవి, శ్రీ మహా సరస్వతీ దేవిల ఉత్సవ మూర్తులకు ఆశ్రమ వ్యవస్థాపకరాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తన స్వహస్తాలతో అభిషేకాలు, విశేష అర్చనలు, కమలార్చనలు, మహా మంగళ హారతులు నిర్వహించి, భక్తులకు దేవి నవరాత్రుల ప్రాముఖ్యతను అనుగ్రహ బాషణం చేశారు. 9.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఆశ్రమంలోని యాగశాలలో శ్రీ మహా గణేశ హోమం, శ్రీ లలితా సహస్రనామ హోమం, శ్రీ ఛండీ హోమం, నవగ్రహ శాంతి హోమం, శ్రీ లక్ష్మీ నృసింహ హోమం, శ్రీ అరుణ హోమం, శ్రీ ఆదిత్య హృదయ హోమం, శ్రీ సుబ్రమణ్య మూల మంత్ర హోమం, శ్రీ నాగేంద్ర మూలమంత్ర హోమం, శ్రీ సర్పసూక్త హోమాలు నిర్వహించి భగవతి విజయేశ్వరీ దేవి పూర్ణాహుతిని హోమగుండాలలో సమర్పించారు. సాయంత్రం 6.30కి మణిద్వీప మహా సంస్థానంలో సామూహిక శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన, రాత్రి శ్రీ లలితాంబికా దేవికి శ్రీ శాఖాంబరీ దేవి అలంకారం నిర్వహించి, గజ వాహనంపై ఆశ్రమంలోని మాఢవీదులలో క్షేత్రోత్సవం నిర్వహించారు.

29-9P g7exHMNWJQE 11_29-9P g7exHMNWJQE.qxd 9/29/2025 12:03 AM Page 1



# మూలా నక్షత్రం సందర్భంగా విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

● ప్రజలు సహకరించాలి: సీపీ రాజశేఖరబాబు



**విజయవాడ క్రైం, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** దసరా పండుగ నవరాత్రుల్లో అమ్మవారి జన్మ నక్షత్రం మూల నక్షత్రం సందర్భంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునే ఆనవాయితీ ఉన్నందున అమ్మవారి టెంపుల్‌కి వచ్చే భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్‌ను డైవర్షన్ చేయనున్నట్లు విజయవాడ సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. పున్నమిఘాట్ ఎంట్రెన్స్ (కుమ్మరిపాలెం సెంటర్), తాడేపల్లి చెక్‌పోస్టు, ఆర్టీసి ఇన్‌గేట్, కనకదుర్గ ఫ్లై ఓవర్ ఎంట్రెన్స్, గద్ద బొమ్మ సెంటర్‌లను ట్రాఫిక్ డైవర్షన్ ప్రాంతాలుగా గుర్తించామన్నారు. సదరు డైవర్షన్ ప్రాంతాల వైపు నుండి ఆదివారం రాత్రి 7.30 గంటల నుండి సెప్టెంబరు 30వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఎటువంటి వాహనాలను అమ్మవారి గుడి వైపు అనుమతించమని ఆయన స్పష్టం చేశారు.

- తాడేపల్లి చెక్‌పోస్ట్ నుండి బ్యారేజీ వైపుకు వచ్చే వాహనాలను కనకదుర్గ వారధి వైపు నుండి మళ్ళించనున్నట్లు తెలిపారు.
- గుంటూరు వారధి వైపు నుండి భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం వైపు వెళ్ళాల్సిన వాహనదారులు కనకదుర్గ ఫ్లై ఓవర్ మీదుగా మళ్ళించనున్నామన్నారు.
- జగ్గయ్యపేట వైపు నుండి భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం వైపు వెళ్ళాల్సిన వాహనదారులను గద్దబొమ్మ సెంటర్ మీదుగా, కాళేశ్వరరావు మార్కెట్, పంజా సెంటర్, విజి చౌక్, చిట్టినగర్, స్వరంగం మీదుగా మళ్ళించనున్నామన్నారు.
- పున్నమిఘాట్, కుమ్మరిపాలెం వైపు నుండి నగరంలోకి వచ్చే వాహనాలను గుప్తా సెంటర్ మీదుగా సితార జంక్షన్, సొరంగం, చిట్టినగర్, ఎర్రకట్ట, బిఆర్టీఎస్ వైపుగా మళ్ళించనున్నట్లు ప్రకటించారు.
- ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వై జంక్షన్ మీదుగా సితార జంక్షన్, సివిఆర్ ఫ్లై ఓవర్, పైపుల రోడ్డు, సింగ్‌నగర్ వైపుకు మళ్ళించనున్నామన్నారు.
- విజయవాడ సిటీ నుండి ఆర్టీసి ఇన్‌గేట్ వైపు నుండి రాష్ట్ర సచివాలయానికి హైకోర్టు, రాజధాని అమరావతి వైపుకు వెళ్ళే వాహనదారులు కనకదుర్గ ఫ్లై ఓవర్ మీదుగా భవానీపురం, గొల్లపూడి వద్ద బైపాస్ రోడ్డు మీదుగా కాని కనకదుర్గ వారధి, తాడేపల్లి మీదుగా కాని వాహనాలను మళ్ళించనున్నామన్నారు.
- హైదరాబాద్, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వైపు నుండి వచ్చే వాహనాలను బబ్బూరి గ్రౌండ్, పున్నమిఘాట్, భవానీపురం లారీస్టాండ్, టీటీడీ ఖాళీ స్థల ప్రదేశం, ఆర్టీసి వర్క్‌షాపు రోడ్‌ల నుండి వచ్చే పెద్ద వాహనాలైన బస్సులకు సోమవారి ఖాళీస్థలంను పార్కింగ్ ప్రదేశాలుగా గుర్తించామన్నారు.
- గద్ద బొమ్మ వరకు వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలను కాళేశ్వరరావు మార్కెట్ సెల్లార్, గాంధీ మున్సిపల్ హైస్కూలు రోడ్డులను పార్కింగ్ ప్రదేశాలుగా గుర్తించామన్నారు.
- విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు వైపు నుండి వచ్చే వాహనాలకు వెస్ట్ బైపాస్ మీదుటా సితార జంక్షన్ వద్ద ఉన్న పార్కింగ్ ప్రదేశాన్ని గుర్తించామన్నారు.
- గుంటూరు, అవనిగడ్డ, మచిలీపట్నం వైపు నుండి వచ్చే వాహనాలను బిఆర్టీఎస్ రోడ్డులో పార్కింగ్ చేసుకోవాలన్నారు.
- గుంటూరు, అవనిగడ్డ, మచిటీపట్నం వైపు నుండి వచ్చే వాహనాలకు బిఆర్టీసి రోడ్డులో పార్కింగ్ చేయాలని తెలిపారు.

కావున దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు, విజయవాడ పరిసర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు పై పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని ఆయన కోరారు. విజయవాడ నగరవాసులు, విజయవాడ పరిసర ప్రాంతాల్లో నివసించే స్థానిక ప్రజలు మూలా నక్షత్రం సందర్భంగా అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా ఉండేందుకు పైన తెలిపిన డైవర్షన్ మార్గాల వైపు నుండి ప్రయాణించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# ఆర్డిటిని రక్షించుకుంటాం

**మరో పొలికేకతో ఆందోళనకు ప్రజా సంఘాలు సన్నద్ధం**

**అనంతపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఏ లైసెన్సీ ఇప్పించే విషయంలో విఫలమవుతోందని ఆర్డిటి పరిరక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మరో పొలికేక పేరుతో జనాన్ని సమీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలో ఆందోళనకు సన్నద్ధమవుతోంది. అందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్‌ని కలిసి ఆర్డిటి సమస్యను విన్నవించాలని ఆర్డిటి పరీక్షల కమిటీ నేతలు సన్నాహాల్లో ఉన్నారు. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తగు రీతిలో స్పందించకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ఆర్డిటి పరిరక్షణ కమిటీ ప్రత్యేకంగా ప్రయత్నాలు చేస్తోంది. ఆర్డిటి పరిరక్షణ కోసం కూటమి పెద్దలు మాట్లాడుతున్న మాటలను ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు విశ్వసించడం లేదు. గత ఆరు నెలలుగా చెప్పిన మాటలే చెబుతున్నారు గాని సమస్య మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉన్నది. ఆర్డిటి పరిరక్షణ కమిటీ ప్రకటించిన ఉద్యమ కార్యాచరణకు జిల్లా ప్రజలు, అన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు సిద్ధంగా ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాలలో దసరా పండుగను సైతం బహిష్కరించినా పండుగ పట్ల ప్రజలలో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయకుండా, ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదనే సదుద్దేశంతో పండుగ తర్వాతనే ఉద్యమంలోకి వెళ్లాలని నిర్ణయించారు. అందులో భాగంగా సోమవారం నిర్వహించ తలపెట్టిన "కేంద్ర కార్యాలయాల ముట్టడి" కార్యక్రమాన్ని వాయిదా వేసింది. ఆ కార్యక్రమం స్థానంలో సోమవారం జిల్లాకు కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్‌ను కలసి అర్డీటీ పరిరక్షణ కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని అందజేయాలని నిర్ణయించారు. అన్ని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆదివారంనాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆర్డిటి వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ ఎక్కడో పుట్టి ఇక్కడికి వచ్చి పేదలను అక్కున చేర్చుకున్న ఆర్డిటి వ్యవస్థాపకులు ఫెర్రర్ గారు ఫాదర్(తండ్రి) అయితే ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగిన ప్రభుత్వ పెద్దలు ఆర్డీటిని నిలుపుకోలేక చతికిలపడి, దోషి (నేరస్తుడు)గా నిలబడ్డారని, దీనిని బట్టి ఎక్కడ పుట్టారు అన్నది ముఖ్యం కాదని, పుట్టిన తరువాత జన్మభూమికి ఏమి చేశారన్నదే ప్రధానం. అందుకే ఆర్డిటి పరిరక్షణ జరగకపోతే జిల్లా ప్రజలు ఏ త్యాగాలకైనా సిద్ధపడతారని నాయకులు హెచ్చరించారు. ఆర్డిటిని పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని, పాలక ప్రభుత్వాల దిగివచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి పరిరక్షణ కమిటీ కన్వీనర్ సాకే హరి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ రమణ, ఐఎఫ్టియు డి సురేష్, ఐఎంఎం భాష, బహుజన యువసేన చంద్రాచర్ల హరి, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి తరుపున హరినాథ్ రెడ్డి, లక్ష్మీదేవి, బేడ బుడగ జంగం అంజి, ఎంఆర్పిఎస్ చిన్న ఆంజనేయులు, బడికి రాజు, సామాజిక ఐక్యవేదిక శంకర, కుళ్ళాయప్ప, కళాకారులు ఎర్రిస్వామి, ఈశ్వర్, రామకృష్ణ, సూర్యనారాయణ, సంజీవ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




ఆర్డిటి వ్యవస్థాపకులు పాదాలు విన్సెంట్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఆందోళనకారులు



# సౌర విద్యుత్ గ్రామంగా కొండారెడ్డిపల్లి

రూ.10.50 కోట్లతో ఏర్పాటు ● దేశంలో రెండోది తెలంగాణ సిఎం స్వగ్రామం

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** దేశంలో రెండో గ్రామం, దక్షిణ భారత దేశంలో మొదటి గ్రామం సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి గుర్తింపు పొందనుంది. ఈ మేరకు పౌరసంబంధాల శాఖ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలంలో అచ్చంపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న కొండారెడ్డిపల్లిలో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. రాష్ట్ర రెడ్కో ద్వారా రూ.10.53 కోట్లతో 514 ఇండ్లతో, పాటు 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి ఇంటికి 3 కెడబ్ల్యూ స్థాపిత సామర్థ్యంతో 480 ఇండ్లకు సౌర విద్యుత్ వసతిని కల్పించారు. అలాగే 60 కెడబ్ల్యూ సామర్థ్యం కలిగిన 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ పరికరాలు బిగించారు. మొత్తం సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థం 1,500 కెడబ్ల్యూగా ఉంది. మట్టి గోడలతో ఉన్న 34 ఇండ్ల కుటుంబాలు కూడా సౌర విద్యుత్ పరికరాలు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయి. ఈ కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే, ఇండ్ల పైన సౌర విద్యుత్ పరికరాలు బిగించనున్నట్లు రెడ్కో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మేనేజర్ కె.మనోహర్‌రెడ్డి తెలిపారు. కొండారెడ్డిపల్లిలో సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.10.53 కోట్లు కాగా, అందులో రూ.7.96 కోట్ల వ్యయంతో సౌర విద్యుత్ పరికరాలు ఏర్పాటుకు కేటాయించారు. సౌర విద్యుత్ నిమిత్తం కేంద్రం సబ్సిడీ కింద రూ.3.56 కోట్లు, ప్రైవేటు కంపెనీ నుండి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీగా రూ4.092 కోట్లు భరించాయి. మరో రూ.2.59 కోట్లను మౌలిక వసతుల అభివృద్ధికి ఖర్చు చేశారు. కాగా ప్రతి ఇంటి నుండి నెలకు 360 యూనిట్స్ విద్యుత్ ఉత్పత్తి (రోజుకు 120 యూనిట్లు) అవుతుంది. ఇండ్ల నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఇంటి వినియోగానికి పోగా, మిగిలిన విద్యుత్ ను గ్రిడ్ కు అనుసంధానం చేశారు. గ్రిడ్‌కు పంపే విద్యుత్ యూనిట్‌కు రూ.5.25 చొప్పున చెల్లించుటకు లబ్దిదారులతో విద్యుత్ పంపిణీ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ నెలలో విద్యుత్ గ్రిడ్‌కు గ్రామం నుండి సుమారు లక్ష యూనిట్ల విద్యుత్ ఎగుమతి అయింది. తద్వారా రూ.5 లక్షలు ఆదాయాన్ని గ్రామస్తులు ఒక నెలలోనే ఆర్జించినట్లు పౌరసంబంధాల శాఖ వెల్లడించింది.

# నాకు పదేళ్లు పవరిస్తే.. న్యూయార్క్‌లా 'ఫ్యూచర్ సిటీ'



- పదేళ్లలో మరో మహా నగరాన్ని నిర్మిస్తా
- 500 ఫార్చ్యూన్ కంపెనీలు కొలువుదీరుతాయి
- యేడాదిలోగా అద్భుతమైన సింగరేణి కార్యాలయం
- బుల్లెట్ రైలుకు అనుమతించిన కేంద్రం
- ప్రపంచ దేశాలను తలదన్నేలా నిర్మాణాలు
- కొత్త సిటీకి భూమి పూజ చేసిన టి సిఎం రేవంత్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** భవిష్యత్ తరాల కోసమే ఫ్యూచర్ సిటీ అని, పదేళ్లలో న్యూయార్క్‌ను మరిపించే నగరాన్ని నిర్మిస్తామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కందుకూర్ మండలం మీర్‌ఖాన్‌పేటలో నిర్మించనున్న ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ దేశాలను తలదన్నే విధంగా మన భారత ఫ్యూచర్ సిటీ నిర్మాణాలు కొనసాగుతాయని అందుకనుగుణంగా మౌలిక సదుపాయాలు కూడా ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే గుర్తింపు పొందిన అంతర్జాతీయ విమానాశ్రయం, సారవంతమైన భూములు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు ఈ సిటీకి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నాడు 436 సంవత్సరాల క్రితం కులీ కుతుబ్ షా ఎంతో అద్భుతంగా మన హైదరాబాద్ నగరానికి శ్రీరాకం చుట్టారని గుర్తుచేశారు. సికింద్రాబాద్ ను నాటి 220 సంవత్సరాల క్రితం నిజాం నవాబ్ నిర్మించిన విషయాలన్ని ఆయన గుర్తుచేశారు. నవాబ్‌లు హైదరాబాద్, సికింద్రాబాద్‌లను నిర్మిస్తే నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిలు సైబరాబాద్, హైటెక్ సిటీ, ఓఆర్ఆర్ ఔటర్ రింగు రోడ్డుల నిర్మాణంతో మన హైదరాబాద్ కు ఒక గుర్తింపును తీసుకువచ్చారని, అందులో బాగంగానే భవిష్యత్ కోసం తమ కాంగ్రెస్ ప్రభుత్వం భారత ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రపంచంలోనే ఒక అద్భుతమైన ఒక గొప్ప నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. తెలంగాణలోని నాలుగు కోట్ల జనాభాలో అనేక మంది ఇతర దేశాల అద్భుతాలు, ఆ నగరాల మోళిక సదుపాయాలను గుర్తుచేస్తూ అమ్మో... అయ్యో , దేవుడా అంటూ సింగాపూర్, దుబాయ్, జపాన్ ను జర్మని ఇలా అనేక దేశాల గురించి వర్ణించడం చూస్తున్నామని భవిష్యత్ లో మన ఫ్యూచర్ సిటీని ప్రపంచ దేశాలలోని అందరు కూడా మన ఫ్యూచర్ సిటీ అద్భుతాలను, అందమైన రోడ్లను, మోళిక సదుపాయాలను వర్ణించే విధంగా తీర్చిదిద్దేందుకు మరో 10 సంవత్సరాలు అవకాశమివ్వాలని రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ గొప్ప నగరానికి అన్ని హంగులతో కూడిన రహదారులు, విద్యుత్, మెట్రో రైళ్ల తదితర సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రధాన జంక్షన్ నుండి బెంగుళూర్ వరకు రోడ్డు నిర్మాణంతో పాటు బుల్లెట్ రైలు ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని, అమరావతి ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి అక్కడి నుండి మద్రాస్ నుంచి మరో బుల్లెట్ రైలును అనుసందానం చేస్తూ కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. దక్షిణ భారత దేశంలో పోర్టు అందుబాటులో లేని రాష్ట్రం ఒక తెలంగాణానే ఉందని, ఇక్కడి నుంచి ఎగుమతులు, దిగుమతులు చేసుకోవడానికి ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి మీదుగా మచిలీ పట్నం పోర్టు వరకు రైలు మార్గాన్ని సైతం ఏర్పాటు చేయడానికి కేంద్రం నుండి అనుమతులు వచ్చాయని తెలిపారు.

### 70 ఏళ్ల తర్వాత కూడా మన గురించి ప్రపంచం మాట్లాడుకునే పనులు చేయొద్దా?

భారత్ ఫ్యూచర్ సిటీకి ఏం తక్కువ? అన్ని అవకాశాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి చెన్నైకి బుల్లెట్ ట్రైన్(వయా అమరావతి)కి కేంద్రం ఒప్పుకొంది. ఇక్కడ 500 ఫార్చ్యూన్ కంపెనీలు కొలువు తీరాలన్నది నా స్వప్నం. హైదరాబాద్‌లో ప్రస్తుతం 80 ఫార్చ్యూన్ కంపెనీలే ఉన్నాయి. ఫ్యూచర్ సిటీ విషయంలో చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకుంటాం. ఈ విషయాలకు కోర్టులకు వెళ్లి ఇబ్బంది పడవద్దు. అభివృద్ధి పనుల వల్ల నష్టపోయేవారిని అన్నివిధాలా ఆదుకుంటాం. దక్షిణ భారతంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. అందుకే ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నానికి 12 లేన్ల రోడ్డు వేయబోతున్నాం. ఫ్యూచర్సిటీ డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ వర్సిటీలను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం. డిసెంబర్ నుంచి ముఖ్యమైన కార్యక్రమాలు ఎఫ్సీడీఏ నుంచే చేపడతాం. సింగరేణికి పదెకరాల భూమి ఫ్యూచర్ సిటీలో కేటాయిస్తాం. ఏడాది తిరిగే లోగా సింగరేణి కార్యాలయం నిర్మాణం పూర్తి కావాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీ డవలప్‌మెంట్ ఆదారిటీ భవనాన్ని డిసెంబర్‌లోగా ప్రారంభిస్తామని, తాను నెలకు రెండు లేదా మూడు సార్లు ఇక్కడి భవనం నుంచి రాష్ట్ర పాలన వ్యవహారాలను కొనసాగిస్తానని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబులు పూచర్ సిటీ వ్యవహారాలను పరిశీలిస్తుంటారని ఆయన రేవంత్ రెడ్డి తెలిపారు. ఇక్కడ ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు సముచిత న్యాయం కల్పిస్తామని, వారికి ప్లాట్లు ఇతర నష్టపరిహారాన్ని అందించడానికి మహేశ్వరం ఇంచార్జ్ కెఎల్ఆర్, ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, స్థానికంగా ఫ్యూచర్ సిటీ రైతుల సమస్యలను దగ్గరుండి పరిష్కరించాలని, వారికి అందుబాటులో ఉంటూ వారికి చేయూతనివ్వాలని ఆయన సూచించారు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో భూములను కల్పోయిన రైతులకు పట్టాలు, ప్లాట్లు పంపిణీ చేయడం జరిగిందని, వారికి ఇందిరమ్మ పథకం క్రింద ఇండ్లు నిర్మించేందుకు సైతం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, కార్పోరేషన్ చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, రాంరెడ్డి, మాజీ శాసన సభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఫ్యూచర్ సిటీ డవలప్‌మెంట్ కమిషనర్ శశాంక, టీజీఐసీసీ చైర్ పర్చన్ నిర్మల జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఫ్యూచర్ సిటీ నా కోసం కాదు భవిష్యత్ తరాల కోసమే.**

తనకు ఇక్కడ భూములున్నందు వల్లే ఫ్యూచర్ సిటీ కడుతున్నారని అంటున్నారని పేర్కొన్నారు. తన కోసం కాదు.. భవిష్యత్తు తరాల కోసమే ఫ్యూచర్ సిటీ అని వివరించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీరాఖాన్ పేటలో ఫ్యూచర్సిటీ డెవలప్మెంట్ అథారిటీ(ఎఫ్సీడీఏ) కార్యాలయానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. చంద్రబాబు, వైఎస్ఆర్ ముందు తరాల కోసం ఆలోచించారు. అందువల్లే హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్పోర్టు, ఓఆర్ఆర్ వచ్చాయి. గత పాలకుల నుంచి మంచి ఉంటే నేర్చుకోవాలి. చాలా మంది విదేశాలకు వెళ్లి వచ్చి అద్భుతంగా ఉన్నాయని చెబుతున్నారు. ఎన్నాళ్లు న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ గురించి చెప్పుకొంటాం.. మనం కూడా అలా తయారు కావాలి కదా. నాకు పదేళ్లు సమయం ఇవ్వండి.. న్యూయార్క్ మరిపించే నగరం కడతామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు.

# పోస్టులు: 783 ఎంపిక: 782

● గ్రూప్-2 ఫలితాలు విడుదల
● ఒక పోస్టును నిలిపేసిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 783 గ్రూప్-2 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) ఆదివారం ప్రకటించింది. ఫలితాలను టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం ఆదివారం కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులతో కలిసి విడుదల చేశారు. మొత్తం 18 ప్రభుత్వ శాఖల్లోని 783 పోస్టులకు సంబంధించి.. ఎంపికైన 782 మంది జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఛైర్మన్ తెలిపారు. 783 పోస్టులకు గానూ 782 పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ప్రకటించిన కమిషననఒక వెకెన్సీని విత్ హెల్డ్‌లో పెట్టినట్లు ప్రకటించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత రెండోసారి గ్రూప్-2 నోటిఫికేషన్‌ను 2022లో విడుదల చేయగా, 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించారు. సుమారు 5 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వారిలో పరీక్షకు 2,49,964 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఓఎంఆర్ పత్రాల్లో లోపాలు, బబ్లింగ్ సరిగా చేయకపోవడం వంటి కారణాలతో 13,315 మందిని కమిషన్ అనర్హులుగా ప్రకటించింది. మిగిలిన 2,36,649 మంది అభ్యర్థులకు సంబంధించిన మార్కులు, జనరల్ ర్యాంక్ లిస్ట్‌ను ఈ ఏడాది మార్చి 11న టీజీపీఎస్సీ విడుదల చేయగా.. వివిధ కోర్టు కేసుల అనంతరం ఆదివారం గ్రూప్-2 తుది ఫలితాలను టీజీపిఎస్‌సీ ప్రకటించింది.

# జూబ్లీహిల్స్ బైపోల్‌కు సెంట్రల్ అబ్జర్వర్ నియామకం

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, తెలంగాణతో పాటు ఏడు అసెంబ్లీ ఉప ఎన్నికలకు జనరల్, పోలీస్, ఎక్స్‌పెండిచర్ పరిశీలకులుగా 470 మంది అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదివారం నాడు నియమించింది. ఎన్నికలు సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేలా అధికారులు తమ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. 470 మంది అధికారుల్లో 320 మంది ఐఏఎస్‌లు, 60 మంది ఐపీఎస్‌లు, 90 మంది ఐఆర్ఎస్, ఐఆర్ఏఎస్, ఐసీఏఎస్ సర్వీసులకు చెందిన వారు ఉన్నారు. ఎన్నికల పరిశీలకులు బిహార్‌లోని నియోజక వర్గాలతోపాటు బుద్గాం, నగ్రోటా (జమ్మూ అండ్ కశ్మీర్), అంతా (రాజస్థాన్), ఘాట్‌సిలా (జార్ఖాండ్), జూబ్లీహిల్స్ (తెలంగాణ), తరన్ తారన్ (పంజాబ్), డంపా (జార్ఖండ్), నువాపడా (ఒడిశా)లో పని చేయనున్నారు. రాజ్యాంగ నిర్దేశించిన ప్రకారం ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌కు పరిశీలకులు సహకరిస్తారని, ఎప్పటికప్పుడు కమిషన్‌కు రిపోర్ట్ చేస్తుంటారని ఎలక్షన్ కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల్లో తమకున్న సీనియారిటీ, సుదీర్ఘ అనుభవంతో ఎన్నికల సజావుగా జరిగేందుకు వీరంతా ఈసీకి సహకరిస్తారని, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లను నియమించామని పేర్కొంది. కాగా, తెలంగాణలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతితో బై ఎలక్షన్ అనివార్యమైన విషయం తెలిసిందే. ఈ స్థానానికి బిఆర్ఎస్ నుంచి గోపినాథ్ సతీమణి సునీత పోటీ చేయనుండగా ఇతర పార్టీలు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించాల్సి ఉంది.

# విహెచ్ పేరుతో బతుకమ్మ కుంట



- తన జీవితాశయంగా పోరాటం చేశారు
- అగ్గువకు వస్తుందని ప్రభుత్వ భూములు కొనొద్దు
- మూసీ పునరుజ్జీవనానికి అతీతంగా కలిసిరావాలి
- బతుకమ్మకుంట ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** ఆడబిడ్డలను మన సంతోషంలో భాగస్వాములను చేసినప్పుడే బతుకమ్మ పండుగకు నిండుదనం వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అంబర్‌పేటలో పునరుద్ధరించిన బతుకమ్మ కుంట ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం.. చెరువులో బతుకమ్మలు వదిలి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎంపీ వి.హనుమంతరావు తన జీవితాశయంగా బతుకమ్మ కుంట కోసం పోరాడారని కొనియాడారు. హైడ్రా ఏర్పాటు చేసినప్పుడు కొంతమందికి దాని ఉద్దేశం అర్థం కాలేదని.. మరికొందరు అర్థమైనా కబ్జాలను కాపాడుకునే ప్రయత్నం చేశారని తమ ప్రభుత్వంపై చాలా విమర్శలు వచ్చినప్పటికీ ఒడిదుడుకులను సమయస్ఫూర్తితో పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లామన్నారు. ఒకప్పుడు జీవధారగా ఉన్న మూసీ నది ఇప్పుడు మురికి కూపంగా మారిందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "రాజకీయాలకు అతీతంగా మూసీ పునరుజ్జీవానికి అందరూ కలిసి రావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. వర్షం వస్తే గంటలో మూసీ పరివాహక కాలనీలు జలమయం అవుతున్నాయని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A, NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14